www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 24-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 279 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 9.51 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పునర్వసు పూర్తి; వర్జ్యం: రా. 7.22-9.05; దుర్ముహూర్తం: మ. 12.05-12.50; అమృతఘడియలు: తె. 5.42 మొదలు; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 24 జనవరి 2024

ఐసీసీ వన్డే టీమ్ కెప్టెన్‌గా రోహిత్

దుబాయ్: గతేడాదికి సంబంధించి అత్యుత్తమ ఆటగాళ్లతో ఐసీసీ వన్డే జట్టును రూపొందించింది. దీనికి రోహిత్ శర్మను కెప్టెన్‌గా నియమించడం విశేషం. ఈ టీమ్‌లో మొత్తంగా ఆరుగురు భారత ఆటగాళ్లకు చోటు కల్పించింది. ఇందులో విరాట్, గిల్, స్పిన్నర్ కుల్దీప్, పేసర్లు సిరాజ్, షమిలున్నారు. ఐసీసీ టెస్టు జట్టులో భారత్ నుంచి స్పిన్ ద్వయం జడేజా, అశ్విన్‌లకు మాత్రమే చోటు దక్కింది.

ఐసీసీ వన్డే టీమ్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, సిరాజ్, షమి, కుల్దీప్ (భారత్), ట్రావిస్ హెడ్, జంపా (ఆసీస్), మిచెల్ (కివీస్), క్లాసెన్, జాన్సెన్ (సౌతాఫ్రికా).

టెస్టు జట్టు: కమిన్స్ (కెప్టెన్), ఖవాజా, హెడ్, క్యారీ, స్టార్క్ (ఆసీస్), కరుణరత్నె (శ్రీలంక), విలియమ్సన్ (కివీస్), రూట్, బ్రాడ్(ఇంగ్లండ్), జడేజా, అశ్విన్ (భారత్).



ప్రాక్టీస్‌లో స్టోక్స్

చెమటోడ్చిన టీమిండియా

నెట్ ప్రాక్టీసులో శ్రేయా‌స్‌కు గాయం


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియంలో జరగనున్న తొలి టెస్టులో సత్తా చాటేందుకు భారత్-ఇంగ్లండ్ జట్లు ప్రాక్టీసు డోసును పెంచాయి. మంగళవారం ఉదయం ఇంగ్లండ్ క్రికెటర్లు నెట్ ప్రాక్టీసులో పాల్గొనగా, మధ్యాహ్నం భారత ఆటగాళ్లు ముమ్మరంగా సాధన చేశారు. బుమ్రా మినహా మిగిలిన క్రికెటర్లందరూ ప్రాక్టీసు సెషన్‌లో పాల్గొన్నారు. తొలుత ఇంగ్లండ్ క్రికెటర్లు ప్రధాన స్టేడియంలో వామప్, ఫీల్డింగ్.. తర్వాత నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. మధ్యాహ్నం ప్రాక్టీసులో భారత కెప్టెన్ రోహిత్ చాలా సేపు త్రోడౌన్స్ ఎదుర్కొంటూ కనిపించాడు. జైస్వాల్, గిల్ బ్యాటింగ్ చేయగా.. వీరికి అశ్విన్, సిరాజ్, ముకేశ్, స్థానిక బౌలర్లు బంతులేశారు. ప్రాక్టీసులో భాగంగా త్రోడౌన్ స్పెషలిస్ట్ నువాన్ విసిరిన బంతి శ్రేయాస్ అయ్యర్ కుడి ముంజేతికి బలంగా తాకింది. దీంతో విలవిల్లాడిన శ్రేయాస్ కాస్త విరామం తర్వాత ప్రాక్టీస్‌కొచ్చాడు.

ఉప్పల్‌లో మోగనున్న గంట!

లార్డ్స్, ఈడెన్ గార్డెన్స్ మైదానాల్లో టెస్టు మ్యాచ్‌కు గంట మోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని ఉప్పల్ స్టేడియంలోనూ ప్రారంభించాలని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు నిర్ణయించారు. ఈ మేరకు స్టేడియంలోని దక్షిణం వైపున్న క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్ ముందు గంటను ఏర్పాటు చేశారు. గురువారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగే తొలిటెస్టును సునీల్ గవాస్కర్ గంట మోగించి ప్రారంభిస్తాడు.

ఉత్తమ క్రికెటర్లు గిల్, దీప్తి

రవిశాస్త్రి, ఫరూక్‌కు జీవన సాఫల్యం
మేఘనకు ఉత్తమ అరంగేట్ర పురస్కారం
ఘనంగా బీసీసీఐ అవార్డుల ప్రదానం







హైదరాబాద్: నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ, దేశవాళీ ఆటగాళ్లకు బీసీసీఐ తమ అవార్డులను ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో భారత పురుషుల జట్టుతో పాటు మహిళల జట్టు ఆటగాళ్లంతా పాల్గొన్నారు. అలాగే టెస్టు సిరీస్ కోసం ఇక్కడే ఉన్న ఇంగ్లండ్ జట్టును కూడా ఆహ్వానించారు. 2019 తర్వాత బీసీసీఐ అవార్డులను ప్రకటించడం ఇదే తొలిసారి. అందుకే 2019-20, 2020-21, 2021-22, 2022-23 ఏడాదికిగాను వివిధ విభాగాల కింద ఒకేసారి పురస్కారాలను ప్రదానం చేశారు. దీంట్లో భాగంగా 2022-23 ఏడాదికిగాను పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. అంతకుముందు ఉత్తమ క్రికెటర్లుగా షమి (2019), అశ్విన్ (2020), బుమ్రా (2021)కు ఈ అవార్డు దక్కింది. మహిళల్లో ఉత్తమ క్రికెటర్లుగా దీప్తి శర్మ (2019-2022, 2022-23), స్మృతి మంధాన (2020-21, 2021-22) ఎంపికయ్యారు. తెలుగమ్మాయి సబ్బినేని మేఘన 2021కి గాను ఉత్తమ అరంగేట్రం అవార్డుకు ఎంపికైంది. సీకే నాయుడు జీవన సాఫల్య పురస్కారం రవిశాస్త్రి, ఫరూక్ ఇంజనీర్లను వరించింది.

ఇతర అవార్డులను ఓసారి పరిశీలిస్తే..

ఉత్తమ అరంగేట్రం
మయాంక్ అగర్వాల్ (2019), అక్షర్ పటేల్ (2020), శ్రేయాస్ (2021), జైస్వాల్ (2022). మహిళల్లో ప్రియా పూనియా (2019), షఫాలీ వర్మ (2020), సబ్బినేని మేఘన (2021), అమన్‌జోత్ (2022).

దేశవాళీల్లో ఉత్తమ ఆల్‌రౌండర్
బాబా అపరాజిత్ (2019), రిషి ధవన్ (2020, 2021), రియాన్ పరాగ్ (2021).

రంజీల్లో అత్యధిక పరుగులు
రాహుల్ దలాల్ (2019), సర్ఫరాజ్ (2021), మయాంక్ (2022).

స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే రాహుల్



హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు టెస్టుల సిరీస్‌లో కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ చేయడని కోచ్ ద్రవిడ్ స్పష్టం చేశాడు. అతడు కేవలం బ్యాటర్‌గానే సేవలందిస్తాడని, టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపాడు. దీంట్లో భాగంగానే కేఎస్ భరత్, ధ్రువ్ జురెల్‌లను అదనపు వికెట్ కీపర్లుగా ఎంపిక చేశామని గుర్తుచేశాడు. రాహుల్‌పై అధిక భారం పడకూడదు కాబట్టి ఆ ఇద్దరి నుంచి ఒకరు తుది జట్టులో కీపర్‌గా వ్యవహరిస్తారని తెలిపాడు. ఇద్దరూ చక్కటి ఫామ్‌లో ఉండడంతో ఎంపిక కష్టం కానుందన్నాడు.

పుణె, ముంబా మ్యాచ్ టై



హైదరాబాద్: ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ప్రణయ్ రాణె బోనస్ పాయింట్‌తో యు ముంబా డ్రాతో గట్టెక్కింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం యు ముంబా, పుణెరి పల్టన్ మధ్య జరిగిన మ్యాచ్ 32-32తో టైగా ముగిసింది. ముంబా రైడర్ గుమాన్ సింగ్ 15 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. డిఫెండర్ గోకుల్ కన్నన్ 6 టాకిలింగ్స్ చేయడం విశేషం. పుణె తరఫున అస్లాం 8 పాయింట్లు, మోహిత్ 7 పాయింట్లు సాధించారు. లీగ్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగియడం ఇది మూడోసారి.

సాత్విక్-చిరాగ్.. నెంబర్ వన్

మళ్లీ టాప్ ర్యాంక్ కైవసం



న్యూఢిల్లీ: గత రెండు వారాలు అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో అలరించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రపీఠాన్ని దక్కించుకున్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం ఓ స్థానం మెరుగుపరచుకొని నెంబర్‌వన్‌గా నిలిచింది. టాప్ ర్యాంక్ అందుకోవడం సాత్విక్ జంటకిది రెండోసారి. గతేడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన తర్వాత భారత ద్వయం టాప్ ర్యాంకర్‌గా అవతరించింది. సాత్విక్ జోడీ గతవారం ఇండియా ఓపెన్, అంతకుముందు వారం మలేసియా ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 8, లక్ష్యసేన్ 19, కిడాంబి శ్రీకాంత్ 25, ప్రియాన్షు రజావత్ 30వ ర్యాంకుల్లో ఉన్నారు.

జొకో.. తగ్గేదేలె

ఆస్ట్రేలియన్ ఓపెన్

11వ సారి సెమీస్‌కు

మహిళల్లో గాఫ్, సబలెంక



సబలెంక

గాఫ్

మెల్‌బోర్న్: పురుషుల డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ తనకచ్చొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దుమ్మురేపుతున్నాడు. ఈ సెర్బియా కింగ్ రికార్డుస్థాయిలో 11వ సారి మెల్‌బోర్న్‌లో సెమీఫైనల్లో ప్రవేశించాడు. మంగళవారం 3 గంటలా 45 నిమిషాల పాటు జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ 7-6(3), 4-6, 6-2, 6-3తో అమెరికాకు చెందిన 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌పై గెలుపొందాడు. ఈ వేదికపై సెమీస్ చేరిన పదిసార్లూ జొకోవిచ్ ట్రోఫీ విజేతగా నిలవడం విశేషం. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం చూస్తున్న జొకోవిచ్ ఫైనల్ బెర్త్ కోసం నాలుగో సీడ్, ఇటలీ స్టార్ జానిక్ సిన్నర్‌తో తలపడతాడు. మరో మ్యాచ్‌లో సిన్నర్ 6-4, 7-6(5), 6-3తో ఐదో సీడ్ ఆండ్రీ రుబ్లేవ్ (రష్యా)ను చిత్తుచేశాడు. కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోనున్న అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళుతోంది. ఈ 19 ఏళ్ల యువ కెరటం మహిళల సింగిల్స్‌లో సెమీఫైనల్ చేరింది. క్వార్టర్‌ఫైనల్లో నాలుగో సీడ్ గాఫ్ 7-6(6), 6-7(3), 6-2తో ఉక్రెయిన్ యువ సంచలనం మార్తా కొస్ట్యుక్‌ను ఓడించింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అరియానా సబలెంకతో గాఫ్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో రెండో సీడ్ సబలెంక (బెలారస్) 6-2, 6-3తో 9వ సీడ్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తుచేసింది.

వచ్చేనెల 23 నుంచి డబ్ల్యూపీఎల్

- షెడ్యూల్ విడుదల
- తొలి మ్యాచ్‌లో ఢిల్లీతో ముంబై ఢీ
- వేదికలుగా బెంగళూరు, ఢిల్లీ
- మార్చి 17న ఫైనల్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో అంచెకు రంగం సిద్ధమైంది. ఐదు జట్ల లీగ్‌ను వచ్చే నెల 23 నుంచి రెండు వేదికల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు 24 రోజులపాటు సాగే డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను బీసీసీఐ మంగళవారం విడుదల చేసింది. బెంగళూరులో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. మార్చి 15న ఎలిమినేటర్, 17న ఫైనల్ జరగనున్నాయి. మొత్తం 20 లీగ్ మ్యాచ్‌ల్లో టాప్‌లో నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా.. రెండు, మూడు స్థానాల్లో నిలిచే జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. బెంగళూరు అంచెను ఫిబ్రవరి 23 నుంచి మార్చి 4 వరకు.. ఢిల్లీ అంచెను మార్చి 5 నుంచి 17 వరకు షెడ్యూల్ చేశారు. బెంగళూరు తరహాలోనే ఢిల్లీ అంచె కూడా ముంబై, క్యాపిటల్స్ మధ్య మ్యాచ్‌తోనే మొదలవనుంది. ఐపీఎల్ మాదిరే అమ్మాయిల లీగ్‌ను కూడా ఇంటా, బయటా ఫార్మాట్‌లో నిర్వహించాలని బీసీసీఐ యోచించింది. కానీ, లాజిస్టిక్ సమస్యల కారణంగా రెండు వేదికలకే పరిమితం చేసింది. తొలి సీజన్ మొత్తం ముంబైలోనే జరిగిన సంగతి తెలిసిందే.

కరాటే చాంపియన్‌కు ఆర్థిక కష్టాలు

అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సాయం కోసం అభ్యర్థన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గిన్నిస్ బుక్ రికార్డులు, మార్షల్ ఆర్ట్స్‌లో డాక్టరేట్లు, అంతర్జాతీయ స్థాయిలో 75కు పైగా పతకాలు..ఇన్ని సాధించినా ఇప్పటికీ అతడిని ఆర్థిక కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన 47 ఏళ్ల పఠాన్ జమీల్ ఖాన్ మూడున్నర దశాబ్దాలుగా కరాటే, తైక్వాండో, కటాతో పాటు వివిధ మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్రానికి, దేశానికి ప్రాతినిథ్యం వహించి 100కి పైగా పతకాలు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన జమీల్ మార్షల్ ఆర్ట్సే ఊపిరిగా బతుకుతున్నాడు. తాజాగా ఈనెల 28వ తేదీ నుంచి ఇంగ్లండ్‌లో జరిగే అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొనేందుకు జమీల్ అర్హత సాధించాడు. అయితే, ఆ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. స్కూల్ విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తూ జీవనం సాగిస్తున్న జమీల్ ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో ప్రభుత్వం, దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఎవరైనా సాయం చేస్తే, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తానని జమీల్ చెబుతున్నాడు.

రికార్డుల వీరుడు: జమీల్ 2017లో కటాలో, 2018లో కరాటేలో గిన్నిస్ రికార్డులు నెలకొల్పాడు. ఇప్పటిదాకా అంతర్జాతీయస్థాయిలో 34 స్వర్ణాలు సహా 73 పతకాలు సాధించాడు. జాతీయస్థాయిలో 29 పసిడి సహా 50కి పైగా పతకాలు గెలిచాడు. అమెరికా విశ్వవిద్యాలయాల నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో 2 డాక్టరేట్లు అందుకున్నాడు.

బిజినెస్

గ్రాన్యూల్స్ లాభం రూ.126 కోట్లు

హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా.. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.126 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.124 కోట్లతో పోల్చితే లాభం ఒక శాతం పెరిగింది. కాగా ఈ కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,146 కోట్ల నుంచి రూ.1,156 కోట్లకు పెరిగింది. ఈ త్రైమాసికంలో తాము నిలకడ తీరును ప్రదర్శించామని.. ఇది ఎబిటా, నికర లాభంలో ప్రతిబింబించిందని గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ చిగురుపాటి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

తాన్లా లాభంలో 20 శాతం వృద్ధి

తాన్లా ప్లాట్‌ఫామ్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,002.60 కోట్ల ఆదాయంపై రూ.140.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 15.3 శాతం, లాభం 20.3 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.616. 20 కోట్ల విలువైన నగదు, నగదు సమానమైన నిల్వలున్నాయి. కాగా రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

- **తగ్గిన ఎన్ఎస్‌సీఎల్ లాభం**

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎన్ఎస్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.13.23 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.16 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.486.63 కోట్ల నుంచి రూ.355.63 కోట్లకు తగ్గింది.

- **పెరిగిన సైయెంట్ డీఎల్ఎం ఆదాయం**

సైయెంట్ డీఎల్ఎం.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.330.31 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.18.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.214.19 కోట్లుగా ఉండగా లాభం రూ.14.65 కోట్లుగా ఉంది.

4% పెరిగిన యాక్సిస్ బ్యాంక్ లాభం

ప్రైవేట్ రంగంలోని యాక్సిస్ బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ లాభం డిసెంబరు త్రైమాసికంలో 4 శాతం పెరిగి రూ.6,071 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.5,853 కోట్లు. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.26,798 కోట్ల నుంచి రూ.33,516 కోట్లకు పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో వడ్డీ ఆదాయం రూ.22,226 కోట్ల నుంచి రూ.27,961 కోట్లకు పెరిగినట్లు యాక్సిస్ బ్యాంక్ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ		విజయవాడ	558
హైదరాబాద్	540	విశాఖపట్నం	565
24 జనవరి		వరంగల్	542
చిత్తూరు	563	దజను గుడ్లు రూ.72	
గోదావరి	558		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	92	గోదావరి	101
వరంగల్	92	విజయవాడ	101
కరీంనగర్	92	గుంటూరు	102
మహబూబ్‌నగర్	92	ఒంగోలు	102
కర్నూలు	92	చిత్తూరు	100
విశాఖపట్నం	101		

మార్కెట్ మళ్లీ ధమాల్

రూ.8.5 లక్షల కోట్లు ఫట్

సెన్సెక్స్ 1,053 పాయింట్లు డౌన్ ● 21,300 దిగువ స్థాయికి నిఫ్టీ

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఆర్ఐఎల్, ఎస్‌బీఐ షేర్లలో భారీగా అమ్మకాలు ● చిన్న కంపెనీల షేర్లు విలవిల



ముంబై: భారత స్టాక్ మార్కెట్ మరో భారీ పతనాన్ని చవిచూసింది. బేర్ దెబ్బకు ప్రామాణిక సూచీలన్నీ కుప్పకూలాయి. మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో 450 పాయింట్ల వరకు లాభపడి 72,000 ఎగువకు చేరిన సెన్సెక్స్ క్రమంగా లాభాలు చేజార్చుకుంటూ రెండు గంటల్లోనే నష్టాల్లోకి మళ్లింది. ఆ తర్వాత నుంచి నష్టాలు పెరుగుతూ వచ్చాయి. చివరికి సూచీ 1,053.10 పాయింట్ల (1.47 శాతం) నష్టంతో 70,370.55 వద్దకు జారుకుంది. నిఫ్టీ కూడా 330.15 పాయింట్లు (1.53 శాతం) క్షీణించి 21,241.65 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు ప్రధాన కారణమైంది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయి. దాంతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.8.50 లక్షల కోట్లు తరిగిపోయి రూ.365.98 లక్షల కోట్లకు పడిపోయింది. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లలో అమ్మకాలే సెన్సెక్స్ నిఫ్టీ సగం నష్టాలకు కారణమయ్యాయి. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.95 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.79 శాతం పతనమయ్యాయి. హెల్త్‌కేర్ మినహా అన్ని రంగాల సూచీలు నేలచూపులు చూశాయి. బీఎస్ఈ రియల్టీ సూచీ ఏకంగా 5.46 శాతం క్షీణించింది. సర్వీసెస్ ఇండెక్స్ 4.06 శాతం నష్టపోయింది. మెటల్ 3.97 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 3.96 శాతం, ఎనర్జీ 3.70 శాతం, కమోడిటీస్ 3.02 శాతం తగ్గాయి.

ఫారెక్స్ మార్కెట్లోనూ డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు క్షీణించి 83.15 వద్ద ముగిసింది. ముడి చమురు ధరల పెరుగుదల, ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు మన కరెన్సీని బలహీనపరిచాయి. కాగా, అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 0.60 శాతం తగ్గి 79.58 డాలర్ల వద్ద ట్రేడైంది.

మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు

- ఎర్ర సముద్రంలో హౌతీ మిలిటెంట్ల దాడులతో దక్షిణాసియా దేశాల వాణిజ్యంపై ప్రభావం అధికంగా ఉండవచ్చని ఫిచ్ గ్రూప్ హెచ్చరికతో అంతర్జాతీయంగా మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది.

జీ షేరు 33 శాతం పతనం

సోనీతో విలీన ఒప్పందం రద్దవడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ధర బీఎస్ఈలో 32.73 శాతం క్షీణించి రూ.155.90 వద్దకు పడిపోయింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.7,300 కోట్ల మేర తగ్గి రూ.14,974.50 కోట్లకు జారుకుంది. ఇంట్రాడేలో షేరు రూ.152.50 స్థాయికి పతనమై, సరికొత్త ఏడాది కనిష్ఠాన్ని కూడా నమోదు చేసుకుంది.

నోవా అగ్రిటెక్ ఐపీఓకు 9.71 రెట్ల బిడ్లు

హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. కంపెనీ ఆఫర్ తొలి రోజు ముగిసేసరికి.. ఇష్యూ సైజుకు 9.71 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఇష్యూలో అమ్మకానికి పెట్టిన 2.54 కోట్ల షేర్లకు గాను 24.68 కోట్ల షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు బిడ్లు సమర్పించారు. సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్లకు గాను 14.66 రెట్ల బిడ్లు రాగా.. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 12.71 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

మెడి అసిస్ట్ తొలి రోజు లాభం 11 శాతం

మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ సర్వీసెస్.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.418తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు రూ.465 వద్ద లిస్టయింది. ఒక దశలో రూ.509.60 స్థాయికి ఎగబాకింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి 11.06 శాతం లాభంతో రూ.464.25 వద్ద స్థిరపడింది.

4వ అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా భారత్

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ప్రపంచంలోని అతిపెద్ద స్టాక్ మార్కెట్లలో తొలిసారిగా హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి భారత్ 4వ స్థానానికి ఎగబాకింది. బ్లూంబర్గ్ తాజా డేటా ప్రకారం.. ఈ నెల 22 (సోమవారం) ట్రేడింగ్ ముగిసేసరికి హాంకాంగ్ స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.29 లక్షల కోట్ల డాలర్లకు పరిమితం కాగా.. మన బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 4.33 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. భారత స్టాక్ మార్కెట్ క్యాప్ 2023 డిసెంబరు 5న 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. అందులో సగం సంపద గడిచిన నాలుగేళ్లలోనే సమకూరడం గమనార్హం.

హైదరాబాద్‌లో జెహ్ ఏరోస్పేస్ తయారీ కేంద్రం

న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల రంగంలోని స్టార్టప్ జెహ్ ఏరోస్పేస్ హైదరాబాద్‌లో తయారీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించింది. ఏరోస్పేస్, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తులు అందించే ఈ కేంద్రాన్ని 1.6 లక్షల చదరపు అడుగుల వరకు విస్తరించడానికి వీలుంది. జనరల్ కేటలిస్ట్ సంస్థతో పాటు ఏరోస్పేస్ పరిశ్రమ ప్రముఖులు ఎయిర్‌బస్ ఇండియా మాజీ సీఈఓ ద్వారాకానాథ్ శ్రీనివాసన్, బోయింగ్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ ప్రత్యూష్ కుమార్ నుంచి 27.5 లక్షల డాలర్ల (రూ.236.5 కోట్లు) సీడ్ ఫండింగ్ అందిన నేపథ్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. టాటా బోయింగ్ ఏరోస్పేస్ మాజీ సీఓఓ విశాల్ ఆర్ సంఘ్వీ, టాటా సికోర్స్కీ ఏరోస్పేస్ లిమిటెడ్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెంకటేశ్ ముద్రగళ్ల.. జెహ్ ఏరోస్పేస్‌ను ఏర్పాటు చేశారు.

బెంగళూరులో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విస్తరణ

హైదరాబాద్: రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పేరుతో కార్యకలాపాలను సాగిస్తున్న రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్).. బెంగళూరులో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. తాజాగా బెంగళూరులోని సర్జాపూర్ రోడ్‌లో 100 పడకల హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. బెంగళూరులో రెయిన్‌బోకు ఇది నాలుగో హాస్పిటల్ అని, కొత్త హాస్పిటల్‌తో మొత్తం పడకల సంఖ్య 452కి చేరిందని ఆర్‌సీఎంఎల్ ఎండీ రమేశ్ కంచర్ల తెలిపారు.

'ఎన్‌పీఎస్'కు పన్ను రాయితీలు!



న్యూఢిల్లీ: జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు చర్యలు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. కంపెనీలు ప్రస్తుతం ఉద్యోగుల మూల వేతనం, గౌరవ భృతి (డీఏ) నుంచి చెల్లించే 10 శాతానికి మాత్రమే ఎన్‌పీఎస్ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. అదే ఈపీఎఫ్‌కైతే 12 శాతం వరకు మినహాయింపు లభిస్తోంది. వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ అసమానతను సరిదిద్దుతారని భావిస్తున్నారు.

సీనియర్లకు ఊరట: ఎన్‌పీఎస్‌లో సభ్యులైన 75 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లనీ ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో కొద్దిగా కరుణించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా వీరికి చెల్లించే యాన్యుటీలను పూర్తిగా పన్ను చెల్లింపు నుంచి మినహించే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ అంచనా వేసింది. ప్రస్తుతం ఎన్‌పీఎస్ నుంచి ఒకేసారి వెనక్కి తీసుకునే 60 శాతానికి మాత్రమే పన్ను మినహాయింపు ఉంది.

వీటికి తోడు కేవలం ఎన్‌పీఎస్ యాన్యుటీలపై మాత్రమే నెట్టుకొచ్చే సీనియర్ సిటిజన్లను ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ బాదరబందీ నుంచీ మినహాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,050 ▲	57,800 ▲	76,500 ▼
ముంబై	62,355 ▼	57,117 ▼	70,311 ▼

ఈ ఏడాది అమ్మకాల్లో 20% వృద్ధి

● మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ క్విడ్, ట్రైబర్, కైగర్ ● రెనో ఇండియా ఎండీ వెంకట్రామ్

హైదరాబాద్: ఫ్రెంచ్ కార్ల కంపెనీ రెనో ఇండియా.. భారత మార్కెట్‌పై అత్యంత ఆశాభావంతో ఉంది. గత ఏడాది (2023)తో పోలిస్తే ఈ సంవత్సరం భారత మార్కెట్లో తమ కార్ల అమ్మకాలు 20 శాతం పెరుగుతాయని రెనో ఇండియా ఎండీ, సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. కంపెనీకి చెందిన మూడు అప్‌గ్రేడెడ్ మోడల్ వాహనాలు క్విడ్, ట్రైబర్, కైగర్‌లను హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేస్తూ ఆయన ఈ విషయం చెప్పారు. రెనో ఇండియా గత ఏడాది భారత మార్కెట్లో 49,000 కార్లను విక్రయించింది. వచ్చే మూడేళ్లలో భారత మార్కెట్లో ఐదు కొత్త మోడల్ వాహనాలను విడుదల చేయబోతున్నట్టు వెంకట్రామ్ వెల్లడించారు. కాగా అప్‌గ్రేడెడ్ రెనో క్విడ్ ధరలు రూ.4.69,500 నుంచి రూ.6,32,500, రెనో ట్రైబర్ ధరలు రూ.5,99,500 నుంచి రూ.8,74,500, రెనో కైజర్ ధరలు రూ.5,99,990 నుంచి రూ.10,99,999 మధ్యన ఉన్నాయి.

2027 నాటికి రూ.లక్ష కోట్ల ఏయూఎం లక్ష్యం

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్

హైదరాబాద్: వచ్చే మూడేళ్ల (2027 నాటికి)లో ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.లక్ష కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఆర్‌కే ఝా వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ఐసీ ఎంఎఫ్.. ఏయూఎంలు రూ.30,000 కోట్ల స్థాయిల్లో ఉన్నాయని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు కొత్త ఉత్పత్తులను తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. కాగా దేశీయ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఏయూఎంలు ప్రస్తుతం రూ.50.77 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయని, ఇవి కూడా 2027 నాటికల్లా రూ.కోటి కోట్లకు చేరే అవకాశం ఉందన్నారు. ఈ ఏయూఎంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ వాటా రూ.1.43 లక్షల కోట్లుగా ఉందని ఝా పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ వాటానే రూ.లక్ష కోట్ల వరకు ఉందని, పరిశ్రమ ఆస్తులపరంగా చూస్తే ఎనిమిదో పెద్ద నగరంగా ఉందన్నారు. కాగా సంస్థ కార్యకలాపాలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు హైదరాబాద్, సోమాజీగూడలో బుధవారం కొత్త కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఝా తెలిపారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 24-1-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ

సమతా క్రాంతిదర్శికి భారతరత్న



సామాజిక సమానత్వానికి కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు అత్యున్నత పౌర పురస్కారం

భారత సామాజిక-రాజకీయ ముఖచిత్రంపై ఆయనది చెరిగిపోని ముద్ర: ప్రధాని మోదీ

బిహార్‌లో మొట్టమొదటి కాంగ్రెసేతర సీఎం కర్పూరీ ఠాకూర్.. ఆయన హయాంలో విప్లవాత్మక నిర్ణయాలు

రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం, బీసీలకు రిజర్వేషన్.. విద్య, ఉద్యోగాలు, సాగు రంగాల్లో సంస్కరణలు

లాలూ, ములాయం, నితీశ్‌కు గురుతుల్యుడు.. 2 సార్లు సీఎం అయినా సొంత ఇల్లు, కారు లేని వైనం 10

'బహుజన భారత' బాంధవుడు! కర్పూరీ ఠాకూర్ శత జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక వ్యాసం 2

వజ్రాలు పొదిగిన బంగారు వాచ్!



కీలక జడ్జికి సీఎం జగన్ పంపిన రూ.2 కోట్ల 'కానుక'

దూతలుగా టీటీడీ ధర్మారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

కసిరి తిట్టి, విసిరి కొట్టిన న్యాయమూర్తి

2021 నాటి ఘటన ఆలస్యంగా వెలుగులోకి

ఉత్తరాదిలో జడ్జి కుటుంబ సభ్యుడి వివాహం

'పిలవని పేరంటానికి' ధర్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి

గెస్ట్ హౌస్‌లో జడ్జిని కలిసి ప్రలోభాల వల

'ఏమిటీ నాన్సెన్స్' అంటూ తిట్టిన జడ్జి

జగన్ ఎత్తుగడలపై న్యాయవాద వర్గాల్లో చర్చ



వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ధర్మారెడ్డి (ఫైల్)

ఆ ఇద్దరిపై సుప్రీంకోర్టుకు అప్పుడే ఫిర్యాదు

'డబ్బుతో కొడితే ఎవరైనా పడిపోతారు! చివరికి, న్యాయ వ్యవస్థను కూడా మేనేజ్ చేసేయొచ్చు!"... ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్మే సిద్ధాంతం! కానీ... అన్ని సార్లూ డబ్బు పని చేయదు. నిజాయితీ, నిబద్ధత ఉన్న వాళ్ల ముందు అస్సలు పని చేయదు. ఒక కీలక న్యాయమూర్తిని 'ఖరీదైన బహుమతి'తో మంచి చేసుకునేందుకు జగన్ శిబిరం చేసిన ప్రయత్నం ఆలస్యంగా బయటికి వచ్చింది. ఈ అంశం ఇప్పుడు న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఏం జరిగిందో మీరే చదవండి..

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కీలకమైన న్యాయమూర్తి కుటుంబ సభ్యుడి వివాహం... ఉత్తరాదిలోని ఒక రాష్ట్రంలో జరిగింది. అది... 2021, కరోనా కాలం! దీంతో హంగూఆర్భాటాలకు దూరంగా, అత్యంత సన్నిహితుల మధ్య నిరాడంబరంగా ఆ వివాహం జరిగింది. అయితే... ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు 'అనుకోని అతిథులు' కూడా హాజరయ్యారు. వారిలో ఒకరు... వైసీపీ రాజ్యసభ సభ్యుడు, పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ఇంకొకరు... టీటీడీలో 'ఆల్ ఇన్ వన్'గా వ్యవహరించే ధర్మారెడ్డి! పిలవని

మిగతా 12వ పేజీలో...



'ఆసరా' నిధుల విడుదల సభలో మాట్లాడుతున్న సీఎం జగన్

చంద్రబాబుకు 'స్టార్ క్యాంపెయినర్'

షర్మిలపై తొలిసారి జగన్ పరోక్ష విమర్శలు

పవన్, పురందేశ్వరిపైనా అవే వ్యాఖ్యలు

తనకు మీడియా లేదంటూ మళ్లీ అబద్ధాలు

అనంత జిల్లాలో 'ఆసరా' నిధుల విడుదల సభ

కర్ణాటక నుంచి జనం తరలింపు

ఏరులైపారిన కర్ణాటక మద్యం 9



మంగళవారం ఉత్తరాంధ్రలో బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో ముచ్చటిస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల

బీజేపీకి తొత్తుగా జగనన్న

స్వలాభం కోసం రాష్ట్రం తాకట్టు

మోదీకి ఊడిగం చేస్తున్న వైసీపీ ఎంపీలు

ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే లేని బీజేపీ ఆడిస్తోంది

మతతత్వ పార్టీకి వైసీపీ అమ్ముడు పోయింది

హోదా కోసం టీడీపీ ఎంపీలను రాజీనామా

చేయాలన్న జగనన్న ఇప్పుడు ఏం చేస్తున్నారు

హోదా ఎందుకు తేలేదో.. ప్రజలకు చెప్పాలి

మద్య నిషేధం చేసే ఓటు అడుగుతానన్నారు

ఇప్పుడు ఓటు అడిగే అర్హత మీకు లేదు 8

ఆయన వైఎస్ బిడ్డే కానీ.. ఆ పాలన లేదు

సీఎం జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్

టైం మీరు చెప్పినా.. నన్ను చెప్పమన్నా రెడీ

రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వైవీ సుబ్బారెడ్డి చూపిస్తామంటున్నారు. చూసేందుకు మేమంతా సిద్ధం. డేటు, టైము మీరు చెప్పినా సరే.. నన్ను చెప్పమన్నా సరే. మీరు నిర్మించిన మెట్రో, పోలవరం, రాజధానితోపాటు ఇతరత్రా అభివృద్ధి ఎక్కడెక్కడున్నాయో అవన్నీ చూపించండి. - వైఎస్ షర్మిల

వైసీపీకి మరో ఎంపీ గుడ్‌బై



పార్టీకి, లోక్‌సభ సభ్యత్వానికి శ్రీకృష్ణదేవరాయలు రాజీనామా

నా టికెట్‌పై అనిశ్చితితో గందరగోళం

ఇది ఎవరికీ మంచిది కాదు

అందుకే వైసీపీకి, ఎంపీ పదవికీ గుడ్‌బై

విలేకరుల భేటీలో లావు ప్రకటన

పొమ్మనకుండా పొగబెట్టిన జగన్

మంత్రి రజినితో విభేదాల పర్యవసానం

రాజధాని రైతులకు సానుకూలంగా ఉండడమే ఎంపీ చేసిన తప్పు

త్వరలో టీడీపీలో చేరికకు సిద్ధం!

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన మంగళవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'గత కొద్ది రోజులుగా నా సీటు విషయంలో అనిశ్చితి నెలకొంది. నాయకులు, ప్రజలు, కేడర్ గందరగోళంలో పడిపోయారు. దీనివల్ల నాయకులకు, పార్టీకి, నాకూ ఎవరికీ ఉపయోగం లేదు. వీటన్నిటికీ

మిగతా 11వ పేజీలో...

నేడో రేపో మాగుంట రాజీనామా!

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి పక్కచూపులు

మాజీ ఎమ్మెల్యే గరటయ్య, చైతన్య కూడా

చౌకబారు ఎత్తులు!

రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ బలం తగ్గించడానికి వైసీపీ కుయుక్తులు

గంటా రాజీనామాకు ఆకస్మికంగా ఓకే

ఆళ్ల రాజీనామాపై మాత్రం మౌనం

వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసులు

టికెట్లు నిరాకరించిన ఎమ్మెల్యేలు ప్రతిపక్షానికి ఓటేస్తారని భయం 11

అందుకే రీసర్వే పేరుతో డ్రామాలు

ఎమ్మెల్యేకు అనుకూలంగా వస్తే టికెట్ ఇస్తారని కూలి మీడియాలో ప్రచారం


రాజ్యసభ ఎన్నికల దాకా వారిని నిలుపుకోవడానికి నానా హైరానా



మూడేళ్లకు గంటా రాజీనామా ఆమోదం!

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా నాడు స్పీకర్‌కు లేఖ

తొలిరోజే 5 లక్షల మందికి దర్శనం!?



అయోధ్య రాముడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సోమవారం అర్ధరాత్రి నుంచే క్యూలలోకి ప్రవేశం

అదుపు చేయలేక భద్రతా సిబ్బంది ఉక్కిరిబిక్కిరి 10

అమెరికాలో ఉద్యోగాల ఊచకోత

2022తో పోలిస్తే 2023లో 98% అధికం.. ఐటీ రంగంలో ఆ సంఖ్య 73 శాతం ఎక్కువ

రిటైల్ రంగంలో ఏకంగా 274 శాతం అధికం.. చాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ నివేదికలో వెల్లడి

2022 చివరి త్రైమాసికంలో రెండు లక్షల మందిని తొలగించిన అమెరికా ఐటీ సంస్థలు 10

వారిలో దాదాపు 80 వేల మంది భారతీయులే.. వారు ఇక్కడికి వచ్చినా దొరకని అవకాశాలు

కెనడా వీసా కట్.. నిబంధనల్లో మార్పులు.. 35% తగ్గనున్న విద్యార్థుల వీసాల సంఖ్య



10

రాహుల్ గాంధీపై కేసు పెట్టండి

అసోం డీజీపీకి సీఎం హిమంత ఆదేశం

బారికేడ్లు ఛేదించుకు వెళ్లాలని ప్రజలకు పిలుపు ఇచ్చినందుకే!

చైర్‌పర్సన్ పదవి ఇస్తానని మోసం

9

మంత్రి రోజా సోదరుడు రూ.40 లక్షలు తీసుకున్నాడు

జగనన్నా.. దళిత మహిళకు నీవే న్యాయం చేయాలి

పుత్తూరు 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి ఆవేదన



ఎన్నికలకు ముందస్తు షెడ్యూలు?

బడ్జెట్ సమావేశాల తర్వాత ఎప్పుడైనా విడుదల!

ఏప్రిల్‌లోనే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి

నిర్వహణకు శరవేగంగా ఎన్నికల కమిషన్ సన్నాహాలు 10

రామమందిరం నుంచి ప్రజల దృష్టి మరలిపోకముందే ఎన్నికలకు..

భారతీయ జనతా పార్టీ యోచన

ఫిబ్రవరి, మార్చిలో దేశవ్యాప్తంగా పర్యటించనున్న ప్రధాని మోదీ

అవినీతి షి..కారు.. అక్రమాలు మోర్!

800 కోట్ల టీడీఆర్ బాండ్ల గోల్‌మాల్



మంత్రి సేఫ్.. కొనుగోలు దారులు ఫట్

ముడుపులు ఇస్తేనే నిర్మాణాలు ముందుకు

దెబ్బకు పడిపోయిన రిజిస్ట్రేషన్ ఆదాయం

జగనన్న లే అవుట్‌లోనూ దోపిడీ

బిల్లులు చెల్లించాలంటే 15% కమీషన్

ఎవరైనా ప్రశ్నిస్తే 'ఎర్రిపప్ప'లవ్వాల్సిందే

ఉమ్మడి పశ్చిమలో అంతులేని లంచావతారం

అమ్మో ఎమ్మెల్యే

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆ ప్రజాప్రతినిధి అవినీతికి చిరునామా. ఆయన మాటలు ముచ్చట గొలుపుతాయి. చేతలు కఠినంగా ఉంటాయి. నియోజకవర్గంలో ఆయన చెప్పుచేతల్లో లేని అధికారులు బలైపోవాల్సిందే. అవినీతి దందాలో ఆరితేరిపోయారనే పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్న సదరు ప్రజా ప్రతినిధి అవినీతిని ఇతరులు ఆదర్శంగా తీసుకుంటున్నారు. సీఎం జగన్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ఈయన వేసే ఎత్తుగడలు అన్నీ ఇన్నీ కావని నియోజకవర్గంలో టాక్.

12

రాజధాని అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్రకు వ్యతిరేకంగా పెయిడ్ వర్కర్‌లతో ప్రదర్శనలు చేయించడం.. ఆ అమాత్యుడికే చెల్లింది. టీడీఆర్ బాండ్ల భారీ అక్రమాలకు ఆద్యుడిగా కూడా ఆయన పేరు సుపరిచితం. రూ.కోట్ల టీడీఆర్ బాండ్ల మంజూరులో సదరు నేత కీలకంగా వ్యవహరించారని టాక్. అవసరం లేకున్నా సరే టీడీఆర్ బాండ్ల మంజూరు కోసం భూములను సేకరించారు.

తదుపరి విచారణలోగా కాంట్రాక్టర్లకు

బిల్లులు చెల్లించండి

ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం 9

లేనిపక్షంలో కోర్టుకు హాజరుకావాలని స్పష్టీకరణ

కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంపై అసహనం

కొత్తగా రూ.1100 కోట్ల అప్పు

10 నెలల్లో మంగళవారం అప్పులో రూ.62,000 కోట్లు 8

బిల్లులు రాక ఆస్తులమ్ముకుంటున్నారు



మైలవరంలో ఓ నేత మామిడితోట అమ్ముకున్నారు

రాష్ట్రంలో వైసీపీ నేతల దుస్థితి ఇది

గ్రామాల్లో ప్రజలు రోడ్లు, డ్రెయిన్లు అడుగుతున్నారు

సంక్షేమం ఇచ్చి అభివృద్ధి చేయబోమంటే ఎలా?

వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సంచలన వ్యాఖ్యలు 11

కృష్ణాబోర్డును విశాఖకు తరలించలేం

ప్రత్యామ్నాయంగా బెజవాడను పరిశీలించాలి

కేంద్రానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు నివేదన 9

జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిజమేనా...?

దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని గతవారం నీతి ఆయోగ్ ప్రకటించింది. నరేంద్రమోదీ ఏలుబడిలో తొమ్మిది సంవత్సరాల్లో ఏకంగా పాతికకోట్లమంది దారిద్ర్యంనుంచి బయటపడ్డారంటున్న ఆ గణాంకాలు వెలువడటానికి కొద్దిముందు డావోస్ సదస్సు సందర్భంలో ఆక్స్‌ఫామ్ అసమానతలమీద తన నివేదిక వెలువరించింది. శతకోటీశ్వరులు సహస్రకోటీశ్వరులవుతున్న ఈ ప్రపంచంనుంచి దారిద్ర్యాన్ని తరిమికొట్టడానికి మరో రెండువందలేళ్ళుపడుతుందంటూ ఎప్పటిలాగానే అది కుబేరులను ఆడిపోసుకుంటూ, పేదలపక్షాన ప్రభుత్వాలకు విధానాలను మార్చుకోమంటూ చాలా హితవులు చెప్పింది. గత ఏడాది జనవరిలో ఈ సంస్థ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్: ది ఇండియా స్టోరీ' పేరిట ఒక అనుబంధ నివేదిక వెలువరించి, భారతదేశంలో పేద ధనిక అగాధం పెరిగిపోతోందని, ఆకలితో ఉన్నవారు 19 నుంచి 35 కోట్లకు పెరిగారని హెచ్చరించిన ఆర్నెల్లకు నీతిఆయోగ్ తన నివేదికలో 2015–20 మధ్యకాలంలో పదమూడుకోట్లమంది దారిద్ర్యంనుంచి విముక్తి చెందారంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. భారతదేశంలో పేదరికం ఇప్పటికీ నిర్దిష్టమైన అంచనాలకు అందని బహురూపిగా, పరిష్కారం సాధ్యం కాని అంశంగానే ఉండిపోయిందా?

తొమ్మిదేళ్ళలో దేశంలో పేదరికం దాదాపు 18శాతం తగ్గిందని, ప్రధానంగా ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ పేదరికాన్ని చక్కగా జయించాయంటున్న నీతిఆయోగ్ నివేదికను కాంగ్రెస్ మరో జుమ్లాగా అభివర్ణించింది. లోక్‌సభ ఎన్నికలముందు, అవి ముగిసేవరకూ ఇటువంటి తప్పుడు లెక్కలే ప్రజలముందుకు వస్తాయని, థర్డ్‌పార్టీ సర్వేల ఆధారంగా ముద్రించిన ఈ నివేదికకు తగిన ప్రాతిపదికలు లేవని ఆ పార్టీ విమర్శ. వేతనాలు తగ్గిపోతూ, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న కాలంలో, పేదరికం పెద్ద ఎత్తున నాశనమైందని, నిరుద్యోగం సమసిపోయిందని ఎలా చెబుతారంటూ ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. పాతికకోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రకటించడం ద్వారా వారికి సబ్సిడీలు, ఉచితరేషన్, ఇతరత్రా సంక్షేమ పథకాలు వర్తించకుండా చేసే కుట్ర జరుగుతోందని కూడా ఆ పార్టీ విమర్శ. నీతి ఆయోగ్ నివేదిక సరైనదే అయితే, దేశంలో వినియోగం ఎందుకు తగ్గింది, ప్రభుత్వం తన రేషన్ పథకాలను మరింత విస్తరిస్తూ 80కోట్లమందికి ఉచిత రేషన్ ఎందుకు ఇస్తున్నదని దాని ప్రశ్న. పాతికకోట్లమందిని సంక్షేమం నుంచి గెంటేయాలన్న దుర్బుద్ధి కేంద్రపాలకులకు ఉన్నదని అనలేం కానీ, తమ పాలనలో పేదలు పాతికశాతం తగ్గారని చెప్పుకోవడం ఎన్నికల ముందు బీజేపీకి అవసరం. ఇటీవలే అన్నార్తుల కోసమంటూ ఉచిత తిండిగింజల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్ళు పెంచడానికీ, ఈ కొత్త లెక్కలకు సంబంధం లేదని కాంగ్రెస్‌కు తెలియకపోదు.

ఈ దేశంలో పేదలు ఎందరో, ఆకలితో నకనకలాడుతున్నవారు ఎందరో చాలా కమిటీలు ఏవో లెక్కలు వేశాయి. పేదరికాన్ని ఇలా కొలవాలంటూ మరికొన్ని కమిటీలు సూచనలు చేశాయి. దారిద్ర్యాన్ని నిగ్గుతేల్చే మన విధానాలన్నీ లోపభూయిష్టమైనవేనని కొందరు ఆర్థికవేత్తలు తీసిపారేస్తుంటారు. నీతి ఆయోగ్ నివేదికకు ప్రాతిపదికలు ఏమిటో తెలియదు కానీ, అది చెబుతున్నదీ నిజమేనని సరిపెట్టుకోవాలి. అంతర్జాతీయ ఆకలిసూచిలో అంత అధమస్థానంలో ఎందుకు ఉన్నాం, పోషకాహారలోపంమీద పోరాటంలో పాతిక రాష్ట్రాలు విఫలమైనాయని ఇదే నీతి ఆయోగ్ ఎందుకు అంటున్నది అన్నవి వేరే ప్రశ్నలు.

మిగతా ప్రపంచమంతా కరోనా ఉత్పాతంలో కొట్టుమిట్టాడుతూంటే, ఐదుగురు బిలియనీర్లు మూడేళ్ళలో తమ ఆస్తులను రెట్టింపు చేసుకున్నారని, మరో దశాబ్దంలోనే ట్రిలియనీర్ అవతరించబోతున్నాడని ఆక్స్‌ఫామ్ అంటోంది. జెఫ్ బెజోస్, ఎలాన్ మస్క్, లారీ ఎల్లిసన్‌లలో ఆ పరుగుపందెంలో గెలిచేదెవరు? అన్న చర్చలో, ప్రస్తుత విధానాలు కొనసాగితే దారిద్ర్యనాశనానికి మరో 230 ఏళ్ళుపడుతుందన్న హెచ్చరిక సహజంగానే వెనక్కుపోయింది. సూపర్ రిచ్‌మీద భారీగా పన్నులు వేయండని కొందరు పాశ్చాత్యకుబేరులు ఎప్పటిలాగానే డిమాండ్ చేశారు కానీ, కార్పొరేట్ ఆధిపత్యాలను విచ్ఛిన్నం చేయడం, అధికలాభాలకు, అపరిమిత ఆస్తులకు వీలుకల్పిస్తున్న విధానాలను తిరగదోడటం జరిగేపని కాదు. తక్కువ పన్నురేట్లతో, ఎక్కువ ఎగవేత మార్గాలతో, ఏ మాత్రం పారదర్శకతలేని ప్రభుత్వ విధానాలను సంపన్నులే నిర్దేశిస్తుంటే, అందుకు పూర్తి భిన్నంగా మరింత శ్రమదోపిడీకి వీలైన కార్మికచట్టాలు తయారవుతూంటే పరిస్థితుల్లో మార్పువస్తుందని ఆశించడం వృథా.



కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పనిచేస్తున్న ఓబీసీ కమిషన్ (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది)ను ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కింది. మా 'పీఎం–విశ్వకర్మ' పథకం ఆ సేతు శీతాచలం ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది శ్రామిక జనావళి శ్రేయస్సుకు కొత్త మార్గాలు తెరిచింది.

'బహుజన భారత' బాంధవుడు


సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ జీ నూరవ పుట్టిన రోజును నేడు మనం జరుపుకోనున్నాం. ఆ మహనీయుడిని కలిసే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు. అయితే, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన కైలాసపతి మిశ్రా నుంచి ఆయన గురించి చాలా విన్నాను. అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన నాయి సమాజ్‌కు చెందిన కర్పూరీ ఠాకూర్ ఎన్నో అడ్డంకులను అధిగమించి దీక్షతో శ్రమించి సమాజ అభ్యున్నతికి ఆయన అకుంఠిత కృషి చేశారు.

నిరాడంబరంగా జీవించిన జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ సామాజిక న్యాయం కోసం పోరాడారు. ఆ పోరాటమే ఆయన జీవితం. తన చివరి శ్వాస వరకు నిరాడంబరమైన జీవనశైలి అనుసరించిన కర్పూరీ ఠాకూర్ సామాన్య ప్రజలతో మమేకమై సామాజిక న్యాయం కోసం కృషి చేశారు.

ఆయన నిరాడంబరత చాటిచెప్పే ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన కుమార్తె వివాహంతో సహా ఏదైనా వ్యక్తిగత వ్యవహారాలకు తన సొంత డబ్బు ఖర్చు చేయడానికి ఠాకూర్ ఇష్టపడేవారని ఆయనతో పనిచేసినవారు గుర్తు చేస్తారు. బిహార్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో రాజకీయ నాయకుల కోసం ఒక కాలనీ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆయన స్వయంగా ఎలాంటి భూమి, డబ్బు తీసుకోలేదు. 1988లో ఆయన మరణించినప్పుడు పలువురు నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. ఆయన ఇంటి పరిస్థితి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఒక గొప్ప వ్యక్తి అంతచిన్న ఇల్లులో ఎలా నివసించారు!

ఆయన నిరాడంబరతకు అద్దం పట్టే సంఘటన ఒకటి 1977లో బిహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల తర్వాత చోటుచేసుకుంది. అప్పుడు ఢిల్లీ, పాట్నాలో జనతా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో లోక్‌నాయక్ జేపీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాట్నాలో జనతా పార్టీ నేతలు సమావేశమయ్యారు. జేపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు అనేకమంది ప్రముఖులతో కలిసి చిరిగిన కుర్తాతో ముఖ్యమంత్రి హోదాలో కర్పూరీ ఠాకూర్ కూడా వెళ్లారు. ఇది చూసి చంద్రశేఖర్ తనదైన శైలిలో కర్పూరీ ఠాకూర్ కొత్త కుర్తా కొనుక్కోవడానికి కొంత డబ్బు విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. డబ్బులు స్వీకరించిన కర్పూరీ ఠాకూర్ ఆ మొత్తాన్ని సీఎం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. అదీ కర్పూరీ ఠాకూర్ గొప్పతనం! తనకు సాటి ఎవరూ లేరని కర్పూరీ ఠాకూర్ తన ప్రవర్తనతో చాటి చెప్పారు.

సామాజిక న్యాయం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ పరితపించారు. సామాజిక హోదాతో సంబంధం లేకుండా వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని ఆయన కోరుకున్నారు. ప్రతి ఒక్కరికి అవకాశాలు లభించే సమాజాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కలలు కన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో. భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి ఆయన పట్టుదలతో కృషి చేశారు.



కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న సమయంలో రాజకీయ రంగంలో ఉన్న జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు. కాంగ్రెస్ దాని వ్యవస్థాపక సూత్రాల నుంచి పక్కదారి పట్టింది అని ఆయన చాలా ముందుగానే గుర్తించి స్పష్టమైన కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని అవలంబించారు.

1950వ దశకం ప్రారంభంలో జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలి నుంచి ఆయన కార్మికవర్గం, కూలీలు, చిన్న రైతులు, యువకుల పోరాటాలకు అండగా నిలిచారు. చట్టసభల్లో కార్మికులు, కూలీలు, యువత గళం వినిపించి తిరుగులేని శక్తిగా ఎదిగారు. విద్యకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. తన రాజకీయ జీవితమంతా పేదలకు విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి కృషి చేశారు. స్థానిక భాషలో విద్యా బోధన జరగాలి అని సూచించారు. దీనివల్ల చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు జీవితంలో విజయం సాధించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఆయన భావించారు. ముఖ్యమంత్రిగా సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం అనేక చర్యలు అమలు చేశారు.

ప్రజాస్వామ్యం, చర్చలు, సమావేశాలు కర్పూరీ ఠాకూర్ వ్యక్తిత్వంలో అంతర్భాగంగా నిలిచాయి. చిన్నతనంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సమయంలో, అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన సమయంలో ఈ స్ఫూర్తి ఆయనలో మళ్లీ కనిపించింది. జేపీ, డాక్టర్ లోహియా, చరణ్ సింగ్ వంటి వారు ఆయన ప్రత్యేక దృక్పథాలను ఎంతగానో ప్రశంసించారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి, సంక్షేమం కోసం జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ చేసిన భారతదేశ చరిత్రలో నిలిచిపోతుంది. వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు తగిన గుర్తింపు, అవకాశాలు, గౌరవం లభించాలని ఆయన పట్టుదలతో పని చేశారు. దీనికోసం ఆయన రూపొందించిన విధానాలకు తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయితే, ఆయన వ్యతిరేకతకు తలొగ్గలేదు. ఒత్తిళ్లకు లొంగలేదు. పుట్టుక ఒకరి భవితవ్యాన్ని నిర్ణయించదు అన్న దృఢ విశ్వాసంతో ఆయన పనిచేసి విధానాలు రూపొందించారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసే విధానాలు అమలు చేశారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన ఆయన అన్ని వర్గాలకు చెందిన ప్రజల కోసం పనిచేశారు. సంకుచిత భావాలతో ఆయన పని చేయలేదు. ఈ స్వభావం ఆయనకు గుర్తింపు, గౌరవం లభించేలా చూసింది.

జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకుని గత పదేళ్లుగా మా ప్రభుత్వం పని చేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది. అయితే, కర్పూరీ ఠాకూర్ వంటి కొద్దిమంది నాయకులకు మినహా సామాజిక న్యాయం నినాదం కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోవడం మన రాజకీయ వ్యవస్థలో అతిపెద్ద విషాదం. కర్పూరీ ఠాకూర్ విధానాల నుండి స్ఫూర్తి పొంది సమర్థమైన పాలనా విధానాన్ని అమలు చేస్తున్నాం. గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం బారి నుంచి విముక్తి పొందారు. వీరంతా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందినవారు. వలస పాలన నుంచి విముక్తి పొంది దాదాపు 70 సంవత్సరాల తర్వాత కూడా వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభించలేదు. సామాజిక న్యాయం సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తుంది. మా ప్రభుత్వ విధానాలు, సాధించిన విజయాలు చూసి జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను.

నేడు ముద్రా రుణాల వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న తరుణంలో కర్పూరీ ఠాకూర్ కలలుగన్న ఆర్థిక స్వావలంబన కార్యరూపం దాలుస్తోంది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను పొడిగించే అదృష్టం మా ప్రభుత్వానికే దక్కింది. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పనిచేస్తున్న ఓబీసీ కమిషన్ (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది) ఏర్పాటు చేసిన ఘనత కూడా మాకు దక్కింది. మా పీఎం–విశ్వకర్మ పథకం భారతదేశం అంతటా ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది మందికి శ్రేయస్సు కొత్త అవకాశాలు అందుబాటులోకి తెచ్చింది.

వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తిగా నేను జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం చాలా ఉంది. దురదృష్టవశాత్తూ 64 ఏళ్ల వయసులో కర్పూరీ ఠాకూర్ మరణించారు. చాలా అవసరమైన సమయంలో మనం కర్పూరీ ఠాకూర్ మనకు దూరం అయ్యారు. అయినా ఆయన తన కృషి వల్ల కోట్లాది భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నిజమైన ప్రజా నాయకుడు!

• నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి

(నేడు కర్పూరీ ఠాకూర్ శత జయంతి)

మోదీకి రాముడు, ఆమ్ ఆద్మీకి ఎవరు?

అయోధ్యలో సోమవారం రామమందిరంలో జరిగిన శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ భారతదేశ స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఒక కీలక ఘట్టంగానే భావించాలి. 1992 డిసెంబర్ 6న పి.వి.నరసింహారావు హయాంలో జరిగిన బాబ్రీ మసీదు కట్టడ విధ్వంసపు తార్కిక ముగింపు 2024 జనవరి 22న జరిగింది. ఈ మధ్యకాలం అంతా భారతీయ జనతా పార్టీ చారిత్రక ప్రయాణం ఒక శిఖరాధిరోహణగా చెప్పవచ్చు. 1991లో 89 సీట్లున్న బీజేపీ ఆ తర్వాత దినదిన ప్రవర్థమానమవుతూనే వచ్చింది. పదేళ్ల పాలన ముగింపు జరుగుతున్న సమయంలోనే ఈ ప్రాణ ప్రతిష్ఠ జరగడం యాదృచ్ఛికం కాదు. ప్రజల దృష్టి మరోవైపు మళ్లకుండా ఉండేందుకు జరిగిన ప్రయత్నంలో భాగంగానే ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమయింది. బీజేపీ నేతలు ఊహించిన విధంగానే దేశంలో ప్రజలు ఈ ఘట్టానికి పెద్ద ఎత్తున ప్రతిస్పందించారు. వాడవాడలా ప్రజలు శ్రీరాముడి పట్ల తమ భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. ఈ ఘట్టాన్ని విస్మరించాలనుకున్న వారు కూడా విస్మరించలేకపోయారు. ఒక భావోద్వేగం దేశమంతటా వెల్లివిరిసినట్లు కనిపించింది. దేశమంతటా కాషాయ పవన ప్రభంజనం వీచిందేమో అనిపించింది. ఈ క్రమంలో రాహుల్ భారత్ జోడో న్యాయయాత్ర గురించి వార్తలు గాలిలో కొట్టుకుపోయాయి. తమ వార్తలు ఎక్కడున్నాయో ప్రతిపక్షాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అయితే ప్రజలు భక్తి శ్రద్ధలు ప్రకటించినంత మాత్రాన దేశంలో భారతీయ జనతా పార్టీకి తిరుగులేదని భావించడం సరైనదా? బీజేపీ ఈ ఘట్టాన్ని రాజకీయాలకు, ఎన్నికల్లో విజయానికి ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తుందన్న విషయం ఆ పార్టీ వారు కూడా కాదనలేరు. కొంతకాలంగా బీజేపీ నేతలందరూ మందిరాల చుట్టూ తిరుగుతూ వాటిని ప్రక్షాళనం చేస్తున్నారు. శ్రీరామజన్మభూమి ఆలయంలో రామ్ లల్లా విగ్రహం ప్రతి ఫ్రేమ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కనపడేలా ప్రత్యక్ష ప్రసారాలు జరిగాయి. ఆ కార్యక్రమం తర్వాత మోదీ దృష్టిని ఆకర్షించేందుకు రాజకీయ నాయకులు, ముఖేశ్ అంబానీ వంటి వ్యాపారవేత్తలు, అమితాబ్ బచ్చన్ వంటి సినీనటులు, సాధ్వీ రితంబర, వీరభద్రాచార్య వంటి యోగి పుంగవులు, ఇంకా ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ఉత్సుకత ప్రదర్శించారు. మోదీని రాజర్షి అని, ఒక భగవదంశ అని సాధువులు కొనియాడారు. ఇక రానున్నది రామరాజ్యమే అని ఒక సాధువు ప్రకటించారు. దేశంలో ఒక బలమైన అధికార వ్యవస్థ చుట్టూ మతం, రాజకీయం, వ్యాపారం సంఘటితం కావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. గతంలో రాచరిక వ్యవస్థలోనూ ఇవే లక్షణాలు కొనసాగాయి. ఈ వ్యవస్థను ఎదుర్కోవడం అంత సులభమేమీ కాదు.

మోదీ పూజ చేయడంతో పాటు పలువురి దృష్టిని ఆకర్షించిన మరో దృశ్యం ఆయన ప్రాణప్రతిష్ఠ చేస్తున్న సమయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఆయన పక్కనే నిలుచుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కు ఉన్న అనేక అనుబంధ సంస్థల్లో భారతీయ జనతా పార్టీ ఒకటి. అందువల్ల మోదీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారంటే ఆ కార్యక్రమాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాత్రమే ఆయన ద్వారా చేయిస్తూ ఉండాలి. అక్కడకు వచ్చిన సాధువుల్లో అత్యధికులు ఆరఎస్ఎస్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నవారే. అందువల్ల ఇది ఒక గురువు మరో శిష్యుడితో చేయిస్తున్న కార్యక్రమంగానే భావించాలి. భాగవత్‌ను పక్కన ఉంచుకోవడం ద్వారా ఒక బలమైన సంస్థ తన వెనుక ఉన్నదన్న సంకేతాన్ని మోదీ ప్రపంచ వ్యాప్తంగా పంపారు. నిజానికి బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేయడం కూడా ఆరఎస్ఎస్ ఒక పద్ధతి ప్రకారం నిర్వహించింది. ఆ రోజు సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ జీ శిలాన్యాస్ దగ్గరుండి నిర్వహించారు. ఈ రోజు మరో సంఘ్ చాలక్ శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను దగ్గరుండి మరీ చేయించారు.



రామమందిర ప్రచార హోరులో తన అప్రజాస్వామిక, ఏకపక్ష, నియంతృత్వ చర్యలకు ఆమోదయోగ్యత లభిస్తుందని, తన వైఫల్యాలను ఎవరూ పట్టించుకోరని మోదీ భావిస్తుండవచ్చు. ఈ ఆమోదయోగ్యత దేశ వ్యాప్తంగా లభిస్తుందా? ఉత్తరాది రాష్ట్రాలకూ, దక్షిణాది రాష్ట్రాలకు ఈ విషయంలో వ్యత్యాసం ఉంటుందా అన్న చర్చను పక్కన పెడితే మోదీ ఎజెండా స్వభావాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా చేయగల శక్తి ప్రతిపక్షాలకు ఉన్నప్పుడే అవి విజయం సాధించగలవు. ఎన్నికల్లో స్పష్టంగా ప్రజల సమస్యలు, వారి నిత్యావసరాలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు, ప్రజాస్వామిక నిబద్ధతలు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం మొదలైనవన్నీ చర్చనీయాంశం కావాలి.

ఈ కార్యక్రమం తర్వాత రామజన్మభూమికి సంబంధించిన సానుకూల వాతావరణం వేడి తగ్గకుండా ఉండేందుకు సంఘ్ పరివార్ సంస్థలన్నీ మరో రెండు, మూడునెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ గెలుపునకు ఉధృతంగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. సంఘ్ పరివార్‌లో పలువురు పెద్దలు అంతర్గతంగానైనా మోదీ వ్యవహార శైలిని విమర్శించేవారు. కాని ఇప్పుడు ఆ విమర్శలను వారు పక్కన పెట్టక తప్పదు. నిజానికి 1950వ దశకంలో గోల్వాల్కర్ ఆరఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న కాలంలో తొలి రోజుల్లో రాజకీయ పార్టీల పట్ల ఏహ్యభావంతో ఉండేవారు. మన సాంస్కృతిక ఆధ్యాత్మిక వారసత్వ సంపదను పునరుద్ధరించడానికి రాజకీయాలు అవసరం లేదని, రాజకీయాల్లో ఉన్న పోటీతత్వంలో విచ్ఛిన్నకర స్వభావం వల్ల తమ లక్ష్యానికి విఘాతం కలుగుతుందని ఆయన భావించారు. అధికార రాజకీయాల వల్ల ఆ రాజకీయాల్లో ఉన్న వారిపై అనైతిక ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. అలాంటి గోల్వాల్కర్ భావసారూప్యం గల రాజకీయ వేదిక ఏర్పాటు చేయడం అవసరమని భావించినందువల్లే తొలుత జనసంఘ్, తర్వాత బీజేపీ ఏర్పాటుకు వీలు కలిగింది. ఇప్పుడు అధికార రాజకీయాలు ఎంత కలుషితమైనా, ఎంత అనైతికమైనా పట్టించుకోగలిగిన స్థితిలో సంఘ్ పెద్దలూ లేరు. అధికార రాజకీయాల్లో వారూ భాగమయ్యారు. రామమందిర దర్శనంతో పాటు మోదీ విశ్వరూప సందర్శనం కూడా కలిసి మెలిసి సాగుతాయి. వ్యక్తి ఆరాధన పెంచారని ఇందిరాగాంధీని విమర్శించిన వారే మోదీ ఆరాధనను తార స్థాయికి తీసుకువెళుతున్నారు.

రానున్న మూడు నెలల్లో కోటి మంది రామమందిరాన్ని దర్శిస్తారని బీజేపీ నేతలు భావిస్తుండగా, రెండో రోజునే 3 లక్షల మందికి పైగా దర్శించుకోవడం గమనార్హం. 'జో రామ్ కో లాయే హై హమ్ ఉన్ కో లాయేంగే' (రాముడిని తీసుకువచ్చిన వారినే మేము అధికారంలోకి తీసుకువస్తాం) అని కన్హయ్యా మిట్టల్ పాడిన పాట ఇప్పటికే ఉత్తరాదిన విస్తృతంగా ప్రచారమవుతోంది. 'కాంగ్రెస్ బీజేపీతో అయితే రాజకీయంగా పోరాడగలదు కాని శ్రీరాముడితో ఎలా పోరాడగలదు?' అని మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ఎప్పుడో ప్రశ్నించారు. 2014లో నరేంద్రమోదీ తొలిసారి దేశ రాజకీయాల్లో అడుగుపెట్టినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల వ్యతిరేకతపైనే దృష్టి సారించారు. 2019లో ఆయన తన ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను తట్టుకునేందుకు పుల్వామా, బాలాకోట్ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి జాతీయ వాదాన్ని ఎన్నికల్లో ప్రధానాంశంగా మార్చారు. ఈ అయిదేళ్లు ఆయన ఎంత అభివృద్ధి గురించి మాట్లాడినా జాతీయవాద తీవ్రతను క్రమక్రమంగా పెంచుతూ వచ్చారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశారు. ఇప్పుడు 2024లో ఆయనకు నేరుగా శ్రీరాముడే తోడయ్యారు. ఈ పదేళ్లలో ఆయన హిందూత్వను తన రాజకీయాల్లో ఒక అంతర్లీన అంశంగా జోడిస్తూనే వచ్చారు. వీలున్నప్పుడల్లా ఆలయాలను సందర్శిస్తూ వార్తల్లో ఉంటూనే వచ్చారు. కాశీ, ఉజ్జయిని కారిడార్లను ప్రారంభించారు. నదుల్లో స్నానాలు చేసి తర్పణలు గావించారు. అయోధ్య ప్రాజెక్టును ఒక పద్ధతి ప్రకారం ఆయన రూపొందించుకుని 2024 ఎన్నికలకోసం సిద్ధంగా ఉంచుకున్నారు. 'ప్రజలు మతానికి ఎంత గాఢంగా హత్తుకుపోతే వారిని పాలించడం అంత సులభం. రాజు తన రాజకీయాలకోసం మతాన్ని ఉపయోగించుకోవాలి' అని ఇటాలియన్ రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెల్లి లాంటి వాళ్లు ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు మతానికీ, రాజకీయాలకూ తేడాలేనంత స్పష్టంగా వ్యవహరించడం మోదీ చేస్తున్న వినూత్న ప్రయోగం.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

ఇవాళ మారుతున్న వాతావరణం చూస్తుంటే నుదుటిపై బొట్టు పెట్టుకుంటే మనను బీజేపీ అభిమానులుగా భావిస్తారేమో అన్న ఆలోచన కలుగుతోంది. మనం వెలిగించే దీపంలో రాజకీయం కదులుతున్నట్లనిపిస్తోంది. భక్తికీ, రాజకీయానికి పెద్ద తేడా కనపడని పరిస్థితితో పాటు భక్తి ఒక పార్టీ స్వంతమా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. లేకపోతే అస్సాంలో రాహుల్ గాంధీని గుడికి వెళ్లకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది? అయినప్పటికీ రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల ముందు ఏది ఎజెండా కావాలన్న విషయంలో ప్రజలే ఒక స్పష్టమైన వైఖరిని అవలంబించగలరు. రాజకీయ నేతలకంటే ప్రజలే వివేకంగా ప్రవర్తించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ పదేళ్ల కాలంలో మోదీ ఒకవేళ నిర్మాణాత్మకమైన పనులు ఏమైనా చేసి ఉంటే రామమందిర ప్రచార హోరులో ఆ పనులు కొట్టుకుపోతాయని భయంగా ఉన్నదని ఒక బీజేపీ నాయకుడు చెప్పారు. కాని ఈ హోరులో తన అప్రజాస్వామిక, ఏకపక్ష, నియంతృత్వ చర్యలకు ఆమోదయోగ్యత లభిస్తుందని, తన వైఫల్యాలను ఎవరూ పట్టించుకోరని కూడా మోదీ భావిస్తుండవచ్చు. ఈ ఆమోద యోగ్యత దేశ వ్యాప్తంగా లభిస్తుందా? ఉత్తరాది రాష్ట్రాలకూ, దక్షిణాది రాష్ట్రాలకు ఈ విషయంలో వ్యత్యాసం ఉంటుందా అన్న చర్చను పక్కన పెడితే మోదీ ఎజెండా స్వభావాన్ని ప్రజల్లో అర్థం చేసుకునేలా చేయగల శక్తి ప్రతిపక్షాలకు ఉన్నప్పుడే అవి విజయం సాధించగలవు. ఎన్నికల్లో స్పష్టంగా ప్రజల సమస్యలు, వారి నిత్యావసరాలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు, ప్రజాస్వామికంగా వ్యవహరించిన తీరు, అణగారిన వర్గాలకు జరిగిన సామాజిక న్యాయం ఇవన్నీ చర్చనీయాంశం కావాలి. ఇవేవీ చర్చనీయాంశం కాకుండా కేవలం రామమందిరమే ఎన్నికల ఎజెండాను నిర్ణయిస్తే...

పెట్టుబడి జాతరలో రేవంత్ సర్కార్

తెలంగాణ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులకే ఎ.రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లారు. వర్ధమాన దేశాలు ప్రతిష్ఠాత్మకంగా భావించే స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు వెళ్ళి రావడం జరిగింది. పెట్టుబడి, పారిశ్రామికవేత్తల జాతరగా భావించే దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో ఒక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాధినేతగా రాష్ట్రంలోని అవకాశాలపై ఆయన మాట్లాడిన తీరు అభినందనీయం. ప్రపంచ వ్యాప్తంగా ఏ రకమైన వాణిజ్య లేదా పరిశ్రమ కార్యకలాపాలయినా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా తమ సామర్థ్యాన్ని పెంపొందించవల్సిన అవశ్యకత ఏర్పడిందని తెలంగాణ బృందం నొక్కి చెప్పింది. అసలు ఐ.టి. సాంకేతిక పరిజ్ఞాన సహాయం లేకుండా వర్తమాన కాలంలో వ్యాపార సంస్థలు మనుగడ సాధించడం కష్టమని ప్రస్తావిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో ఏ పరిశ్రమ లేదా వ్యాపార సంస్థకు అవసరమైన ఐ.టి. సాంకేతిక నైపుణ్య సహాయాన్ని అందించే సామర్థ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉందని ముఖ్యమంత్రి బృందం సోదాహరణంగా వివరించింది.

గల్ఫ్ లేఖ

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రికి దావోస్ వేదిక ప్రప్రథమం కావచ్చు కానీ పరిశ్రమల కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ఈ రకమైన అనేక వేదికలు, సదస్సులు, భేటీలలో పాల్గొని కీలకపాత్ర పోషించిన అనుభవం అపారంగా ఉంది. అదే విధంగా, విదేశీ వ్యవహారాల శాఖలో దౌత్యవేత్తగా యూరోప్ డివిజన్‌లో పని చేసిన ఇ. విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తుతం డిప్యూటేషన్‌పై తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో విదేశీ పెట్టుబడులు, విదేశాలకు సంబంధించిన ఇతర అంశాలను పరిశీలించే విష్ణువర్ధన్ రెడ్డి ఒక బ్యూరోక్రాట్‌గా కాకుండ ఒక డిప్లొమాట్‌గా వ్యవహరించడం రాష్ట్ర ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశం.

ముఖ్యమంత్రితో పాటు వెళ్ళిన పరిశ్రమలు, ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబులు వ్యక్తిగతంగా అనేక మంది పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలతో సమావేశమై తమ రాష్ట్రంలో ఉన్న అవకాశాల గురించి విడమర్చి చెప్పారు. తమకు కల్గిన కొన్ని సందేహాలపై మంత్రి శ్రీధర్ బాబుతో అరబ్బు పారిశ్రామికవేత్తలు, వారి సంస్థలలో ఉన్నత హోదాలలో పని చేసే పాశ్చాత్య దేశస్థులైన అధికారులు కొందరు అడిగిన ప్రశ్నలకు ఆయన నివృత్తి చేసిన తీరులో నిజాయితీ కనిపించింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ప్రభుత్వాలు మారడం సహజం గానీ పెట్టుబడుల విషయంలో ప్రతి ప్రభుత్వం కూడ గత ప్రభుత్వం కంటె మెరుగ్గా కృషి చేస్తుందని మంత్రి బృందం చెప్పడం పార్టీలకు అతీతంగా విదేశీగడ్డపై తెలంగాణ ప్రతిష్ఠను పెంపొందించడంలో నూతన ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడించిందని చెప్పవచ్చు. ఒక నెల వయస్సు కల్గిన నవ ప్రభుత్వం నుండి అంతకు మించి ఆశించడం సబబు కూడా కాదు.



ప్రజాస్వామ్య ప్రకియలో భాగంగా ప్రభుత్వాలు మారడం సహజం గానీ పెట్టుబడుల విషయంలో ప్రతి ప్రభుత్వం కూడ గత ప్రభుత్వం కంటె మెరుగ్గా కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం చెప్పడం పార్టీలకు అతీతంగా విదేశీగడ్డపై తెలంగాణ ప్రతిష్ఠను పెంపొందించడంలో నూతన ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడించిందని చెప్పవచ్చు. ఒక నెల వయస్సు కల్గిన నవ ప్రభుత్వం నుండి అంతకు మించి ఆశించడం సబబు కూడా కాదు.

ఒక కీలక మంత్రిగా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తర్వాయి స్థానంలో చక్రం తిప్పిన కె.టి.ఆర్ మంత్రి అయిన నాలుగు సంవత్సరాలకు దావోస్‌కు వెళ్ళగా రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబులు సర్కారు కొలువు తీరిన కేవలం ఒక నెలలోపే వెళ్ళారనేది గమనించాలి. స్విట్జర్లాండ్, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, సౌదీ అరేబియాలలో బృందాలు వేర్వేరుగా ప్రవాసులతో కూడ సమావేశమయ్యాయి. సమయా భావం, చివరి వరకు తిరుగు ప్రయాణంలో అనిశ్చిత పరిస్థితుల మధ్య కూడ వీలయినంత ఎక్కువ మంది తెలంగాణ ప్రవాసులను కలుసుకోవడానికి ఆసక్తి చూపడం అభినందనీయం.

ముఖ్యమంత్రికి ఇది మొదటి అధికారిక పర్యటన కావడంతో సహజంగా ఆయన విదేశీ గడ్డపై ఏ విధంగా వ్యవహరించారనే విషయమై అందరూ ఆసక్తి చూపడం కద్దు. దావోస్‌లో ఒక భారతీయ న్యూస్ చానల్ ప్రతినిధితో కరచాలనం చేస్తూ మాట్లాడిన కొన్ని మాటల ఆధారంగా రేవంత్ ఆంగ్ల భాషా పరిజ్ఞానం విషయమై సామాజిక మాధ్యమాలలో విపక్షాలు చర్చ మొదలుపెట్టాయి. ఆయనకు ఆంగ్ల భాషానైపుణ్యం లేకపోవడంతో అంతర్జాతీయ వేదికలపై తెలంగాణను ప్రపంచం ఎలా చూస్తుందనే విషయాలపై ఒక రచ్చ లేపారు. ఒక నాయకుడి విద్యార్హతలు, భాష ప్రావీణ్యతను మరొక నాయకుడితో పోల్చరాదు. బహు భాష కోవిదులు అయినా పాలన దక్షత లోపించి అనేక మంది హేమాహేమీలు వెనుకబడ్డారు. పి.వి. నర్సింహారావుతో పోల్చితె జలగం వెంగళరావు అన్నింటా వెనుకబడ్డా ఒక సమర్థ నేతగా, పాలనా దక్షుడిగా చరిత్రకెక్కారు. ఆంగ్లం తెలియని దివంగత కరుణాకరన్ రాజకీయ చతురత ముందు ఆంగ్ల భాషా కోవిదుడయిన శశి థరూర్ పూర్తిగా శూన్యమని చెప్పవచ్చు. కేవలం తన స్వంత బిహారి యాసలో మాట్లాడె లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా సాధించిన ప్రగతి అమెరికా, బ్రిటన్‌లలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల బిజినెస్ విద్యార్థులకు ఒక ఆదర్శంగా నిలిచింది.

ప్రభుత్వం నడపడానికి ప్రభుత్వాధినేతగా ముఖ్య మంత్రికి కావల్సింది దార్శనికత, దక్షత కానీ ఆంగ్ల భాషా పరిజ్ఞానం కాదు. భాషా ప్రతిపాదికన ప్రతిష్ఠ పెరిగి పెట్టుబడులు వస్తే, మరీ అరబ్బీ భాష మాట్లాడె అరబ్బు ప్రపంచంలో మరియు మాండరిన్ భాషకు మాత్రమే పరిమితమైన చైనాలో విదేశీ పెట్టుబడులు ఏ విధంగా వస్తున్నాయో తెలుసుకోవాలి. స్వయాన మన భారతదేశంలో ఇప్పటి వరకు పని చేసిన ప్రధానులందరిలోనూ నరేంద్ర మోదీకి ఇతర ప్రధానులతో పోల్చితె ఆంగ్ల భాష పరిజ్ఞానం తక్కువ. అయినా దౌత్యపరంగా ఇతర ప్రధాన మంత్రులు అందరి కంటే చాల సమర్థంగా అరబ్బులతో ద్వైపాక్షిక సంబంధాలు నెలకొల్పారనే విషయాన్ని విస్మరించరాదు. ఒక నాయకుని పాలన దక్షత, దార్శనికతతో ఆ నేత భాషా పరిజ్ఞానాన్ని ముడిపెట్టకూడదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్

పౌరుల విజ్ఞతే దేశ భవితకు బంగారు బాట

ప్రజలు విజ్ఞులైనపుడే ప్రజాస్వామ్యం పరిపక్వ దశకు చేరుకుంటుంది. ప్రజలు మూర్ఖత్వంలోనూ, అజ్ఞానంలోనూ ఉంటే ప్రజాస్వామిక పరిపాలనా వ్యవస్థలే ఉన్నప్పటికీ ప్రచ్ఛన్నంగా రాచరికమో, నియంతృత్వమో నెలకొంటాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల వల్ల తలెత్తే విపరిణామాల గురించి స్వతంత్రం వచ్చిన తొలి రోజుల్లోనే ఎంఎన్ రాయ్ హెచ్చరించారు. మత వ్యవస్థలు, కుల సమీకరణాలు, ప్రాంతీయ అస్తిత్వం కోసం జరిగిన పోరాటాలు, భాషోద్యమాలు రాజేసిన ఉద్రేకాలు భారతదేశంలో బహుళ రాజకీయ పార్టీల వ్యవస్థను అనివార్యం చేశాయి.


జాతీయ పార్టీలేవైనా... అది మితవాద బీజేపీ కావచ్చు, అతివాద కమ్యూనిస్టు పార్టీలు కావచ్చు, మధ్యేవాద కాంగ్రెస్ పార్టీ కావచ్చు, వల్లించే సిద్ధాంతాలేవైనా, పాటించే రాజకీయం ఒకటే. ప్రాంతీయ సాంస్కృతిక భిన్నత్వాలను గౌరవిస్తూ భారతజాతి యావత్తునూ ఒకే తాటిపై నిలిపేలా ఈ పార్టీలేవీ రాజకీయం చేయలేదు. ప్రాంతీయ పార్టీలేవైనా సరే, అవి తమ రాష్ట్ర ప్రయోజనాల కన్నా, పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ, సిద్ధాంతరహితంగా, తక్షణ అవసరాలకనుగుణంగా, ఏ జాతీయ పార్టీతోనైనా జతకట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. రాజకీయాలను [illegible]జిస్టులతో కార్పొరేటీకరణ చేసేస్తున్నాయి. అధికారం ఉన్నపుడు బలంగా కనిపిస్తున్న ఈ పార్టీలు, అధికారం కోల్పోగానే కలవరపాట్లకు గురవుతున్నాయి.

ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజాస్వామిక సూత్రాలను వల్లిస్తూ, అధికారంలోకి రాగానే నిరంకుశంగా వ్యవహరించడంలో అత్యధిక రాజకీయ పార్టీల మధ్య తేడా స్వల్పం. ఏ ప్రతిపక్ష పార్టీ అయినా సరే, అధికారంలో ఉన్నపుడు నిజంగానే నిజాయితీగా, ప్రజాస్వామికంగా వ్యవహరించి ఉంటే, తమ పార్టీల నాయకులు నిజంగానే అకళంకితులైతే, సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్‌టాక్స్ వంటి కేంద్ర సంస్థలకు వెరవాల్సిన పనిలేదు.

కాంగ్రెస్ పార్టీ పతనం కాకూడదని, కొత్త రూపు సంతరించుకోవాలని, బీజేపీ పాలన ముగిసిపోవాలని అత్యధిక ప్రజాస్వామికవాదులు కోరుకుంటున్నారంటే కారణం, ఎన్ని తప్పులు చేసినా బీజేపీలా కాంగ్రెస్ ప్రజాస్వామిక వ్యవస్థలను చెరపట్టలేదు కాబట్టి. ప్రజలే నేటి ఈ ప్రతినిధులస్వామ్యాన్ని నిజమైన ప్రజాస్వామ్యంగా మలచుకోవాలి. అసలైన అధికారం రాజకీయ పార్టీలు, వాటి అధినేతల వద్ద కేంద్రీకృతమవ్వకుండా ప్రజలే జాగ్రత్తపడాలి. ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజలు తీసుకున్న నిర్ణయం ప్రతిదీ ఒప్పవ్వాలని లేదు. 2019లో వచ్చిన ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం.

ఏ దేశంలోనైనా మెజారిటీ ప్రజలు తమను ఒక వర్గం కింద భావించుకుంటూ ఇతర మైనారిటీ వర్గాల పట్ల ద్వేషం, అసహనం ప్రదర్శిస్తూ ఉంటే ఆ దేశం ఫాసిజంలోకి జారిపోయే ప్రమాదం ఉంది. మైనారిటీలు సాంస్కృతికంగా, భాషా పరంగా మెజారిటీలతో మమేకమైపోయి, తామంతా ఒకే దేశస్థులం అన్న భావనను జీర్ణించుకున్నపుడు, మెజారిటీలు మైనారిటీల మతాన్ని, భాషను, సంస్కృతిని గౌరవిస్తూ శాంతియుత సహజీవనానికి భంగం కలగకుండా చూసుకుంటే, ఏ దేశమైనా ఫాసిజం బారిన పడకుండా ఉంటుంది. పౌరులు ప్రదర్శించే విజ్ఞతే దేశ బంగారు భవితకు బాటలు పరుస్తుంది.

– గౌరాబత్తిన కుమార్ బాబు





● హ్యాపీ బర్త్‌డే

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వాడవాడలా కేకులు కట్ చేశారు. చాలా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు జరిగాయి. యువకులు రక్తదానం చేసి యువనేతపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరిగిన వేడుకల్లో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు కేశినేని చిన్ని, పట్టాభిరాం తదితరులు

- 4లో..

ద్వీపం.. ఇదేం పాపం..

భవానీ ఐల్యాండ్, హరిత పార్క్ ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర





రెండు జిల్లాలకు కీలకమైన పర్యాటక ప్రాంతం.. ఆదాయం తెచ్చిపెట్టడంలోనూ అన్నింటికంటే ముందుండే ప్రదేశం.. అంతటి కీలకమైన భవానీ ద్వీపం, హరిత బెర్మ్ పార్కులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. నాలుగు న్నరేళ్లలో కనీసం ఐల్యాండ్ అభివృద్ధి పట్టని ప్రభుత్వం.. ఆదాయం దండిగా వస్తున్నప్పటికీ ప్రైవేట్ సంస్థ చేతుల్లో పెట్టేందుకు చకచకా పావులు కదుపుతుండటంపై విమర్శలు వస్తున్నాయి.

రూ.21 కోట్లకు లీజుకిచ్చేందుకు టెండర్లు

- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- ఎన్నికల ముందు హడావుడిగా ప్రయత్నాలు
- నష్టాల సాకుతో ప్రైవేటుపరం చేసే కుట్రలు
- లాభాలు తెస్తున్న అధికారులకు బదిలీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ఐల్యాండ్‌పై ప్రభుత్వం ప్రైవేట్ కత్తి పెట్టింది. ద్వీపంతో పాటు హరిత బెర్మ్‌పార్క్‌ను కూడా కలిపి రూ.21 కోట్లకు లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలిచారు. ఐదేళ్ల కాలానికి ఏడాదికి రూ.4.20 కోట్ల లీజు, 24 శాతం రెవెన్యూ షేర్‌తో ఈ టెండర్లు సిద్ధం చేశారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి

వాస్తవానికి భవానీ ద్వీపం అభివృద్ధి అంతా గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. ఇందుకోసం రూ.50 కోట్లు ఖర్చు చేశారు. మెగా ఈవెంట్లను నిర్వహించింది. ప్రపంచ స్థాయిలో ఫార్ములా వన్ బోటింగ్ రేస్‌ను భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్క్‌ల మధ్యే నిర్వహించింది. దీంతో భవానీ ద్వీపానికి ఎక్కడి లేని క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత ఎయిర్‌షోలు, నేవీ షోలు జరిగాయి. మేజ్ గార్డెన్, రోబోటిక్ గార్డెన్, మిర్రర్ మేజ్, ఫ్లవర్ గార్డెన్స్, చిల్డ్రన్ జోన్, ఫన్ జోన్ వంటివెన్నో అభివృద్ధి చేసింది. భవానీ ఐల్యాండ్‌లో కూర్చుని కృష్ణానదిపై లేజర్ షో వీక్షించేందుకు రూ.12 కోట్లతో ప్రాజెక్టు చేపట్టింది.

వైసీపీ వచ్చాక..

నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం భవానీ ఐల్యాండ్‌ను పక్కన పెట్టేసింది. ఓ పథకం ప్రకారం పర్యాటక ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు మూడేళ్లుగా కృషి చేస్తున్నా భవానీ ఐల్యాండ్ ద్వారా లాభాలు వచ్చేలా అక్కడి సిబ్బంది కృషిచేస్తూ వచ్చారు. ఐల్యాండ్, హరిత బెర్మ్ పార్క్‌లలో పనిచేస్తున్న అధికారులను అక్రమంగా దూరప్రాంతాలకు బదిలీ కూడా చేశారు. వరదకు లేజర్ షో పరికరాలు నాశనమైతే ఇప్పటి వరకు ఇన్సూరెన్స్‌ను కూడా క్లెయిమ్ చేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఏపీటీడీసీ ఉంది. వరద కారణంగా భవానీ ఐల్యాండ్ చాలావరకు దెబ్బతింది. వాటి పునరుద్ధరణకు కేటాయించిన డబ్బు కూడా నేటికీ ఖర్చు చేయలేదు. గోదావరిలో బోటు మునిగిపోతే భవానీ ఐల్యాండ్‌లో కూడా బోటింగ్‌ను నిలిపివేశారు. వైసీపీ వచ్చాక ఐల్యాండ్ అభివృద్ధికి కేటాయించిన నిధులు సున్నా అనే చెప్పాలి. ఏమీ చేయకపోగా, ప్రైవేట్‌కు అప్పగించేందుకు తాపత్రయ పడుతోంది.

లాభాల్లోనే ఉన్నా..

భవానీ ఐల్యాండ్ కానీ, బెర్మ్‌పార్క్ కానీ నష్టాల్లో లేవు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఈ రెండూ ఆదాయం సాధించాయి. కరోనా రోగులకు ఆహారం అందించటం ద్వారా ఆదాయాన్ని పొందాయి. దీనిని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరుగుతారు. ఆదాయం కూడా వస్తుంది. కానీ, ఈ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేపట్టకుండా ద్వీపాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తోంది. అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులు ఎన్ని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేసింది. అయినప్పటికీ ద్వీపానికి నెలకు రూ.25 లక్షలు, హరిత బెర్మ్‌పార్క్‌కు రూ.35 లక్షల చొప్పున ఆదాయం వస్తోంది. సీజన్‌లో అయితే, రూ.80 లక్షల వరకు, కార్తీక మాసంలో అయితే రూ.కోటిపైనా ఆదాయం లభిస్తోంది. ఇంత ఆదాయాన్నిచ్చే భవానీ ద్వీపాన్ని కావాలని ప్రైవేట్ చేతుల్లో పెడుతున్నారు. ద్వీపంలో మొత్తం 29 కాటేజీలు ఉన్నాయి. ఇవన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. కాన్ఫరెన్స్ హాల్‌తో పాటు హరిత బెర్మ్‌పార్క్‌లోని కాన్ఫరెన్స్ హాల్, 30 కాటేజీలు కూడా ప్రైవేట్‌పరం కానున్నాయి. కనీసం 150 మందికి పైగా ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరంతా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కావటంతో రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయి.

సాంస్కృతిక విప్లవంతోనే దేశాభ్యున్నతి

లెనిన్ వర్ధంతిలో పలువురు వక్తలు



రైతుల దీనస్థితిని తెలియజేసిన నృత్యరూపకం

విజయవాడ కల్చరల్, జనవరి 23 : దేశ అభ్యుదయ ప్రగతికి సాంస్కృతిక విప్లవం అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద మంగళవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. భారతదేశ అభివృద్ధికి, దేశ ప్రగతికి లెనిన్ సిద్ధాంత భావజాలం అవసరం, ఆవశ్యకత పెరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ మాట్లాడారు. సుదర్శన్ రాజు, ఫణీంద్ర, జయప్రద సినీ విప్లవ గేయాలను ఆలపించి ఉత్తేజాన్ని నింపారు. లంకా దుర్గారావు కుటుంబసభ్యులు రైతు దీనస్థితిని తెలియజేస్తూ ప్రదర్శించిన నృత్యరూపకం ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో గుజ్జుల ఈశ్వరయ్య, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజ్‌నల్ దోపిడీ



ఆదాయపు పన్నుల శాఖలో పైరవీల రాజ్యం

ఎన్నికల సీజన్ దగ్గర పడుతుంది.. భారీగా డబ్బు రవాణా అవుతుంది.. అంతే భారీగా పోలీసులు సీజ్ చేస్తారు.. అంది వస్తున్న ఈ కాలాన్ని అంతే వేగంగా అందుకోవడానికి సిద్ధమైపోతున్నారు ఆదాయపు పన్ను శాఖలోని కొందరు అధికారులు. దళారులతో కుమ్మక్కై, లోపాయికారి వ్యవహారాలను చక్కబెట్టడానికి ఇప్పటి నుంచే సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు.

- » పోలీసులు సీజ్ చేసిన నగదు విడుదలకు కమీషన్లు
- » ధ్రువీకరణలు చూపిస్తే ఒక రేటు.. లేకపోతే మరో రేటు
- » వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పకడ్బందీ ప్రణాళిక
- » చక్రం తిప్పుతున్న దళారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ, గుంటూరు కేంద్రంగా హవాలా లావాదేవీలుగా జోరుగా జరుగుతున్నాయని కొన్నాళ్ల క్రితమే సీబీఐ అధికారులు గుర్తించారు. ఇటీవల విజయవాడకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘ కమిషనర్ కూడా.. రాబోయే ఎన్నికల నేపథ్యంలో నగదు రవాణాపై ఎక్కువ దృష్టి సారించాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసు అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో వ్యక్తుల వద్ద ఉన్న నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను చూపించాలి. లేనిపక్షంలో ఆ నగదును పోలీసులు సీజ్ చేస్తారు. ఇలా సీజ్ చేసిన డబ్బును ఆదాయపు పన్నుల శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఇలా పోలీసుల నుంచి ఆదాయ పన్నుల శాఖ అధికారుల పరిధిలోకి వెళ్లిన నగదు విషయంలో లోపాయికారీ వ్యవహారాలు సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాబోయేది ఎన్నికల సమయం కావడంతో మరింత నగదు విస్తృతంగా పట్టుబడే అవకాశాలు ఉండటంతో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఇప్పటి నుంచే దళారులను ఏర్పాటు చేసుకుంటున్నారని సమాచారం.

పర్సంటేజ్ పంచాయితీలు

ఈనెల ఒకటో తేదీ నుంచి సంక్రాంతి వరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పోలీసులు జిల్లాకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. వాహనాల్లో ఉన్న నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపించని సుమారు రూ.కోటిని సీజ్ చేశారు. ఈ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఏయే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎంతెంత నగదును ఎవరి నుంచి స్వాధీనం చేసుకున్నారో ఆ వివరాలు ఆదాయపు పన్ను శాఖకు పంపారు. ఇక్కడితో పోలీసుల పని పూర్తయింది. ఆ తర్వాత నగదుకు సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలను ఆదాయపు పన్ను శాఖ అధికారులు బయటకు లాగాలి. ఇక్కడే అధికారులు సొంత ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

ఇలా దోచేస్తున్నారు..

అక్రమంగా తరలిస్తున్న నగదు గురించి విచారణ చేయడానికి, ఆకస్మికంగా దాడులు నిర్వహించడానికి ప్రత్యేక ఆదాయపు పన్నుల శాఖలో ఇంటెలిజెన్స్ విభాగం ఉంటుంది. పోలీసులు అప్పగించిన నగదు గురించి తదుపరి విచారణ చేయకుండానే ఆ మొత్తాన్ని దొడ్డిదారిన విడుదల చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తమ వద్ద నగదు మొత్తాన్ని బట్టి విడుదలకు రేటు నిర్ణయించుకుంటున్నారు. ఉద్యోగుల సంఘంలో కీలకంగా ఉన్నవారు, ఇంటెలిజెన్స్ విభాగంలో ఉన్న కొందరు ఒక గ్రూపుగా ఏర్పడి విడుదల చక్రాన్ని తిప్పుతున్నారు. వాస్తవానికి నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు చూపించిన తర్వాత ఆ మొత్తాన్ని సంబంధిత వ్యక్తులకు అప్పగించాలి. ఈ సూత్రాన్ని పక్కనపెట్టి ధ్రువీకరణ పత్రాలు ఉన్న నగదునూ అక్రమంగా చూపించి భారీగా ముడుపులు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఒక టెలికం శాఖకు తప్ప మిగిలిన శాఖల్లోకి సందర్శకుల తాకిడి తక్కువగా ఉంటుంది. పైగా ఈ కార్యాలయాల్లో జరిగే అన్ని విషయాలు చాలా గోప్యంగా ఉంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని అధికారులు భారీగా ముడుపులు అందుకుంటున్నారు. ఈ ప్రక్రియలో కేసులను తీసుకొచ్చిన దళారులకు వాటాలు అందుతున్నాయి.



గన్నవరంలో సుపారీ గ్యాంగ్..!

దాడులతో టీడీపీ శ్రేణుల ధైర్యాన్ని దెబ్బతీసే ఎత్తుగడ

గన్నవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సుపారీ గ్యాంగుల సంస్కృతికి ఎమ్మెల్యే వంశీ అనుచరులు తెరతీస్తున్నారు. ప్రత్యర్థులను దాడులతో భయభ్రాంతులకు గురిచేసి, తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇటీవల టీడీపీ నేత రంగబాబుపై దాడి సుపారీ గ్యాంగుల పనేనన్న వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి.

- » టీడీపీ నాయకుడిపై దాడి సుపారీ గ్యాంగ్ పనేనా?
- » గెలుపు కోసం ఎమ్మెల్యే వంశీ అడ్డదారులు



చికిత్స పొందుతున్న రంగబాబు (ఫైల్)

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై ఆదివారం ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రంగబాబు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడికి సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా రెండు వాహనాల్లో వచ్చిన వ్యక్తులు దాడికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. దాడికి ఉపయోగించిన రెండు వాహనాలను భవానీపురం, విజయవాడ సెంటినీ ఆసుపత్రి సమీపంలో గుర్తించారు. ఈ రెండు వాహనాలు తెలంగాణ నెంబరు ప్లేటుతో ఉండటం గమనార్హం. ఘటనాస్థలం సమీపంలోని సెల్‌టవర్ కాల్‌డేటాను విశ్లేషించగా, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తుల నెంబర్లుగా తేలాయి. వీటి ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి విచారించగా, సుపారీ గ్యాంగ్ అంశం వెలుగు చూసినట్లు తెలిసింది.

ఎందుకింత అసహనం

టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా యార్లగడ్డ వెంకట్రావు నియమితులైనప్పటి నుంచి ఎమ్మెల్యే వంశీ తీవ్ర అసహనంతో ఉన్నారు. నియోజకవర్గ టీడీపీ శ్రేణులను ఏకతాటికిపైకి తీసుకొచ్చి వారిలో జోష్ నింపడంలో యార్లగడ్డ విజయం సాధించారు. మరోవైపు వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కూడా బాగా పెరిగాయి. వైసీపీ నుంచి వచ్చిన రంగబాబు ఆ పార్టీ నుంచి మరికొందరిని టీడీపీలో చేర్చేందుకు సిద్ధమవుతున్నారన్న కారణంతోనే ఆయనపై వంశీ గ్యాంగ్ దాడికి తెగబడినట్లు సమాచారం. ఇటీవల సీఎం జగన్‌ను కలిసిన వంశీ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు అడగ్గా, దానికి సీఎం తిరస్కరించినట్లు సమాచారం. ఇప్పటికే మిగిలిన నియోజకవర్గాలకన్నా చాలా ఎక్కువే ఇచ్చామని, ఇక ఇవ్వడం కుదరదని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. వంశీ రాకతో వైసీపీలో ఇద్దరు బలమైన నాయకులుగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావును దూరం చేసుకోవాల్సి వచ్చిందన్న అభిప్రాయంలో వైసీపీ పెద్దలు ఉన్నారు. ఇటీవల జరిగిన భేటీలో ఇదే విషయాన్ని చెప్పడంతో అలిగిన వంశీ కొన్నిరోజులుగా నియోజకవర్గం దరిదాపులకే రావడం లేదని వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. ఈ పరిణామాలన్నీ వంశీలో అసహనానికి కారణమై ప్రత్యర్థులపై దాడులకు తెగబడేలా చేస్తున్నాయని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. రాజకీయంగా ఎదుర్కోలేక సుపారీ గ్యాంగులతో దాడులకు తెగబడటం అనేది రాజకీయాల్లో మంచి పరిణామం కాదని సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.



బరితెగింపు!

నిబంధనలు కాలరాస్తున్న మట్టి మాఫియా

- అధికార పార్టీ అండతో లెక్కలేనితనం
- పొలాల చెంతనే అక్రమ తవ్వకాలు
- కలెక్టర్‌కు వేమవరం రైతుల ఫిర్యాదు
- సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- అసలు సర్వే చేయకుండానే వెళ్ళిపోయిన అధికారులు
- లబోదిబో మంటున్న బాధిత రైతులు

- 4లో..

రేపు ఇంద్రకీలాద్రి ప్రదక్షిణ



వన్‌టౌన్, జనవరి 23 : ఇంద్రకీలాద్రి ప్రదక్షిణ ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్టు దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థాన ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డు వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి ద్వారా ఉదయం 9 గంటలకు మహామండపం వద్దకు చేరుకుంటుంది. సుమారు 7 కిలోమీటర్ల కాలినడకన ఇంద్రకీలాద్రి ప్రదక్షిణ సాగుతుంది. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.


బుద్దా వెంకన్న కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కేశినేని చిన్ని తదితరులు

టీడీపీని ఖాళీ చేయించడం నాని వల్ల కాదు

- కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

వన్‌టౌన్, జనవరి 23 : ఉమ్మడి కృష్ణాజిల్లాలో తెలుగుదేశం పార్టీని ఖాళీ చేయించడం విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) వల్ల కాదని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మంగళవారం వన్‌టౌన్ మల్లిఖార్జునపేటలోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కేశినేని చిన్ని, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి), ఇతర నాయకులు పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ, ఎంపీ నాని తూర్పు వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌కు ముఖ్య అనుచరుడిగా మారి ఆయన వెనుకే తిరుగుతున్నాడని విమర్శించారు. కొడాలి నానిలా బూతులు మాట్లాడుతున్న కేశినేని నానికి బుద్ధి చెప్పేందుకు నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కొట్టేటి హనుమంతరావు, సాదరబోయిన ఏడుకొండలు, పి.నాగేశ్వరరావు, పీవీ చిన్నసుబ్బయ్య, గుర్రం కొండ, నాగోతి రామారావు, తుపాకుల రమణమ్మ, బూదాల నందకుమారి, వల్లభనేని లక్ష్మీప్రసన్న, పితాని పద్మ, కొల్లి శారద, యర్రంశెట్టి పద్మ, కర్రి సునీత తదితరులు పాల్గొన్నారు.


జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నెట్టెం రఘురామ్

టీడీపీలో లోకేశ్‌ది క్రియాశీలక పాత్ర : నెట్టెం

ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా నెట్టెం మాట్లాడుతూ, పదిహేనేళ్లుగా పార్టీలో లోకేశ్ క్రియాశీలకంగా పనిచేస్తూ నేడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీని పటిష్ఠ పరచడం కోసం యువగళం పాదయాత్ర నిర్వహించారని తెలిపారు. నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి గాంధీ, గద్దె ప్రసాద్, సీహెచ్ ఉషారాణి, మాదాల రాజ్యలక్ష్మి, పి.ఈశ్వర్, ఈమని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలీల్‌ఖాన్ కార్యాలయంలో..



తారాపేటలోని మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్ కార్యాలయంలో నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేశినేని శివనాథ్(చిన్ని), కొమ్మారెడ్డి పట్టాభి, జలీల్‌ఖాన్ పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

జగన్ పాలనలో కార్మిక వర్గం నిర్వీర్యం : బొండా ఉమా


సీడీని ఆవిష్కరిస్తున్న బొండా ఉమా తదితరులు

అజిత్‌సింగ్‌నగర్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలోని కార్మిక వర్గం దగా పడిందని, కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసిన పాపం జగన్‌దే అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర మంగళవారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కళ్యాణ మండపంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్‌ల అధ్యక్షతన జరిగిన సదస్సుకు బొండా ఉమా, కేశినేని శివనాథ్(చిన్ని), కొమ్మారెడ్డి పట్టాభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాలు దగాపడ్డాయని, ముఖ్యంగా కార్మికలోకం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేక అనేక మంది చేతి వృత్తిదారులు ఆర్థికంగా సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల భవిష్యత్‌కు ప్రణాళిక రూపొందించి ఆర్థికంగా చేయూత ఇస్తామని హామీ ఇచ్చారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ, కార్మికులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కొమ్మారెడ్డి పట్టాభి, గొట్టుముక్కల రఘు తదితరులు మాట్లాడారు. అనంతరం కూరపాటి నాగరాజుతో పాటు 25 మంది సీపీఎం కార్యకర్తలు బొండా ఉమా సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీఎన్‌టీయూసీ నేతలు కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. 60 మంది కార్మికులు రక్తదానం చేశారు. 350 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం లోకేశ్‌పై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. 800 మందికి భోజన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

టీడీపీలోనే బీసీలకు రాజ్యాధికారం : కాగిత

పెడన, జనవరి 23 : బీసీలకు పెద్దపీట వేసింది, వారికి రాజ్యాధికారం ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన పట్టణ జయహో బీసీ సభ మంగళవారం బ్రహ్మపురం దేవాంగ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, బీసీ రక్షణ చట్టం ద్వారా బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలుస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కుదించడం వల్ల బీసీలు పదవులను కోల్పోయారని దుయ్యబట్టారు. బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన మోసాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, చేనేత పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టివేయడంతో దానిపై ఆధారపడ్డ కార్మికులు అవస్థలు పడుతున్నారన్నారు. కొనకళ్ల బుల్లయ్య, సాదరబోయిన ఏడుకొండలు, యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, అక్కుమహంతి రాజా, బచ్చుల బోసు, లంకే నారాయణ ప్రసాద్, బత్తిన దాసు, పరసా సూర్యనారాయణ, బెజవాడ నాగరాజు, కోరుమిల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. తొలుత జ్యోతీరావుపూలే, ఎన్టీఆర్, కాగిత వెంకట్రావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీలను జగన్ మోసగించారు : దేవినేనిఉమా

జి.కొండూరు: బీసీలను జగన్ రెడ్డి మోసగించాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరంలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సభలో ఉమా మాట్లాడుతూ, 74 బీసీ వర్గాలను ఐదు వేల మంది బీసీ సోదరులపై జగన్ ప్రభుత్వం దాడి చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో కోమటి సుధాకరరావు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పటాపంచల నరసింహారావు, మల్లెల రాధాకృష్ణ, లంక లితీష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ఉండలేకే టీడీపీలోకి చేరికలు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : వైసీపీ అరాచకపాలనలో ఉండలేక ఎస్సీ నాయకులు తెలుగుదేశం పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం బందరు మండలం తాళ్లపాలెం శివారు ఘంటవారిపాలెం గ్రామంలో 20 దళిత కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారిని కొల్లు రవీంద్ర పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికీ పర్యటించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రాయపల్లిలో ఇంటింటికీ కుళాయి అందిస్తామన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, లంకే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బరితెగింపు!


రైతు పొలాన్ని అనుకుని నిబంధనలకు విరుద్ధంగా 60 అడుగుల లోతున అక్రమ క్వారీయింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
వేమవరంలో మైనింగ్ మాఫియా రైతుల పొలాలను సైతం మింగేస్తుండటంతో స్థానిక రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ దిల్లీరావు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను దీనిపై నివేదిక కోరారు. ఈ క్రమంలో విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారులు రైతుల పొలాల్లో మంగళవారం సర్వేకు వచ్చి రైతుల పొలాల్లోకి వచ్చి తవ్వారా లేదా అన్నది పరిశీలించకుండా.. పోలవరం కాలువ పరిధిలోకి వస్తుందా.. రాదా.. అంటూ సర్వే చేసి వెళ్లడం అధికారుల తీరును ప్రశ్నార్థకం చేస్తోంది.

> బస్తీమే సవాల్.. దిక్కున్న చోట చెప్పుకోండి.. మమ్మల్ని అడిగే దమ్ము, ధైర్యం ఎవరికి ఉంది.. విజయవాడ రూరల్ మండలంలో మైనింగ్ మాఫియా దందా కొనసాగుతోంది. అనుమతులు లేకుండా కొత్తూరు, తాడేపల్లిలలో అర్ధ సంవత్సర కాలంగా అక్రమ క్వారీయింగ్ చేస్తున్న మైనింగ్ మాఫియా రైతుల పొలాలను కూడా కబ్జా చేసి మట్టి తవ్వేస్తోంది.

- నిబంధనలు కాలరాస్తున్న మట్టి మాఫియా
- అధికార పార్టీ అండతో లెక్కలేనితనం
- పొలాల చెంతనే అక్రమ తవ్వకాలు
- కలెక్టర్‌కు వేమవరం రైతుల ఫిర్యాదు
- సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- అసలు సర్వే చేయకుండానే వెళ్ళిపోయిన అధికారులు
- లబోదిబోమంటున్న బాధిత రైతులు

సర్వే నెంబరు 145, 147, 148లలో ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్ మాఫియా నిబంధనలకు విరుద్ధంగా 60 అడుగుల లోతున తవ్వేస్తోంది. అనుమతులు ఉన్నా నిబంధనల ప్రకారం 60 అడుగుల మేర తవ్వటానికి వీలు లేదు. చెరువుల్లో మూడు మీటర్ల మేర తవ్వటానికి అనుమతి లేదు. అలాంటిది పొలాలను గ్రావెల్ పేరుతో 60 అడుగుల మేర తవేస్తు పక్కనే ఉన్న పొలాలకు కనీసం మూడు మీటర్ల అవతల తవ్వాల్సి ఉండాలన్న నిబంధనలు కూడా పట్టించుకోవడంలేదు.

కుంగిపోతున్న పొలం.. రైతు ఫిర్యాదు

వేమవరంలో పొరుగున ఉన్న పొలాల సరిహద్దు చివర 60 అడుగుల మేర తవ్వేయడంతో మట్టి పెళ్లలు విరగిపడటంతో పాటు రైతు నాగరాజుకు చెందిన భూమి కుంగిపోతోంది. రైతు నాగరాజు భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి లోపలికి వచ్చి మరీ తవ్వటంతో.. కొద్ది రోజుల కిందట రైతు అడ్డుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పొక్లెయిన్‌ను సీజ్ చేశారు. దీంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది.

అధికార అండతో..

మైనింగ్ మాఫియా పలుకుబడి ఉపయోగించి అది రైతు పట్టా భూమి కాదని, పోలవరం కాలువ భూమిని ఆక్రమించుకున్నట్టుగా కథ అల్లారు. దీంతో పోలీసులు రైతు నాగరాజును ప్రశ్నించారు. తనది పట్టాభూమి అని కావాలంటే పరిశీలించుకోవచ్చని పట్టాను చూపారు. దీంతో పోలీసులు పట్టా నిజమో కాదో తేల్చాల్సిందిగా రెవెన్యూ అధికారులను కోరారు. అప్పటి నుంచి నేటి వరకు రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో మైనింగ్ మాఫియా మరింత రెచ్చిపోయింది. రైతు భూమిలోకి చొచ్చుకు వచ్చి మరీ తవ్వేస్తోంది. దీంతో వేమవరం గ్రామానికి చెందిన రైతులతో పాటు గతంలో బాధితులైన కొత్తూరు, తాడేపల్లి రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ విచారణకు ఆదేశించటంతో.. రెవెన్యూ అధికారులు సర్వేకు ఉపక్రమించారు. సర్వే ప్రకారం మైనింగ్ మాఫియా.. రైతుల పొలాల్లోకి వచ్చిందా లేదా అన్నది పరిశీలించాల్సి ఉండగా.. ఆ పొలం పోలవరం కాలువ పరిధిలోకి వస్తుందా లేదా అన్నది పరిశీలించి వెళ్లారు. దీనిని బట్టి స్థానిక రెవెన్యూ అధికారులూ మైనింగ్ మాఫియా కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలనూ లెక్కలేనట్టుగా మారటంతో బాధితులు మరోమారు కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని చూస్తున్నారు. అక్కడా న్యాయం దొరకృపోతే కోర్టును ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

మహిళా సాధికారతకు ఆసరా

- నాలుగో విడత 322820 మందికి రూ.279 కోట్ల లబ్ధి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 23 : వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అనంతపురం జిల్లా ఉరవకొండలో ఆసరా నాలుగో విడత ఆర్థిక సాయాన్ని పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ దిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు తదితరులతో వర్చువల్‌గా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసరా పథకం నాలుగో విడత ద్వారా జిల్లాకు సంబంధించి 322820 మంది సభ్యులకు రూ.278.92 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో పాటు స్వయం సహాయక సంఘాల లబ్దిదారులు హాజరయ్యారు.


లబ్దిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు తదితరులు


డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, తదితరులు

కృష్ణాలో ఆసరా రూ.2895.02కోట్ల జమ

మచిలీపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, కుటుంబాలను చక్కదిద్దుకోవాలని, మరింతగా అభివృద్ధి చెందాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో నగదు జమచేసే కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి మంగళవారం కలెక్టర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 31336 డ్వాక్రా సంఘాలు ఉండగా, వాటిలో 307530 మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వీరికి ఆసరా పథకం ద్వారా రూ.295.02కోట్ల నగదును జమచేసినట్టు తెలిపారు. నగదు విడుదలకు సంబంధించిన చెక్కును కలెక్టర్, మచిలీపట్నం నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్ డ్వాక్రా మహిళలకు అందజేశారు.

విద్యార్థులు చేతిరాతపై దృష్టి సారించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 23 : అందమైన చేతిరాత.. ఉజ్వల భవితకు వెలుగు రేఖ అని సాంకేతిక విజ్ఞానం విస్తృతస్థాయిలో అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలోను అందమైన చేతిరాత ద్వారా మేధో వికాసం సాధ్యమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. జాతీయ చేతిరాత దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు లాజికల్‌గా గుర్తుంచుకొని, అందమైన చేతిరాత ద్వారా ప్రజెంట్ చేయడం ద్వారా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి అందమైన చేతిరాత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నిజాయితీ, ఓర్పు, నిబద్ధత, హార్డ్‌వర్క్‌తో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, అందమైన చేతిరాత అనేది ఓ జీవన నైపుణ్యం (లైఫ్ స్కిల్) అని, తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేసినప్పటి నుంచే అందమైన చేతిరాతపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని సూచించారు. జాతీయ స్థాయి కాలిగ్రఫీ ప్రత్యేక చేతిరాత నిపుణుడు పి.భువన చంద్ర మాట్లాడుతూ, చదవడం ఎంత ముఖ్యమో అందంగా రాయడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 2023-24లో 6,500 మంది విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరిలో 100 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో, 16 మంది జూనియర్ కేటగిరీ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు. కలెక్టర్ దిల్లీరావు కుమారుడు ఎస్.జీవితేష్ ఆగస్టులో జరిగే అంతర్జాతీయ ఎన్నారై కాలిగ్రఫీ లైవ్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్టు తెలిపారు.

మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతులకు

రూ.5.39 కోట్లు

- ఎంపీ వల్లభనేని బాలశౌరి వెల్లడి

మచిలీపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో మత్స్యకారుల గ్రామాల్లో మౌలిక వసతులు, ఇతరత్రా కనీస సౌకర్యాల కల్పనకు రూ.5.38కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులు చేయనున్నట్టు ఆయన తెలిపారు. సముద్రంలో లోతైన ప్రాంతంలో చేపలవేట కొనసాగించేందుకు అనువైన రెండు పెద్దబోట్లు, మత్స్య సంపద రవాణాచేసేందుకు వాహనం కొనుగోలుకు రూ.3.26కోట్ల నిధులు విడుదలైనట్టు ఆయన తెలిపారు. మత్స్యకార మహిళలు వ్యాపారం చేసుకునేందుకు, మత్స్యసంపదను భద్రపరిచేందుకు, వలల తయారీ, చేపలు ఎండబెట్టేందుకు, సోలార్ పవర్‌తో డ్రయింగ్‌ప్లాట్‌ఫాంలు, తాగునీటి వసతి నిమిత్తం వాటర్‌ట్యాంకర్‌ల నిర్మాణం, విద్యుదీకరణ పనులకు రూ.1.65కోట్లు విడుదలైనట్టు ఎంపీ తెలిపారు. చేపలు పాడవకుండా, భారీవర్షాలకు తడిచిపోకుండా ఉండేందుకు రూ.12లక్షలతో షెడ్‌ల నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. మత్స్యకార గ్రామాల్లో సురక్షిత తాగునీటి వసతిని ఏర్పాటు చేసేందుకు రూ.17లక్షలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరికరాల ఏర్పాటుకు రూ.16.64లక్షలు విడుదలైనట్టు ఎంపీ తెలిపారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బ్యాంకుల్లో ఎలాంటి తనఖా లేకుండా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీ తెలిపారు. ఇప్పటికే మచిలీపట్నం పోర్టుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.3,600కోట్ల రుణంతో పోర్టు పనులను చేయిస్తున్నామన్నారు. పోర్టు నిర్మాణం జరిగితే తీరప్రాంత మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. త్వరలో పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఎంపీ తెలిపారు.

ఎలక్షన్ సీజర్ నిర్వహణకు ప్రత్యేక యాప్

కృష్ణలంక, జనవరి 23 : ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే క్రమంలో ఈసీఐ వివిధ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదికలను అందుబాటులో వుంచడం జరిగిందని, దీనిలో భాగంగానే ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) మొబైల్ యాప్‌ను రూపొందించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. యాప్ వినియోగంపై వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంగళవారం కర్ణాటక సీఈవో కార్యాలయం నుంచి ఈసీఐ అధికారుల బృందం.. ఈఎస్ఎంఎస్ యాప్‌పై కర్ణాటక అధికారులకు ఫిజికల్‌గా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన సీఈవోలు, డీఈవోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ నోడల్ అధికారులు తదితరులకు వర్చువల్‌గా అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ దిల్లీరావు, డీసీపీ వి.అజిత, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. నగదు, లిక్కర్, డ్రగ్స్, విలువైన వస్తువులు, ఉచితాలు, ఇతర వస్తువుల సీజర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన యాప్ వినియోగంపై ఈసీఐ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇటీవల తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యాప్‌ను విజయవంతంగా వినియోగించడం జరిగిందని ఈసీఐ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్యపన్నుల శాఖ అదనపు కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, వివిధ శాఖ అధికారులు హాజరయ్యారు.

బందరులో వరుస చోరీలు!

- బెంబేలెత్తుతున్న ప్రజలు

శ్రీనివాసనగర్‌లో చోరీ జరిగిన ఇల్లు


మచిలీపట్నం టౌన్, జనవరి 23 : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంటికి తాళం వేస్తే చాలు తలుపులు, లాకర్లు పగులకొట్టి బంగారం, నగదు దొంగిలించేస్తున్నారు. తాజాగా శ్రీనివాసనగర్‌లో ఇంటి యజమాని జమ్మలమడక దత్తాత్రేయుడు ఈనెల 15న హైదరాబాద్ వెళ్లి మంగళవారం తిరిగి రాగా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. దాదాపు 170 గ్రాముల బంగారం, రూ. 70 వేల నగదు చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల పట్టపగలు నాగపోతరావుసెంటర్‌లో ధాన్యం వ్యాపారి ఇంటి తలుపులు పగులకొట్టి పెద్ద ఎత్తున నగదు, బంగారం అపహరించిన సంగతి తెలిసిందే. అది మరువకముందే మచిలీపట్నంలో ఫోటో స్టూడియోలో రెండు కెమెరాలు, బస్టాండ్ వద్ద, సుకర్లాబాద్ మస్జిద్ వద్ద బైక్‌లు అపహరణకు గురయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీలో దసరా సమయంలో సాంబ్రాణి వేస్తామని చెప్పి ఇంట్లో నగదు, ఆభరణాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసుల నిఘా కొరవడిందనే విమర్శలు వినబడుతున్నాయి. శ్రీనివాసనగర్‌లో దొంగతనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐతో పాటు ఎస్ఐలు, క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో చేరిన అంగన్వాడీలు

విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్లకు సంబంధించి ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో అంగన్వాడీలు మంగళవారం నుంచి విధులకు హాజరయ్యారు. జిల్లాలో 1425 మంది వర్కర్లు, 1475 మంది హెల్పర్లు ఉన్నారు. సమ్మెలో ఉండగా ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ ప్రకారం 150 మంది వర్కర్లు, 146 మంది హెల్పర్లు విధుల్లో చేరారు. మిగిలిన 1329 మంది హెల్పర్లు, 1275మంది వర్కర్లు మంగళవారం విధుల్లో చేరారు. అంగన్వాడీలకు మద్దతుగా కార్మిక సంఘాలు బుధవారం చేపట్టే బంద్‌ను విరమించుకున్నట్టు కార్మిక సంఘాలు తెలిపాయి.

28న జాబ్‌మేళా

కృష్ణలంక, జనవరి 23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర లయోలా కళాశాలలో 28వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ అవకాశాన్ని ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమో అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. 'స్కిల్‌యూనివర్స్‌ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్'లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. జాబ్‌మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని దిల్లీరావు తెలిపారు. ఇతర వివరాలకు 9603368324, 9347779032, 7095991379, 9391254464 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కృష్ణలంక : ఎన్టీఆర్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో జిల్లా కో-ఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, బ్లాక్ కో-ఆర్డినేటర్ పోస్టుల భర్తీకి ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి జి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, బ్లాక్ కో-ఆర్డినేటర్ పోస్టుల భర్తీకి గతేడాది అక్టోబరు 24న దరఖాస్తులు కోరుతూ ప్రకటన ఇవ్వడం జరిగిందని, ఇంటర్వ్యూ లేఖలు అందుకున్న అభ్యర్థులు ఈనెల 24వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు డీఆర్‌వో కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

నర్సులకు జపాన్‌లో శిక్షణ, ఉపాధి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న నర్సులు, నర్సింగ్ విద్యార్థినులకు శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించడం, జపాన్, జర్మనీలలో నియామకాలను సులభతరం చేసే లక్ష్యంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నావిస్ హ్యూమన్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్, ఈడీ అనిల్‌కుమార్, అసోసియేట్ మేనేజర్ చైతన్య, నావిస్ తరపున ఆ సంస్థ ఎండీ యష్ రాజ్‌కుమార్, టటకో ఒషిబుషి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇండో-జపాన్ ప్రోగ్రాంతో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	107, 115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.58

లయోలలో ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్‌పై సదస్సు

భారతీనగర్, జనవరి 23: ఆంధ్రా లయోల కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ అంశంపై మంగళవారం అవగాహన సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు రెండురోజులపాటు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఐసీటీ హైదరాబాద్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎల్.గిరిబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో స్థిరమైన అభివృద్ధి, కాలుష్య నియంత్రణ, ఇంధన నిర్వహణలో కెమిస్ట్రీ పాత్రను, డై సెన్సిటైజ్డ్ ఆర్గానిక్ అణువులను ఉపయోగించి సౌరశక్తి నుంచి విద్యుత్ రాబట్టడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, కన్వీనర్ డాక్టర్ జి.వి.రమణ, రసాయనశాస్త్ర విభాగాధిపతి పి.అనీల, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సుదీప్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నారాయణస్వామి, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు, విద్యార్థులతో 200మంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ భార్య మృతి
భర్తపై కేసు

పాయకాపురం, జనవరి 23 : భర్త దాడిలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య మంగళవారం మృతి చెందింది. వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన శివపార్వతికి, రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన మల్లిబోయిన శివకుమార్‌తో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసైన భర్త అనుమానంతో తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈనెల 20న భార్యాభర్తల మధ్య మరోసారి ఘర్షణ తలెత్తింది. ఆగ్రహానికి గురైన భర్త రుబ్బురోలు పొత్రంతో భార్యపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను బంధువులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భార్య సోమవారం రాత్రి మృతి చెందింది. నున్న రూరల్ పోలీసులు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీ పరీక్షల రిఫరెన్స్ పుస్తకాలు అందజేత



గవర్నర్‌పేట, జనవరి 23: బ్యాంకు, గ్రూప్స్, సివిల్స్, రైల్వే వంటి వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంగళ వారం రిఫరెన్స్ పుస్తకాలను ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ, సంస్థ కార్యదర్శి ఎంవీడీటీ నగేష్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జమలపూర్ణమ్మ మాట్లాడుతూ అభ్యర్థులు తమకు కావలసిన పుస్తకాలను రీడర్స్ ఆఫ్ డిమాండ్ పుస్తకంలో ఎంటర్ చేయగానే కొనుగోలు చేసి అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రంథా లయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పటమట, జనవరి 23 : బొప్పన భవకుమార్ టీడీపీలో చేరుతున్న సందర్భంగా పలువురు జనసేన పార్టీ నేతలు మంగళవారం బెంజిసర్కిల్ వద్ద బొప్పన కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రజోన్ ఎలక్షన్ కమిటీ కన్వీనర్ బాడిత శంకర్, విజయవాడ సిటీ జనరల్ సెక్రటరీ లింగం శివప్రసాద్, 15వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు గాదిరెడ్డి అమ్ములు భవకుమార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

తాగడానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడు ఆత్మహత్య

వన్‌టౌన్, జనవరి 23: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని భార్యతో గొడవపడి మనస్తాపం చెందిన రాణిగారితోటకు చెందిన వెంకట దుర్గారావు(30) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం రాణిగారితోట కరెంట్ ఆఫీసు వెనుక ఒంటిపుల వెంకట దుర్గారావు భార్య దేవి, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను కంకర పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఇతను మద్యానికి బానిసై తరచూ భార్యను డబ్బులు ఇవ్వమంటూ గొడవపడుతున్నాడు. ఇటీవల దుర్గారావు తండ్రి ఇంట్లో వాడుకోమని దేవికి కొత్త ఫోన్ కొనిచ్చాడు. సోమవారం మద్యం తాగడానికి భార్యను డబ్బులు ఇవ్వమని దుర్గారావు గొడవపడగా ఆమె లేవంది. అతను ఫోన్ ఇవ్వమంటూ వేధించాడు. దీంతో ఆమె సమీప ప్రాంతంలో ఉన్న దుర్గారావు తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. మనస్తాపం చెందిన వెంకట దుర్గారావు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నేడు, రేపు విద్యుత్ కేంద్రంలో ఆధునికీకరణ పనులు

గవర్నర్‌పేట, జనవరి 23: ఏపీ ట్రాన్స్‌కో 220కేవీ ఉపకేంద్రం గుణదల డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ మెయిన్ లైన్, డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ విద్యుత్ కేంద్రంలో ఆధునీకరణలో భాగంగా ఈనెల 24, 25 తేదీల్లో కొన్ని మార్పులు చేస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో ఓ అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (గుణదల) ఎం. ఈశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రణాళికాబద్ధంగా పనులు శరవేగంగా చేసేందుకు ఏపీ జెన్‌కో సమాయత్తమైందని, దీని కారణంగా 220కేవీ గుణదల డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ లైన్‌లో (ఒక సర్క్యూట్) విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం జరగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైతే సాధారణ ప్రజలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నగరంలో కడప జిల్లావాసి అదృశ్యం

వన్‌టౌన్, జనవరి 23: విజయవాడలోని ఓ ప్రముఖ పబ్లికేషన్ సంస్థలో పనిచేస్తున్న కడప జిల్లాకు చెందిన వ్యక్తి (42) అదృశ్యమైనట్లు మంగళవారం గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం కడప జిల్లా బద్వేల్ దూదేకుల వీధిలో కారుమంచి పుల్లయ్య కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతను విజయవాడ హనుమాన్‌పేటలోని ఓ లాడ్జిలో ఉంటూ విజేత పబ్లికేషన్ సంస్థలో పనిచేస్తున్నాడు. గత ఏడాది అక్టోబరు 11న ఉదయం 8 గంటలకు ఓ వ్యక్తి బద్వేల్‌లో ఉన్న పుల్లయ్య కుటుంబసభ్యులకు ఫోన్ చేసి హనుమాన్‌పేటలోని ఎస్‌గ్రాండ్ డార్మెంటరీలో పుల్లయ్య ఉన్నట్లు చెప్పాడు. అదే నెలలో 23న ఉదయం 7.30కు అదే వ్యక్తి పుల్లయ్య కనిపించడం లేదని చెప్పాడే. పుల్లయ్య భార్య గౌశిమ విజయవాడ వచ్చి భర్త పనిచేస్తున్న పబ్లికేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుని గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిర్మల హృదయ భవన్ వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



తెలుగు యువత నాయకుల ఆధ్వర్యంలో



పశ్చిమ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంఎస్ బేగ్



చీరలు పంపిణీ చేస్తున్న ఎరుబోతు రమణారావు

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

- నగరంలో పలుచోట్ల కేక్ కటింగ్‌లు
- పేదలకు పండ్లు, మిఠాయిల పంపిణీ
- మహిళలకు చీరలు పంపిణీ

వన్‌టౌన్, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. వన్‌టౌన్ జెండా చెట్టు సమీపంలో ఉన్న టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఎంఎస్ బేగ్, టీం టీడీపీ ఆధ్వర్యంలో నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంఎస్ బేగ్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కోమలావిలాస్ సెంటర్ వద్ద 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రావూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మధుసూదనరావు ఆధ్వర్యంలో ఎంఎస్ బేగ్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

● పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ్ ఆధ్వర్యంలో దుర్గగుడి టోల్‌గేట్ సమీపంలోని కామధేను అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంకాయలు కొట్టారు. నాయకులు షేక్ గాలీబ్ షాహీద్, జి.హరికృష్ణ, నూకరాజు, జి.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

● లోకేష్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర తెలుగు వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

● భవానీపురంలోని 40వ డివిజన్ టీడీపీ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట చిన్నసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేశినేని శివనాథ్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తెలుగు యువత నాయకులు కాండ్రేగుల రవీంద్ర, డివిజన్ నాయ కులు రామానాయుడు, మాలా కొండయ్య, పాల్గొన్నారు.

● కేశినేని శివనాథ్ కార్యాలయంలో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేశినేని చిన్ని, క్రిస్టియన్ సెల్ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు వర్ల మోహనరావు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. చార్లెస్, ఆశీ ర్వాదం, ఎస్‌సీసెల్ జిల్లా అధ్యక్షుడు సంజయ్ పాల్గొన్నారు.

వన్‌టౌన్: గణపతిరావు రోడ్డులోని ఖిద్మత్ ఘర్ మహమ్మద్ ఫతావుల్లా కార్యాలయంలో నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేశినేని శివనాథ్ కేక్ కట్ చేశారు. యువకులు బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ఎండీ ఫతావుల్లా, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్, తెలుగు రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, పార్లమెంట్ మైనారిటీ సెల్ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు తమీన్ అన్సార్, జాహేద్, బడేషా, రియాజ్, మైనారిటీ సెల్ ఈస్ట్ అధ్యక్షులు అబ్దుల్ కరీం, పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖలిక్ తదితరులు పాల్గొన్నారు.

● భవానీపురం శివాలయం సెంటర్ వద్ద 41, 42 డివిజన్ల టీడీపీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేశినేని శివనాథ్ హాజరై కేక్ కట్ చేసి పంచి పెట్టారు. 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష, టీడీపీ నాయకులు పి.నాగేశ్వరరావు, కాండ్రేగుల రవీంద్ర, ఎం.శివశివాజీ, ఎం.పెద్ది సతీష్, పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో బొండా ఉమామహేశ్వరరావు ముందుగా కేక్ కట్ చేసి లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 60వ డివిజన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

చీరలు, టీ షర్టులు పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్: న్యూ రాజరాజేశ్వరిపేటలో టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు ఆధ్వర్యంలో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేసి లోకేశ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 50 మంది మహిళలకు చీరలు, 50 మందికి టీ షర్టులు పంపిణీ చేశారు.

పేదలకు పండ్లు పంపిణీ

గవర్నర్‌పేట: 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి నేతృత్వంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని నిర్మల హృదయ భవన్‌లో కేక్ కట్ చేసి వృద్ధులకు, పేదలకు పండ్లు, బ్రెడ్, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌చార్జి బొండా ఉమామహేశ్వరరావు, అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు, నేతలు మహేందర్ రాజు, వసంతకుమార్, కొండా, రాజేంద్ర, రత్న పాల్గొన్నారు.



మసీదు రోడ్డులో వేడుకలు

భవానీపురం: 43వ డివిజన్ ఏకలవ్యనగర్‌లో జరిగిన వేడుకల్లో ఎంఎస్.బేగ్ కేక్‌కట్ చేసి పంచారు. తెలుగు యువత అధికార ప్రతినిధి పూజల శ్రీనివాసరావు, కొనికి కొండయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, తాటి శ్రీకాంత్, దుర్గారావు, కిషోర్ పాల్గొన్నారు. 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు షేక్ సుభానీ ఆధ్వర్యంలో మసీదురోడ్డులో భారీ కేక్ కట్ చేసి నాయ కులు, కార్యకర్తలకు పంచారు. ● 45వ డివిజన్ కబేళా పెట్రోల్ బంకు దగ్గర డివిజన్ అధ్యక్షులు దేవరకొండ చక్రవర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ సుభానీ పాల్గొన్నారు.

భారతీనగర్: రమేష్ బాబు హాస్పిటల్ సెంటర్ సమీపంలో నాల్గవ డివిజన్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి లోకేశ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ నాయకులు దేవరపల్లి అంజనేయులు, బీసీ నాయకులు వల్లూరిపల్లి మధుసూదన రావు, అధికార ప్రతినిధి పట్టాభి, కొనసాని నాగమణి, గొర్రిపాటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

పటమట: రాష్ట్రానికి పట్టిన దరిద్రం మరో మూడు నెలల్లో వదిలిపోతుందని టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి పట్టాభి, కేశినేని శివనాథ్‌లు అన్నారు. నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్, కొమ్మారెడ్డి పట్టాభి, కిలారు శ్రావణ్ కుమార్ మాట్లాడారు. చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, దేవానంద్, సొంగా సంజయ్ వర్మ, మాదాల చిన్నతల్లి, నిమ్మగడ్డ ప్రసాద్, దోమకొండ రవి, మల్లెల రామకృష్ణ పాల్గొన్నారు.



దుర్గాపురంలో

పాతరాజరాజేశ్వరి పేట: 34వ డివిజన్, కేదారేశ్వరపేటలో డివిజన్ టీడీపీ నేతల ఆధ్వర్యంలో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్ ముందుగా కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. టీఎన్‌టీయూసీ పశ్చిమ ఉపాధ్యక్షులు సయ్యద్ నూరుద్దీన్, షేక్ అహ్మద్, మరియన్న దాస్, వీరబాబు, దుర్గారావు, లక్ష్మయ్య, దీన, రాజేశ్వరీ, కిల్లీ కొట్టు శ్రీను, పాల్గొన్నారు.

మొగల్రాజపురం: మధురానగర్ 29వ డివిజన్‌లో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు కేక్ కట్ చేసి డివిజన్ నాయకులకు శుభాకాంక్షలు చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు పీవీఆర్, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, బీసీ సెల్ నాయకులు వెంకన్న, అంగిరేకుల రాంబాబు , సందిరెడ్డి గాయత్రీ, బర్మా శ్రీను, అడపా కోటేశ్వరరావు, జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: 30వ డివిజన్ టీడీపీ కార్యాలయం రామకృష్ణాపురంలో లోకేశ్ పుట్టిన రోజు పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు, మిఠాయిలు పంచారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణ మోహన్,డివిజన్ అధ్యక్షుడు నారాయణ, ఇన్‌చార్జి రాజు. శ్రీనివాసరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● 27వ డివిజన్ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాపురం సాంబమూర్తిరోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంచారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్.సాంబశివరావు, నాయకులు కె.ఆర్.కుమార్,బి. వెంకటరావు, డి.జయరాజు, బి. హనుమంతరావు, బి. కొండ, రమణమ్మ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలో పేర్లు లేకుంటే
వెంటనే నమోదు చేసుకోండి
నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, జనవరి 23: ఓటర్ల తుది జాబితాలో పేర్లు లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పేర్కొన్నారు. మంగళవారం వీఎంసీ కమిషనర్ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల తుది జాబితా సెంట్రల్ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఉందని, ప్రజలు తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. పేరు లేనిచో వెంటనే పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫామ్ 6ను పూర్తి చేసి బీఎల్వోలకు అందజేయాలన్నారు. సెంట్రల్‌లో మొత్తం 273754 ఓట్లు ఉన్నాయన్నారు. వారిలో మహిళలు 140656, పురుషులు 133048 ఉన్నారని, ఇతర ఓట్లు 50 ఉన్నాయని పేర్కొన్నారు. 1400 ఓట్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలలో అదనంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, దానిలో భాగంగా ఐదు చోట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు వైజసుందర్‌పాల్, వెంకట్, అన్సారీ ఎన్.వీరభద్రరరావు, ఎం.వినోద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రాణిగారితోట: రివర్ ఫ్రంట్ వర్క్ పనులను 20రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. మంగళవారం ఆయన వారధి వద్ద రివర్ ఫ్రంట్ పార్క్‌ను పరిశీలించారు. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలంటే ఇరువైపులా పనుల పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ట్రీ కెనాపీ, వాకింగ్, సైక్లింగ్‌ట్రాక్ రోడ్లు, బెస్మెంట్ పనులు పరిశీలించారు. పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వారధి నుంచి రామలింగేశ్వరనగర్ వరకు వాకింగ్ ట్రాక్‌పై ఒకేసారి 250 నుండి 500వరకు వాకింగ్ చేసేందుకు సౌలభ్యంగా ఉండేలా ట్రాక్ నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు.

టీడీపీ కుటుంబానికి నారా లోకేశ్ అండ
రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్

వన్‌టౌన్, జనవరి 23: జగన్‌రెడ్డి పాలనలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించినా, వేధింపులకు గురిచేసినా వారు అధైర్యపడకుండా టీడీపీ కుటుంబానికి నారా లోకేశ్ అండగా ఉంటున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్(అన్న) అన్నారు. మంగళవారం వన్‌టౌన్ పంజాసెంటర్‌లో ఉన్న హజియా ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్, టీం టీడీపీ ఆధ్వర్యంలో పశ్చిమ టీం టీడీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గన్నె నారాయణతో పాటు పార్టీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నె అన్న మాట్లాడుతూ లోకేశ్ కార్యకర్తలకు అండగా ఉంటూ వారు ఆపదలో ఉన్నప్పుడు కార్యకర్తల సహాయనిధి ద్వారా వారిని ఆదుకుంటున్నారని తెలిపారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన అభ్యర్థులను గెలిపించాలని తెలిపారు. ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ కేశినేని చిన్ని అడుగుజాడలలోనే తామంతా పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పశ్చిమ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ కమిటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పసుపుతోటలో భవిష్యతుకు గ్యారెంటీ

సత్యనారాయణపురం, జనవరి 23: 31వ డివిజన్ మధురానగర్ పసుపుతోట కరెంట్ ఆఫీసు వద్ద నుంచి మంగళవారం సాయంత్రం భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన పథకాలను వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎన్. సాంబశివరావు, పడమటి రామకృష్ణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, సంథిరెడ్డి గాయత్రి, ప్రసాద్, శేషమ్మ, టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామ్మోహన్ గ్రంథాలయ నిర్వహణ కమిటీ

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

గవర్నర్‌పేట, జనవరి 23: భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు మంగళవారం ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతరపూడి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ చేసిన పోరాటాలను, సేవలను, త్యాగాలను పాఠకులకు వివరించారు. గ్రంథాలయ నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: సుభాష్ చంద్రబోస్ జయంతి 27వ డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో దుర్గాపురం కొత్తవంతెన జంక్షన్‌లో మంగళవారం జరిగింది. తొలుత టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్ సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురం: సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం పాయకాపురం రాధానగర్‌లోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నగర నాయకుడు బొప్పన శ్యాంసన్ ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఐవో పి. శివ సత్యనారాయణరెడ్డి, నాని గౌడ్, శంకర్, సలోమి తదితరులు పాల్గొన్నారు.

విద్యాధరపురం: భవానీపురం హెచ్‌బీ కాలనీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, పలువురు నాయకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు సమర్పించారు. పార్టీ నాయకులు పసుపులేటి కృష్ణ, ఎండీ ఆయాజ్, తులసీ మురళీ, ఎస్.నూరిబాబు, ఎస్‌డి కరీముల్లా, ఎస్‌కే రెహమాన్, డి.మూర్తిరాజు, పి.ఆదిత్యరెడ్డి, కె.వినోద్, జి. సురేష్ పాల్గొన్నారు.



దాత సుగ్గున సాయి తేజ కుటుంబానికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి అధికారులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, జనవరి 23: దుర్గగుడిలో ప్రతిరోజు నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కానూరుకు చెందిన సుగ్గున సాయితేజ మంగళవారం అధికారులను కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

'పుణ్యభూమి నాదేశం'
శతాధిక కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


విజయవాడ కల్చరల్, జనవరి 23 : నేటి యువ తలో దేశభక్తిని, తెలుగు భాషపై ఆసక్తిని, పర్యావరణంపై అవగాహనని కలిగించేందుకు 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మల్లె తీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ తెలియ జేశారు. భారతకోకిల సరోజినీనాయుడు జయంతిని పురస్క రించుకొని ఫిబ్రవరి 11న నగరంలో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ వాల్ పోస్టర్‌ను సీనియర్ జర్నలిస్టులు చొప్పా రాఘవేంద్రశేఖర్, కుర్రా సురేష్‌బాబు మంగళవారం బందరురోడ్డు-అంబేడ్కర్ స్మృతివనంలో ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో ఉత్తమ మైన పది కవితలు ఎంపిక చేసి ఆరోజు జరిగే సభలో నగదు బహుమతి, ప్రశంసాపత్రం, సత్కారం ఉంటా యన్నారు. ఆసక్తి గల కవులు 8332903156 నెంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కలిమిశ్రీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 24 జనవరి 2024
cinema@andhrajyothy.com

సైఫ్‌కు సర్జరీ



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ మోచేతికి సర్జరీ జరిగింది. షూటింగ్‌లో యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నప్పుడు ఆయన ఎడమ చేతికి గాయం అయింది. వెంటనే ఆయన ముంబైలోని కోకిలా బెన్ ఆస్పత్రిలో సోమవారం చేరారు. అయితే ఇది కొత్త గాయం కాదు. 2017లో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో 'రంగూన్' చిత్రంలో నటిస్తున్నప్పుడు కూడా గాయపడ్డారు. అదే గాయం ఇప్పుడు తిరగబెట్టడంతో సర్జరీ అవసరమైంది. దాంతో ఆయన ఎడమ మోచేతికి సర్జరీ చేశారు వైద్యులు. మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సైఫ్ బాంద్రాలోని తన నివాసం దగ్గర చేతి కట్టుతో కనిపించారు. 53 ఏళ్ల సైఫ్ ప్రస్తుతం తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌లోనే ఆయన గాయపడ్డాడని అంటున్నారు కానీ, అధికారికంగా ఎవరూ వెల్లడించలేదు. తనకు సర్జరీ జరిగిన విషయాన్ని సైఫ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. అయితే ఏ షూటింగ్‌లో జరిగిందన్న విషయాన్ని మాత్రం ఆయన పేర్కొనలేదు.



మిస్ పర్ఫెక్ట్‌గా ఉన్న నేను మిసెస్ పర్ఫెక్ట్‌నయ్యా

లావణ్య

'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున మా సిరీస్ ట్రైలర్ రిలీజ్ కావడం ఆనందంగా ఉంది. ఈ సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. కానీ పూర్తయ్యే లోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యా. దీనికి ముందు నేను చేసిన కొన్ని ప్రాజెక్టుల వల్ల అలసిపోయా. అలాంటి టైమ్‌లో 'మిస్ పర్ఫెక్ట్' లాంటి స్క్రిప్ట్ దొరకడం నాకు పెద్ద రిలీఫ్' అన్నారు లావణ్య. ఆమెతో పాటు అభిజీత్, అభిజ్ఞ కీలక పాత్రలు పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ ఫిబ్రవరి 2న డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అన్నపూర్ణ స్టూడియో బేనర్‌పై సుప్రియ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. సోమవారం రాత్రి జరిగిన ప్రెస్‌మీట్‌లో సిరీస్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 'సుప్రియ గారితో 'సోగ్గాడే చిన్నినాయన' చిత్రం చేశాను. అది హిట్ అయింది. ఈ సిరీస్ కూడా హిట్ కావాలి. మా దర్శకుడు విశ్వక్ దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నా' అన్నారు.

దర్శకుడు విశ్వక్ మాట్లాడుతూ 'లావణ్య 'అందాల రాక్షసి' చిత్రంలో ఎలాంటి పెర్ఫార్మెన్స్ ఇచ్చారో అటువంటి నటనే ఈ సిరీస్‌లో కావాలనుకున్నా. అలాగే అభిజిత్ నటించిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' చూశాను. ఆడిషన్ ఇవ్వాల్సిన అవసరం తనకు లేకున్నా ఈ సిరీస్ కోసం ఆడిషన్ ఇచ్చాడు. షూటింగ్ టైమ్ సరదాగా గడిచింది' అని చెప్పారు. నిర్మాత సుప్రియ మాట్లాడుతూ 'కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం అంటే నాగార్జునగారికి, తాతగారికి ఇష్టం. అందుకే అన్నపూర్ణ సంస్థ పెట్టారు. చాలా మంది కొత్త వాళ్లకు అవకాశం ఇచ్చారు. చాలా మంది అమ్మాయిలు నో చెప్పిన పాత్రను నేను చేస్తానంటూ ముందుకు వచ్చి తన గట్స్ ఏమిటో ప్రూవ్ చేసింది అభిజ్ఞ. అభిజిత్ తన పాత్ర బాగా చేశాడు. మిస్ పర్ఫెక్ట్ కు లావణ్య పర్ఫెక్ట్. ఒక చిన్న కథలో బలమైన పాత్రలు ఉండి మిమ్మల్ని ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిజిత్, రోషన్, కేశవ్, మహేశ్ విట్టా, అభిజ్ఞ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ అదీప్ అయ్యర్ తదితరులు కూడా మాట్లాడారు.

స్వేచ్ఛ, ఆత్మగౌరవాలకు అద్దం పట్టే కెప్టెన్ మిల్లర్

జాతీయ ఉత్తమనటుడు ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రం ఈ నెల 26న తెలుగులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మీడియాతో ముచ్చటించారు.




'కెప్టెన్ మిల్లర్' ఆలోచన నాకు పదేళ్లక్రితమే మొగ్గ తొడిగింది. కథ రాస్తున్నప్పుడు తెలీకుండానే కథానాయకుడిగా ధనుష్ నా మస్తిష్కంలో మెదిలాడు. కథ పూర్తవ్వగానే ఆయన్ను కలిశాను. తనకు కూడా కథ బాగా నచ్చింది. అలా 'కెప్టెన్ మిల్లర్' మొదలైంది. బ్రిటిష్ ఆర్మీలో పనిచేస్తున్న భారతీయ సైనికుడి కథ ఇది. ధనుష్ అద్భుతమైన నటన కనబరిచాడు. ఆయనతో పనిచేయడం గొప్ప అనుభవం.

● ఇది చిత్రమైన కథ. 40శాతం యాక్షన్ ఉంటుంది. మిగతా అంతా హీరో ప్రయాణమే. ఇదోక ప్యూర్ డ్రామా. ప్రేక్షకులు తమకు తాము ఐడెంటిఫై చేసుకునేలా ఇందులో పాత్రలు ఉంటాయి. పాత్రధారులంతా ఒదిగిపోయి నటించారు. ఇందులోని ఓ కీలక పాత్రలో శివరాజ్‌కుమార్ నటించారు. ఆయన పాత్ర సినిమాకే హైలైట్‌గా నిలుస్తుంది. కన్నడ బ్లాక్‌బస్టర్ 'ఓం'లోని శివన్న నటనను మళ్లీ ఈ సినిమా గుర్తుచేస్తుంది. ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతం. శివన్న పాత్ర ప్రేక్షకులకు ఓ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.

● ప్రియాంక అరుళ్ మోహన్ ఇందులో కొత్తగా కనిపిస్తుంది. పూర్తిగా అభినయానికి అవకాశం ఉన్న పాత్రను ఇందులో ఆమె చేసింది. అలాగే సందీప్‌కిషన్ కూడా మంచి పాత్ర చేశారు. జీవీప్రకాశ్ సంగీతం, ముఖ్యంగా నేపథ్యసంగీతం ఈ సినిమాకు హైలైట్. 1930లో జరిగే కథ ఇది. అందుకే కెమెరా డిపార్ట్‌మెంట్‌తోపాటు, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కూడా చాలా శ్రమించాల్సివచ్చింది. సాంకేతికంగా నెక్ట్స్ లెవల్లో సినిమా ఉంటుంది. 'కెప్టెన్ మిల్లర్' స్వేచ్ఛ, ఆత్మగౌరవం గురించి చర్చించే కథ. అందరికీ నచ్చుతుందని నా నమ్మకం.

ఆకట్టుకునేలా అరి



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధానపాత్రలు పోషిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మాతలు. ఇందులోని సూర్య పురిమెట్ల పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూర్య పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, కథ, కథనం, సంగీతం అన్ని అంశాలూ ఆకట్టుకునేలా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని విడుదల చేయడంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుందని సమాచారం. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. వైవా హర్ష, శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేఖ సుధాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కృష్ణప్రసాద్, శివశంకరప్రసాద్, సంగీతం: అనూప్ రూబెన్స్.

హనుమాన్ విశ్వరూప విజువల్స్‌ని సవాలుగా తీసుకున్నా..



'అసాధారణ విజయాన్ని అందుకున్న 'హను-మాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడిగా పనిచేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం' అని విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు ఉదయకృష్ణ అన్నారు. ఆయన విజువల్స్ ఎఫెక్ట్స్ అందించిన 'హను-మాన్' చిత్రం ఎంతటి ఘనవిజయాన్ని అందుకుందో తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తేజా సజ్జా కథానాయకుడిగా కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా 200కోట్ల మైలురాయిని దాటి, ఇంకా అదే ఊపును కొనసాగిస్తోంది. ఈ సినిమా విజయం సాధించడం పట్ల ఉదయ్‌కృష్ణ ఆనందం వెలిబుచ్చారు. విజువల్ ఎఫెక్ట్స్ వినియోగించుకోవడంలో ఎస్.ఎస్.రాజమౌళి సరసన సగర్వంగా నిలిచేంత ప్రతిభ ప్రశాంత్‌వర్మలో పుష్కలంగా ఉందని ఉదయ్‌కృష్ణ పేర్కొన్నారు. రెండేళ్లుగా తన జీవితంలో అంతర్భాగంగా మారిపోయిన సినిమా 'హనుమాన్'. ఈ చిత్ర విజయం పడిన శ్రమంతా మరిచిపోయేలా చేసిందని ఆయన అన్నారు. ఈ సినిమాకోసం తను ఫేస్ చేసిన పెద్ద ఛాలెంజ్ పతాక సన్నివేశంలో హనుమంతుని విశ్వరూపమని, దర్శకులు కలలు గనే ఎంత గొప్ప విజువల్ అయినా సునాయాసంగా సాకారం చేసే సామర్థ్యం తనకుందని ఉదయ్‌కృష్ణ చెబుతున్నారు.

పెళ్లికి ముందు...



యూత్‌ను ఎట్రాక్ట్ చేసే కథతో పాటు మంచి సందేశం ఇస్తూ నిర్మించిన 'బిఫోర్ మ్యారేజ్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. మూడు దశాబ్దాల క్రితం 'టార్జన్ సుందరి', 'ప్రేమ ఘర్షణ', 'సంసార వీణ' వంటి చిత్రాలు నిర్మించిన వై.నాగేశ్వరరెడ్డి తనయుడు ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి తీసిన సినిమా ఇది. భరత్, నవీనా రెడ్డి జంటగా నటించిన ఈ చిత్రానికి శ్రీధర్ రెడ్డి అటాకుల దర్శకత్వం వహించారు. ఎస్.కె.ఎం.ఎల్. మోషన్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా ఆదినారాయణ ఈ సినిమా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'లేడీ ఓరియంటెడ్ సినిమా ఇది. హీరోయిన్ బాగా చేసింది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరించాలి' అని కోరారు. 'పెళ్లికి ముందు తప్పు అనిపించని పొరపాటు ఆ తర్వాత జీవితంలో ఊహించని మార్పులకు కారణం అవుతుంది. అదే విషయాన్ని ఈ చిత్రంలో చెప్పాం. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా క్వాలిటీతో తీయడానికి నిర్మాత సహకరించారు. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు దర్శకుడు. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు నిర్మాత చెప్పారు. మంగ్లీ పాడిన పాట హైలైట్ అవుతుందని తెలిపారు.



నక్షత్రాల వెలుగులతో తివారీ రామాయణ్

దేశమంతా రామనామస్మరణతో పులకించిపోతున్న వేళ నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందనున్న 'రామాయణ్' సినిమా విషయంలో ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. 'కేజీఎఫ్'తో సూపర్‌హీరో ఇమేజ్‌ను సొంతం చేసుకున్న హీరో యష్ ఇందులో రావణ పాత్ర పోషించనున్నట్టు సమాచారం. మరికొన్ని కీలక పాత్రల విషయానికొస్తే.. హనుమంతుడిగా దేవ్‌దత్ నటిస్తుండగా, కుంభకర్ణుడి పాత్రకు బాబీడియోల్ ఎంపికైనట్టు తెలిసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుందని సమాచారం. ఇందులో రాముడిగా రణ్‌బీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి నటించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాని సినిమా



ఒకప్పటి చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్' చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన వి.యశస్వీ ఈ సినిమాకు దర్శకుడు. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మాతలు. మంగళవారం ఉదయం జరిగిన వేడుకలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ 'తను నమ్మింది బలంగా తీసే క్రియేటర్ యశస్వీ. 'సిద్ధార్థ్ రాయ్' వంటి సినిమా తెలుగులోనే కాదు ఏ భాషలోనూ రాలేదు. ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి. ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుంది' అన్నారు. దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'ఈ కథ విని ఆశ్చర్యపోయా. ఇలాంటి కథ తీయాలన్నా, అలాంటి పాత్ర చేయాలన్నా గట్స్ కావాలి. ఈ విషయంలో దీపక్ చాలా లక్కీ. అద్భుతంగా నటించారు' అన్నారు. 'విలన్ లేకుండా హీరో ఉండడు. ఈ సినిమా ఫస్ట్‌హాఫ్ విలన్ అయితే, సెకండాఫ్ హీరో. కథ వినగానే అలా అనిపించింది. ఇలాంటి కథతో సమాజానికి ఏం చెప్పదలుచుకున్నావ్ అని దర్శకుడు యశస్వీని కోప్పడ్డాను. కానీ చాలా అద్భుతంగా సినిమాను తీర్చిదిద్దారు' అన్నారు రచయిత లక్ష్మీ భూపాల. 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాల కోసం ఆకలితో ఎదురు చూసే ప్రేక్షకులకు మూడో చిత్రం 'సిద్ధార్థ్ రాయ్' అని మరో దర్శకుడు వీరశంకర్ చెప్పారు. 'నా పాత్రను అద్భుతంగా మలిచి ఈ ప్రయాణంలో ప్రతి క్షణం సపోర్ట్ చేసిన మా దర్శకుడికి థాంక్స్. ఈ సినిమాలో పాత్ర గురించి, దాన్ని ఎందుకు చేశానో తర్వాతి వేడుకల్లో మాట్లాడతా' అన్నారు హీరో దీపక్ సరోజ్.

మస్తు షేడ్స్ ఉన్నాయ్‌రా..



కమెడియన్ అభినవ్ గోమఠం హీరోగా మారాడు. ఆయన హీరోగా 'మస్త్ షేడ్స్ ఉన్నాయ్‌రా' అనే పేరుతో సినిమా రానుంది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో అభినవ్ చెప్పిన పాపులర్ డైలాగ్ ఇది. అదే హీరోగా అతని తొలి సినిమా టైటిల్‌కి కావడం విశేషం. వైశాలీ రాజ్ హీరోయిన్. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ లోగోను దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఆవిష్కరించారు. నటుడిగా అభినవ్ గోమఠంలోని కొత్తకోణాన్ని ఇందులో చూస్తారని, అన్ని ఉద్వేగాలూ ఈ సినిమాలో ఉంటాయని, వచ్చేనెల ద్వితీయార్థంలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు. తరుణ్‌భాస్కర్, అలీ రేజా, మొయిన్, చక్రపాణి ఆనంద్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభూ, కథ, అన్వర్ సాధిక్, మాటలు: రాధామోహన్ గుంటి, సంగీతం: సంజీవ్ టి.

ఎన్నికల ప్రయోజనం కోసమే యాత్ర 2

నట్టి కుమార్

లోక్‌సభ ఎన్నికల తర్వాతే రాజకీయ కథాచిత్రం 'యాత్ర 2'ను సెన్సార్ చేయాలని నిర్మాత, పంపిణీదారుడు, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు నట్టి కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సెన్సార్ బోర్డ్ ఛైర్‌పర్సన్‌కు, హైదరాబాద్ ప్రాంతీయ సెన్సార్ అధికారికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. పార్టీకి, ఆ పార్టీ నేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా ఈ సినిమా తీశారని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత సోనియా గాంధీకి వ్యతిరేకంగా తీయడంతో పాటు వారి పాత్రలను కించపరుస్తూ వ్యంగ్యంగా ఈ సినిమాలో చిత్రీకరించారని ఆయన వివరించారు. తాజాగా పబ్లిసిటీ కోసం విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్ ఇందుకు ఓ ఉదాహరణ అని నట్టి కుమార్ వెల్లడించారు. సోనియా గాంధీని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడుని చులకన చేసి చూపించడం వెనుక త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం పొందాలన్న ఉద్దేశం కనిపిస్తోందని తెలిపారు. సెన్సార్ ఇంకా చేయకుండానే ఫిబ్రవరి 8న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారనీ, సెన్సార్ మార్గదర్శకాలకు ఇది విరుద్ధమనీ, దీనిపై కూడా చర్య తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను కుమార్ కోరారు. చిత్రంలోని పాత్రలు ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండా, వ్యంగ్యంగా, అవమానకరంగా , కుట్రపూరితంగా లేకుండా చూసి సెన్సార్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా లోక్‌సభ ఎన్నికల ముందు 'యాత్ర 2' విడుదలైతే ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతూ, . ఇలా తమ నాయకులను కించపరిచే సన్నివేశాలతో ఎన్నికల ముందు ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్రయత్నిస్తే లీగల్‌గా ముందుకు వెళ్తానని నట్టి కుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు.



యదార్ధ సంఘటనల మూడోకన్ను

అమెరికాలో యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'మూడో కన్ను'. సాయికుమార్, శ్రీనివాసరెడ్డి, నిరోషా, వీరశంకర్, కాశీవిశ్వనాథ్, మాధవిలత ఇందులో ప్రధానపాత్రధారులు. నాలుగు కథలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దర్శకులు కూడా నలుగురు కావటం విశేషం. సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయిసురేంద్రబాబు ఈ చిత్రానికి దర్శకులు. కె.వి.రాజమహి, సునీత రాజేందర్ దేవులపల్లి నిర్మాతలు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ చేతులమీదుగా ఘనంగా విడుదల చేశారు. సినిమా విజయం సాధించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని శ్రీకాంత్ శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్ర బృందం మాట్లాడారు. ఈ నెల 26న ఈ సినిమా విడుదల కానుంది.

రొమాంటిక్ హనీమూన్ ఎక్స్‌ప్రెస్




చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాలరాజశేఖరుని దర్శకుడు. కె.కె.ఆర్, బాలరాజ్ నిర్మాతలు. కల్యాణీమాలిక్ స్వరపరిచిన 'నిజమా..' అంటూ సాగే ప్రేమగీతాన్ని రామ్‌గోపాల్‌వర్మ చేతులమీదుగా విడుదల చేశారు. 'నిజమా' పాట మెలోడియస్‌గా ఉందని, చాలా బాగా తీశారని, కెమెరా వర్క్ సూపర్ అని రామ్‌గోపాల్‌వర్మ అభినందించారు. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. విభిన్న కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు చెప్పారు. సుహాసిని, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శిష్టా వి.ఎమ్.కె.

కనువిందు చేసే కృత్రిమం

ఫ్యాషన్

సహజసిద్ధమైన అందాలు అన్నిసార్లూ, అందరికీ సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు ఫ్యాషన్‌గా కనిపించడం కోసం, కృత్రిమ అందాలను ఆశ్రయించడంలో తప్పు లేదు. అలా అందుబాటులోకి వచ్చినవే, కృత్రిమ కనురెప్పలు, గోళ్లు, వెంట్రుకలు. వాటి గురించి తెలుసుకుందామా?





కృత్రిమ కనురెప్పలు

ఒత్తైన కనురెప్పలు ముఖానికి కచ్చితంగా అందాన్ని తెచ్చిపెడతాయి. కానీ అలాంటి కనురెప్పలు ఎంతో అరుదుగా కొంతమందికే ఉంటాయి. కనురెప్పలు ఒత్తుగా లేని వాళ్లు ఆర్టిఫిసియల్ ల్యాషెస్‌ను ఎంచుకోవచ్చు. జిగురుతో కనురెప్పల పైన అంటించుకునే వీలుండే ఈ ల్యాషెస్ ఎన్నో రంగుల్లో దొరుకుతాయి. కాబట్టి కనురెప్పల వెంట్రుకలతో చక్కగా కలిసిపోయే కృత్రిమ కనురెప్పలను ఎంచుకోవాలి.

కృత్రిమ గోళ్లు

గోళ్లు అందరికీ దృఢంగా పెరగవు. అలాంటి వాళ్లు ఆర్టిఫిసియల్ నెయిల్స్‌ను గోళ్ల మీద అంటించుకోవచ్చు. నచ్చిన రంగు వేసుకున్న కృత్రిమ గోళ్లు, సహజసిద్ధమైన గోళ్లను మరిపించేలా ఉంటాయి. వేర్వేరు సైజుల్లో దొరికే ఆర్టిఫిసియల్ గోళ్లను గోళ్ల పైన జిగురుతో అంటించుకోవచ్చు. వీటిని తొలగించడం కూడా తేలికే! అవసరం లేనప్పుడు వీటిని భద్రపరుచుకుని, తిరిగి వాడుకోవచ్చు.









కృత్రిమ హెయిర్ ఎక్స్‌టెన్షన్స్

కొందరికి నుదురు పెద్దగా ఉండవచ్చు. ఇంకొందరికి నుదుటి దగ్గర వెంట్రుకలు ఊడిపోయి ఉండవచ్చు. ఇంకొందరికి తలంతా పలుచబడి ఉండవచ్చు. ఇలాంటి వాళ్లు స్టైలిష్‌గా కనిపించడం కోసం కృత్రి హెయిర్ ఎక్స్‌టెన్షన్ల మీద ఆధారపడవచ్చు. సహజసిద్ధ జుట్టును మరిపించేలా ఉండే ఈ ఎక్స్‌టెన్షన్లు వేర్వేరు సైజుల్లో దొరుకుతాయి. నుదురు, చెవుల దగ్గర, తల వెనక, పైన... ఇలా అంటించుకునే ప్రదేశాన్ని బట్టి ఈ ఎక్స్‌టెన్షన్ల సైజులూ, ధరలూ మారుతూ ఉంటాయి.

సెలబ్ షెఫ్

పాటల్లో మురిపించి... కథలో అప్పుడప్పుడూ కనిపించే రొటీన్ కథానాయిక కాదు ఆమె. హీరో ఎవరైనా... అతడికి సరితూగే పాత్రలతో మెప్పిస్తున్న నటి. పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు... ఇప్పుడు... నటనకు ఆస్కారమున్న చిత్రాలకే ప్రాధాన్యమిస్తూ సాగిపోతోంది **భూమి పెడ్నేకర్.** తొలి సినిమాలో భారీ కాయంతో కనిపించిన భూమి... ఆ తరువాత ఏ బాలీవుడ్ తారకూ తీసిపోని రూపాన్ని సంతరించుకుంది. ఎలా..?



అప్పుడు బొద్దుగా...
ఇప్పుడు మెరుపు తీగలా!

భూమి పెడ్నేకర్ పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు కూడా కాలేదు. కానీ ఇరవైకి పైగా చిత్రాల్లో నటించింది. ఈ కొద్ది ప్రయాణంలోనే ఎవరికీ తలవంచని దృఢమైన పల్లెటూరి అమ్మాయి పాత్రలకు కేరాఫ్ అడ్రెస్‌గా పేరు తెచ్చుకుంది. చక్కని అభినయంతో మూడు ఫిలిమ్‌ఫేర్‌తో పాటు మరెన్నో అవార్డులు దక్కించుకుంది. అనుష్కా, దీపికా, కత్రినా, కియారా అద్వానీ లాంటి స్టార్ హీరోయిన్ల మధ్యన తనకూ ఒక ప్రత్యేక మార్కెట్‌ను సంపాదించుకుంది. ఎన్నో ఇబ్బందులు పడి పరిశ్రమలో నిలదొక్కుకున్న భూమి... పుట్టింది, పెరిగిందీ ముంబయిలోనే. ఆమె తండ్రి సతీష్ మహారాష్ట్ర మంత్రి. ఓరల్ కేన్సర్‌తో తండ్రి చనిపోవడంతో... తల్లి సుమిత్ర పొగాకు వ్యతిరేక ఉద్యమం నడిపారు. 'ఆర్య విద్యామందిర్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన భూమి... నటి కావాలని కలలు కన్నది. అందుకు ఆమె తల్లితండ్రులు కూడా మద్దతునిచ్చారు. పదిహేనేళ్ల వయసులోనే నటనలో శిక్షణ కోసం 'విజిలింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్'లో చేరాలనుకుంది భూమి. బ్యాంకులో రుణం తీసుకుని మరీ అందులో చేర్పించారు ఆమె తల్లితండ్రులు. అయితే తరగతులకు తరచూ డుమ్మా కొట్టడంతో భూమిని ఆ సంస్థవాళ్లు బయటకు పంపించారు.

ఏడాదిన్నర తిరక్కుండానే 'యష్‌రాజ్ ఫిలిమ్స్'లో అసిస్టెంట్ క్యాస్టింగ్ డైరెక్టర్‌గా చేరింది భూమి. ఆరేళ్లు అక్కడ పని చేసిన తరువాత తరువాత... అంటే 2015లో ఊహించని బ్రేక్ వచ్చింది. మొదటి నుంచి నటి కావాలనుకున్న ఆమెకు 'దమ్ లగాకే హైసా'లో హీరోయిన్‌గా అవకాశం లభించింది. అందులో అధిక బరువు గల అమ్మాయి పాత్ర. దాని కోసం అప్పటికే బొద్దుగా ఉన్న భూమి... మరింత బరువు పెరిగింది. ఆ చిత్రంలోని నటనకుగానూ 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' వరించింది. ఇక అక్కడి నుంచి జయాపజయాలతో సంబంధం లేకుండా ఆమెకు అవకాశాలు వస్తూనే ఉన్నాయి. కానీ అన్నిటికీ ఓకే చెప్పకుండా విభిన్నంగా ఉన్న పాత్రలను మాత్రమే ఎంచుకొంటోంది. తొలి చిత్రం పూర్తయ్యేసరికి 89 కేజీల బరువున్న ఆమె... తక్కువ సమయంలోనే 57 కేజీలకు తగ్గింది. భూమి రూపంలో మార్పు చూసి నాడు అభిమానులే కాదు... బాలీవుడ్ ప్రముఖులు సైతం అభినందనలతో ముంచెత్తారు. విశేషమేమంటే... దీని కోసం ఆమె ఏ డైటీషియన్ సహాయం తీసుకోలేదు.

'తిండి విషయంలో నేను అస్సలు ఆలోచించను. నచ్చింది తినడంలో నాకు ఎంతో ఆనందం. ముఖ్యంగా స్వీట్స్ నాకు బాగా ఇష్టం. అవి లేకుండా నా రోజు పూర్తవదు. బరువు తగ్గే క్రమంలో కూడా నేను నా రోజువారీ ఆహారంలో పెద్దగా మార్పులేవీ చేయలేదు. నెయ్యి, బటర్, బటర్‌మిల్క్... ఇవన్నీ నా మెనూలో ఉంటాయి. వదిలేసిందల్లా పంచదారతో చేసిన వంటలు మాత్రమే. అలాగే పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్స్) పరిమితికి మించి లోపలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నాను.



వర్కవుట్ ఇలా...

- భూమి వర్కవుట్స్‌లో ఒక్కో రోజు ఒక్కో రకం వ్యాయామాలు ఉంటాయి.
- అధిక క్యాలరీలు కరగడానికి వారంలో కనీసం మూడు రోజులు కార్డియో చేస్తుంది.
- కండరాలు దృఢంగా మారడానికి రెండు రోజులు వెయిట్ ట్రైనింగ్.
- వీటితోపాటు యోగా, 'హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్' (హెచ్ఐఐటీ) లాంటివి ఉంటాయి.

'ఒకేచోట అదేపనిగా కూర్చోకుండా నాకు నచ్చదు. అలాగే చిన్న చిన్న అవసరాలు... లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కడం, దూరం తక్కువగా ఉన్న వాటికి కారులో కాకుండా నడిచి వెళ్లడం, పక్కన నీళ్ల సీసా పెట్టుకోకుండా దాహం వేసినప్పుడల్లా లేచి వెళ్లి తాగడం చేస్తుంటాను. ఇవి కూడా వ్యాయామాల్లాంటివే కదా' అంటుంది భూమి.

ఇదీ మెనూ...

భూమి ఆహారంలో ప్రధానంగా జొన్న, రాగులు లేదా సజ్జ పిండితో చేసి రోటీలు ఉంటాయి. దీంతోపాటు పెద్ద బౌల్ నిండా వెజిటబుల్ సలాడ్, ఆపిల్, కొన్ని వాల్‌నట్స్, డ్రైడ్ బెర్రీస్ వంటి బలవర్ధక ఆహారం తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చటి నీళ్లు, డీటాక్స్ జ్యూస్. రోజుకు కనీసం ఏడు లీటర్ల నీళ్లు తాగుతుంది.
- బ్రేక్‌ఫాస్ట్‌లో మరగబెట్టిన పాలతో ముస్లీ, ఫ్లాక్స్/ సన్ ఫ్లవర్ సీడ్స్, ఎగ్‌వైట్‌తో ఆమ్లెట్, ఏదైనా పండు
- మధ్యాహ్నం లంచ్‌లో బటర్, సబ్జీ, పప్పుతో రోటీ. ఇంట్లో తయారైన పెరుగు లేదా మజ్జిగ. గ్రిల్డ్ చికెన్ శాండ్‌విచ్, కీర, క్యారెట్ సలాడ్. లేదంటేఏ చికెన్ గ్రేవీతో బ్రౌన్ రైస్.
- సాయంత్రం ఆపిల్, బొప్పాయి లేదా జామ పండు, బాదం, వాల్‌నట్స్, గ్రీన్ టీ.
- రాత్రి భోజనంలో పండ్లు, ఆకుకూరల సలాడ్, బాదం/ జీడిపప్పు, గ్రిల్డ్ చికెన్/ పనీర్. లేదా ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, చిన్న కప్పు బ్రౌన్ రైస్/ మల్టీగ్రెయిన్ రోటీ.

చెబితే నమ్మరు కానీ... ఇప్పటివరకు నేను ఏ డైటీషియన్ లేదా న్యూట్రిషనిస్ట్ వద్దకు వెళ్లలేదు. నేను, మా అమ్మ కలిసి ఒక మెనూ రూపొందించాం. అందుకు నేనైతే గూగుల్‌లో శోధించి, నా శరీర తత్వానికి ఏది సరిపోతుందో చూసుకున్నాను. ఇక అమ్మకైతే బరువు తగ్గడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలన్నది బాగా తెలుసు. ఏ వంటైనా ఇంట్లో వండిందే తింటాను. ఆహార నియమాలు పాటిస్తూనే క్రమం తప్పని వ్యాయామం నా జీవనశైలిలో భాగం చేసుకున్నాను. బరువు తగ్గడానికి ఇంతకు మించి నేను కష్టపడిందేమీ లేదు. ఏదిఏమైనా డైట్ ప్లాన్ నుంచి రిఫైన్డ్ షుగర్‌ను తీసేయడం నా జీవితంలో తీసుకున్న ఉత్తమ నిర్ణయం' అంటున్న భూమి... ఐదు రోజులకు ఒకసారి నియమాలు పక్కన పెట్టి తనకు ఇష్టమైనవన్నీ లాగించేస్తుంది. 'పంచదారకు బదులు తేనె వాడతాను. అందులో జింక్, పొటాషియం, క్యాల్షియం, విటమిన్ బి-6 సమృద్ధిగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నిమ్మ రసంలో, ఓట్స్ లేదా పాలలో... తేనెను ఎలాగైనా తీసుకోవచ్చు. అయితే అతిగా మరిగిస్తే అందులోని పోషకాలు, రుచి పోతాయి' అని చెబుతోంది. పంచదార వాడకంవల్ల 59 శాతం మంది ఆరోగ్యం దెబ్బతిందని అమెరికాలో జరిపిన ఓ అధ్యయనంలో తేలింది.

సినిమాలు, యాడ్ షూటింగ్‌లతో క్షణం తీరిక లేకుండా గడిపే భూమి... ఇన్‌స్టాగ్రామ్‌లో తన పార్టీలు, ఫిట్‌నెస్‌కు సంబంధించిన పోస్టులు తరచూ అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటితోపాటు ఆరోగ్యకరమైన జీవన విధానానికి తనకు తెలిసిన సూచనలు, చిట్కాలు ఇస్తుంటుంది. అంతేకాదు... పర్యావరణ హితం కోసం వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు 'ఐక్యరాజ్యసమితి' చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొంటోంది.

స్టైల్ టిప్స్


హై హీల్స్‌లో హై క్లాస్‌గా...



ఎత్తు చెప్పులు ధరిస్తే లుక్ అదిరిపోతుంది కానీ... అవి ఎంతో కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. దాంతోపాటు పాదాలకు, చీలమండలకు, వెన్నెముకకు కూడా సమస్యలు తెచ్చిపెడతాయంటున్నారు నిపుణులు. అందుకే చాలామంది వాటిని ధరించడానికి వెనకాడుతూ ఉంటారు. కానీ కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే హై హీల్స్ ఇబ్బందులను అధిగమించవచ్చు. అదెలాగంటే...

- ఎత్తు చెప్పులను ప్రతి రోజూ వేసుకుంటే ఇబ్బందులు తప్పవు. కాబట్టి రోజు విడిచి రోజు వేరే చెప్పులు వేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తే పాదాలు సేదతీరి నొప్పి పెట్టకుండా ఉంటాయి.
- ఎత్తు చెప్పుల వల్ల పాదాలు, మడమలు నొప్పి పెడుతూ ఉంటాయి. అలాం నొప్పి పెడితే... అరచేతులతో పాదాలను ముందుకు వెనక్కి వంచి, టెండాన్లు వదులయ్యేలా చేయాలి. ఇలా చేస్తే నొప్పి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.
- పాదాలు ఒరుసుకుపోకుండా, ఇన్‌సోల్స్ వాడుకోవచ్చు. సిలికాన్‌తో తయారైన ఇన్‌సోల్స్ పాదాలకు కుషన్‌లా పని చేస్తాయి.
- ఎత్తు చెప్పుల్లో రోజంతా గడిపితే పాదాలు అలసటకు లోనవుతాయి. ఈ ఇబ్బందిని వదిలించాలంటే ఇంటికి వెళ్లిన వెంటనే వేడి నీళ్లలో పాదాలను 15 నిమిషాల పాటు ముంచి ఉంచాలి. ఇలా చేస్తే అలసటకు గురయిన పాదాల్లోని టెండాన్లు, కండరాలు రిలాక్స్ అవుతాయి.

చిట్కా



దుస్తులు కొత్తగా!

ఖరీదైన దుస్తులు ఒక్క ఉతుకులోనే పాడైపోతే ఉసూరుమంటుంది. వెలసిపోకుండా, కుట్లు ఊడిపోకుండా, కుంచించుకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

- **రంగు పోకుండా:** కొత్త దుస్తులను వాషింగ్ మెషిన్‌లో వేసే ముందు, లేదా ఉతికే ముందు ఉప్పు కలిపిన నీటిలో గంట పాటు నానబెట్టాలి. ఇలా చేస్తే రంగులు వదలకుండా ఉంటాయి.
- **బ్లీచింగ్:** రంగు దుస్తులు ఉతికేటప్పుడు వాటిని బ్లీచ్ చేయకూడదు.
- **వేడి నీటిలో:** ఉతికితే కుంచించుకుపోతాయి అనే అనుమానం ఉన్న దుస్తులను వేడి నీటిలో ఉతకాలి.
- **ఇలా వద్దు:** వదులు అయిపోయే వీలున్న దుస్తులను వాషింగ్ మెషిన్‌లో కాకుండా చేత్తో ఉతకాలి. దండెం మీద కాకుండా క్లాత్ డ్రైయర్ స్టాండ్ మీద పరిచి ఆరబెట్టాలి.
- **రీస్టిచ్:** కుట్లు ఊడిపోయే వీలున్న దుస్తులను కొన్న వెంటనే రీ స్టిచ్ చేయించాలి.
- **తగిన వేడి:** ఇస్త్రీ చేసేటప్పుడు క్లాత్ దేనితో తయారయిందో, అందుకు తగిన వేడిని సెట్ చేసుకున్న తర్వాతే ఐరన్ చేసుకోవాలి.
- **పాత దుప్పటిపై:** ఐరన్ చేసేటప్పుడు వేడెక్కిన ఐరన్ బాక్స్‌ను నేరుగా దుస్తుల మీద పెట్టేయకుండా మొదట, పాత దుప్పటి మీద రుద్ది, తర్వాతే ఐరన్ చేయాలి.

ఆ చులకన భావం పోవాలి

రెండేళ్ల వయసు నుంచీ జీవితంతో పోరాటం మొదలెట్టారు అర్చనా విజయన్. 'వైకల్యం ఉన్న నువ్వు డాక్టరెలా అవుతా'వనే ఎగతాళిని ఎదిరించి, మెడికల్ సీట్ సాధించారు. గాయనిగానూ రాణిస్తున్న ఇరవైమూడేళ్ల కేరళ అమ్మాయి స్ఫూర్తివంతమైన కథ ఆమె మాటల్లోనే...



"మనకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు మన పరిమితుల గురించి ఆలోచించడం మొదలుపెడతాం. కోరుకున్నది చెయ్యలేమేమోనని భయపడతాం. మనలోని లోపాల్ని తలచుకుంటూ కుమిలిపోవడానికి బదులు... మన సామర్థ్యాల మీద దృష్టి కేంద్రీకరించాలి. వాటిని పటిష్ఠం చేసుకోవాలి. లక్ష్యాల్ని ఏర్పరచుకోవాలి. వాటిని నెరవేర్చుకోవడానికి ప్రయత్నించాలి. నేను చేసింది కూడా అదే. ఊహ తెలియనప్పటి నుంచే జీవితంతో పోరాడుతున్నాను. మాది కేరళలోని పాలక్కాడ్. రెండేళ్ళ వయసులో... నాకు 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' అనే జన్యు వైకల్యం ఉందని నిర్ధారణ అయింది. అది కేంద్ర నాడీ వ్యవస్థ మీద తీవ్ర ప్రభావం చూపిస్తుంది. నడవడం కాదు కదా... కదలడం కూడా కష్టమవుతుంది. ఫిజియోథెరపీతో దాన్ని అధిగమించవచ్చని మొదట్లో వైద్యులు చెప్పారు. కానీ అయిదేళ్ళు వచ్చేసరికి అడుగు కూడా వెయ్యలేని పరిస్థితి. మా నాన్న పోస్ట్‌మ్యాన్. నన్ను బడిలో చేర్పడానికి ఆయన ఎందరినో బతిమాలాల్సి వచ్చింది. చివరికి ఒక గవర్నమెంట్ స్కూల్‌లో నాకు అడ్మిషన్ ఇచ్చారు. నాన్న లేదంటే అమ్మ నన్ను స్కూల్‌కు మోసుకొని తీసుకువెళ్ళేవారు. అందరు పిల్లల్లా ఆటలు ఆడలేకపోతున్నానని బాధపడేదాన్ని. అయితే టీచర్లు, తోటి విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండడం కాస్త ఊరటగా ఉండేది. కానీ హైస్కూల్లో ఎనిమిదో క్లాసులో చేరినప్పుడు... నాకు ఎదురైన అతి పెద్ద సమస్య... టాయిలెట్. అక్కడ ఇండియన్ స్టైల్ టాయిలెట్ ఉండేది. దాంతో వేరే స్కూల్‌కు మారాలనుకున్నాను. ఇది టీచర్ల ద్వారా పాఠశాల యాజమాన్యానికి తెలిసింది. నాకోసం వెస్ట్రన్ టాయిలెట్ నిర్మించారు. అంతేకాదు... టెన్త్ క్లాస్ వరకూ నేను ఒకే తరగతి గదిలో పాఠాలు వినడానికి అవకాశం ఇచ్చారు. ఒకవైపు తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్నా... మరోవైపు ఇటువంటి ప్రోత్సాహం బాగా చదవాలనే కోరికను నాలో పెంచింది. టెన్త్‌లో అన్ని సబ్జెక్ట్‌లో 'ఎ-ప్లస్'లో పాసయ్యాను. డాక్టర్ కావాలనేది నా కల. దాంతో సైన్స్ స్ట్రీమ్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకున్నాను. "సైన్స్ కోర్సులంటే ల్యాబ్‌లో గంటల తరబడి నిలబడాల్సి ఉంటుంది. నీ శారీరక స్థితి దానికి అనుకూలంగా లేదు. కాబట్టి సీటు ఇవ్వలేం" అనేది కాలేజీల నుంచి వచ్చిన సమాధానం. "ఎందుకింత పట్టుపడుతున్నావ్? వేరే కోర్సుల్లో చేరొచ్చు కదా!" అని పరిచయస్తులు సలహా ఇచ్చారు. "ఎందుకంటే నేను డాక్టర్ కావాలి" అని వారితో స్పష్టంగా చెప్పాను. ఆఖరికి గవర్నమెంట్ కాలేజీలో సీటు దొరికింది. లేబరేటరీలు వేర్వేరు అంతస్తుల్లో ఉండేవి, లిఫ్టులు లేవు. కొన్నాళ్ళు నా ఫ్రెండ్స్ నన్ను మోస్తూ తీసుకువెళ్ళేవారు. ఆ తరువాత మా పాత స్కూల్ యాజమాన్యం వీల్ చైర్‌ను నాకు గిఫ్ట్‌గా ఇచ్చింది. దాంతో ఇంటి నుంచి కాలేజీకి రావడం, తరగతి గదుల మధ్య తిరగడం కాస్త సులువైంది.



నేషనల్ బోర్డ్ వరకూ వెళ్ళాను...

ఇంటర్ రెండేళ్ళూ కష్టపడి చదివాను. టెన్త్ వరకూ మళయాళ మీడియంలో ఉండేదాన్ని. ఇంటర్‌లో ఇంగ్లీష్ మీడియంలోకి మారాను. అయినప్పటికీ 98 శాతం మార్కులతో పాసయ్యాను. 2016లో 'నీట్' ఎగ్జామ్ రాశాను. మంచి ర్యాంక్ వచ్చింది. శారీరక వైకల్యాలున్న వారికి ఎంబిబిఎస్‌లో చేరాలంటే రాష్ట్ర మెడికల్ బోర్డు ధ్రువీకరణ తప్పనిసరి. కాబట్టి ఫిజికల్ ఎగ్జామినేషన్ కోసం త్రివేండ్రం మెడికల్ కాలేజీలో... కేరళ మెడికల్ బోర్డు ముందుకు హాజరయ్యాను. అక్కడి అధికారులు నా దరఖాస్తును తిరస్కరించడమే కాదు... "నువ్వు మెడిసిన్ చదవడానికీ, ప్రాక్టీస్ చెయ్యడానికీ అనర్హురాలివి" అన్నారు. పైపెచ్చు ఎగతాళిగా మాట్లాడారు. అడ్మిషన్ ఇవ్వలేదు.. మరుసటి ఏడాది మళ్ళీ 'నీట్' రాసి, ఎంపికకు వెళ్ళాను. ఈసారీ అదే అధికారులు... అదే వైఖరి. అప్పటి వరకు... వైకల్యాలున్న వారు మెడిసిన్ చదవడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కొన్ని పరిమితులు విధించింది. తరువాత వాటిలో కొంత సడలింపు ఇచ్చింది. దాని ప్రకారం నేను అర్హురాలినే. అయినా అడ్మిషన్ ఇవ్వనన్నారు. ఈలోగా ప్రవేశాల గడువు ముగిసిపోయింది. ఇది నాకు చాలా అవమానంగా అనిపించింది. 'నీట్' కోసం రెండేళ్ళ పాటు ఇంట్లోనే ఉండి ప్రిపేర్ అయ్యాను. ఆ సమయంలోనే ఎన్నో జీవిత పాఠాలూ నేర్చుకున్నాను. "ఈసారి కూడా సీట్ రాలేదు కదా! ఏం చేద్దామనుకుంటున్నావ్?" అనే ప్రశ్నలు ఎందరి నుంచో ఎదురయ్యేవి. మరోవైపు నా తల్లితండ్రుల్లో నా భవిష్యత్తు గురించి ఆందోళన ఎక్కువయింది. కానీ నా లక్ష్యాన్ని మార్చుకొనే ఉద్దేశం నాకు లేదు. న్యాయపోరాటానికి కూడా సిద్ధమయ్యాను. 2018లో మళ్ళీ 'నీట్' రాశాను. ఈసారి 'నేషనల్ మెడికల్ బోర్డు'కు విజ్ఞాపన పంపాను. మద్రాస్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఆ బోర్డ్ ముందు హాజరయ్యాను. అవకాశం ఇస్తే నేను మెడిసిన్ చేయగలననీ, వైద్య వృత్తికి న్యాయం చెయ్యగలననీ అక్కడ అధికారులను ఒప్పించగలిగాను. నేషనల్ బోర్డు ఇచ్చిన ధ్రువీకరణతో... కొట్టాయం మెడికల్ కాలేజీలో సీట్ వచ్చింది. అలా నా కలలో ప్రధానమైన భాగం నెరవేరింది.

తొలి అడుగు వేశాను...

ఇప్పుడు ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరంలో ఉన్నాను. మా అమ్మ దేవి నాతోపాటు కొట్టాయంలోనే ఉండి, నా సంరక్షణ చూసుకుంటోంది. ఈ నాలుగేళ్ళలో... నా చదువుకు నా వైకల్యం ఎక్కడా అడ్డంకి కాలేదు. స్టడీస్‌తో పాటు సాహిత్యం, సంగీతం నాకు ఇష్టం. 'కేరళ స్టేట్ యూత్‌ఫెస్టివల్'తో సహా అనేక వేదికల మీద సంగీత ప్రదర్శనలు ఇచ్చాను. కొన్ని సినిమాల్లో పాటలు కూడా పాడాను. 'బ్యాక్‌ప్యాకర్స్' అనే చిత్రం కోసం ప్రసిద్ధ గాయకుడు హరిచరణ్‌తో పాడిన యుగళ గీతానికి ఎన్నో ప్రశంసలు లభించాయి. మరోవైపు కాలేజీ యాక్టివిటీస్‌లోనూ, వివిధ సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నాను. నాలాంటివారికోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రధానంగా ప్రస్తావిస్తున్నాను. పాఠశాలలు, కళాశాలలు, రైల్వే స్టేషన్ల లాంటి ప్రదేశాల్లో శారీరక వైకల్యాలు ఉండేవారి కోసం లిఫ్టులు, వీల్ చైర్ల కోసం ర్యాంపులు, సౌకర్యవంతమైన టాయిలెట్ల ఏర్పాటు చేయాలి. బాగా చదువుకొని, ఉన్నత స్థానాల్లో ఉన్నవారిలో కూడా వికలాంగులంటే ఉన్న చులకనభావం పోవాలి. వాటికోసం కృషి చేస్తున్నాను. చిన్నప్పుడు ఇల్లు, స్కూలు తరువాత ఎక్కువ కాలం గడిపింది ఆసుపత్రుల్లోనే. వైద్య వృత్తి సమాజానికి ఎంత ప్రధానమైనదో, వైద్యుల ప్రవర్తన ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నాకు బాగా తెలుసు. మందులు రాసి ఇచ్చినంతమాత్రాన వైద్యుల బాధ్యత పూర్తికాదు. రోగికి మానసిక స్థైర్యాన్ని, కోలుకోగలననే ధీమాను అందజేయాలి. రోగులు చెప్పేది శ్రద్ధగా వినే సహనం కావాలి. నేను మంచి వైద్యురాలిని కాగలననే నా నమ్మకం. మా కుటుంబంలో మొదటి డాక్టర్ కావాలనుకున్నాను. దానికోసం తొలి అడుగు విజయవంతంగా వేశాను. నా కథ నాలాంటివారు కొందరిలోనైనా ఆత్మవిశ్వాసం నింపుతుందని నా ఆశ."

'కోడికత్తి' నిందితుడి బెయిల్‌పై
విచారణ నేటికి వాయిదా

» నేడు ఎన్ఐఏ తరపున ఏఎస్‌జీ వాదనలు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోడికత్తితో దాడి కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ నిందితుడు జె.శ్రీనివాసరావు వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. పిటిషనర్ నిరాహార దీక్ష చేస్తున్నాడనే కారణంతో త్వరగా విచారించాలంటూ కోర్టును ఒత్తిడి చేయలేరంటూనే, ఇప్పటికే పిటిషనర్ తరఫు వాదనలు విన్నామని గుర్తు చేసింది. ఎన్ఐఏ తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. ఈ కేసులో తనకు విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టు బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. కేసుకు సంబంధించిన ఫైళ్లన్నిటినీ కోర్టు ముందుంచామని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలియజేశారు. అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నరసింహ శర్మ వాదనలు వినిపిస్తారని, బుధవారం కోర్టుకు హాజరవుతారని, విచారణను వాయిదా వేయాలని ఎన్ఐఏ తరఫు న్యాయవాది కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది.

నిలకడగా కోడికత్తి శ్రీను ఆరోగ్యం

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 23: విశాఖపట్నం కేంద్ర కారాగారంలో నిరశన దీక్ష చేపట్టిన శ్రీనివాస్ (జగన్‌పై కోడికత్తితో దాడి కేసులో నిందితుడు) ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. గత ఆరు రోజులుగా ఏమీ తినకపోవడంతో నీరసించిపోయాడు. దాంతో జైలు అధికారులు వైద్యులతో పరీక్షలు చేయించి, తగిన చికిత్స అందిస్తున్నారు. దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్‌తో ములాఖత్‌కు దరఖాస్తు చేస్తే అధికారులు తిరస్కరిస్తున్నారు.

'స్కిల్' అప్రూవర్ వాంగ్మూలం 29న, రెడ్‌బుక్ కేసు 30న

విజయవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా కేసులు నమోదు చేసిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాసుకున్నానని, అధికారంలోకి రాగానే వారిని వదిలిపెట్టేది లేదని టీడీపీ యువనేత లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్ విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడు శిరీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదును ఏసీబీ కోర్టు ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఇవ్వాలని, ఆ తర్వాతే వాంగ్మూలం నమోదు చేయాలని మరో నిందితుడు, మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

కొత్తగా రూ.1100 కోట్ల అప్పు

» 10 నెలల్లో మంగళవారం అప్పులే రూ.62,000 కోట్లు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం కొత్తగా మరో రూ.1100 కోట్ల అప్పు తెచ్చింది. రిజర్వు బ్యాంకు వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించి ఈ అప్పు తెచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కేవలం మంగళవారం తెచ్చిన అప్పులే రూ.62,000 కోట్లకు చేరుకున్నాయి. వీటికి కార్పొరేషన్ అప్పులు దాదాపు రూ.25,000 కోట్లు అదనం. ఇవి కాకుండా ఎంప్లాయిస్ కటింగ్స్, నాబార్డు, ఈఏపీ, కేంద్రం ఇచ్చే రుణాల ద్వారా ఇంకో రూ.15,000 కోట్లు అప్పు చేశారు. అన్నీ కలుపుకొంటే పది నెలల్లో అప్పులు లక్ష కోట్ల రూపాయలు దాటాయి.

రూ.210 నుంచి రూ.5వేలకు..!

» వివాహ రిజిస్ట్రేషన్ ఫీజు భారీగా పెంపు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివాహాల రిజిస్ట్రేషన్ల ఫీజు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వివాహ నమోదు ఫీజు రూ.200 ఉండగా తాజాగా ఆ ఫీజును రూ.500కి పెంచారు. వివాహ వేదిక వద్దకే సబ్ రిజిస్ట్రార్ రావాలనుకుంటే రూ.5,000 ఫీజు చెల్లించాలి. గతంలో ఇది రూ.210గా ఉండేది. ప్రభుత్వ సెలవు రోజుల్లో వివాహాల నమోదు ఫీజును రూ.5,000గా నిర్ణయించారు. వివాహ నమోదు రికార్డుల పరిశీలన ఫీజును రూ.100కు పెంచారు. గతంలో ఇది ఒక్క రూపాయిగా ఉండేది. వివాహ నమోదు రిజిస్టర్‌లోని ఏదైనా సర్టిఫైడ్ కాపీ కోసం రూ.100 చెల్లించాలి.



లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ కేంద్రం కార్యాలయంలో 1100 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న కాల్వ, కళా, ధూళిపాళ్ల, నక్కా ఆనందబాబు, కనపర్తి శ్రీనివాస్

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 500 కిలోల కేకును, లారీపై ఎన్టీఆర్ నిలువెత్తు కటౌట్ ఉంచి ర్యాలీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.





కేక్.. కేక!

» లోకేశ్ పుట్టిన రోజుకు 1100 కిలోల భారీ కేక్

» లారీపైనే కట్ చేసి సంబరాలు

» టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు



లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా హైకోర్టు వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు తదితరులు.

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువ నేత లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఆ పార్టీ నేతలు కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. ఏకంగా 1100కిలోల కేక్ తయారు చేయించి, ఒక లారీపై పెట్టి ఇక్కడి తమ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేర్చారు. పార్టీ నేత కొమ్మారెడ్డి కిరణ్ దీనిని తయారు చేయించారు. అంత భారీ కేక్‌ను కిందికి దించే అవకాశం లేకపోవడంతో.. పార్టీ ముఖ్య నేతలు కిమిడి కళా వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, నక్కా ఆనందబాబు, పర్చూరి అశోక్ బాబు, కాల్వ శ్రీనివాసులు, ఎంఎ షరీఫ్ లారీ పైకి ఎక్కి దానిని కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచారు. టీఎన్ఎస్ఎఫ్ నేత రేపాకుల శ్రీనివాస్ విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కార్ల ర్యాలీ జరిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో 30 కిలోల కేక్ కట్ చేసి పంచారు. పార్టీ బీసీ సెల్, తెలుగు యువత ఆధ్వర్యంలో వేర్వేరుగా భారీ కేక్‌లు కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, అమెరికాలోని న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ వద్ద మన్నవ మోహనకృష్ణ యూత్.. లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించింది. హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వేడుకల్లో బక్కని నర్సింలు, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, నన్నూరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు పవన్ శుభాకాంక్షలు

లోకేశ్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలను భగవంతుడు అందించాలని పవన్ ఆకాంక్షించారు.

డ్రోన్ ఎగురవేశారని కేసు

» దళిత నేత పులి చిన్నాపై పోలీసు కేసు నమోదు

తుళ్లూరు, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు జరిపినందుకు రాజధాని అమరావతి జేఏసీ నేత, టీడీపీ నాయకుడు పులి చిన్నాపై తుళ్లూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక రోజు ముందుగా సోమవారం తాళ్లాయపాలెం పుష్కర్ ఘాట్ వద్ద కృష్ణానదిలో నీటిపై చిన్నా టీడీపీ యువత సభ్యులు, నాయకులు వంద అడుగుల లోకేశ్ కటౌట్‌ను పడవల ర్యాలీతో ఊరేగించారు. డ్రోన్‌తో చిత్రీకరించారు. రాజధాని ప్రాంతంలో డ్రోన్ ఎగురవేయడానికి అనుమతి లేదంటూ చిన్నాతోపాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీకి తొత్తుగా జగనన్న

» సీఎం జగన్‌పై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్

విజయనగరం/శ్రీకాకుళం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): "వైసీపీ ప్రభుత్వ స్వలాభం కోసం కేంద్రంలోని బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టింది. మన రాష్ట్రంలో బీజేపీకి ఒక్క ఎంపీ కానీ, ఎమ్మెల్యే కానీ లేరు. అలాంటి మన రాష్ట్రంపై బీజేపీ పెత్తనం ఏంటి?" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిప్పులు చెరిగారు. జిల్లాల పర్యటన చేపట్టిన ఆమె.. మంగళవారం విజయనగరం పట్టణంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్ర విభజన నేపథ్యంలో చట్ట ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం హోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. పదేళ్లు చాలదు 15 ఏళ్లపాటు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేసిన చంద్రబాబు కూడా హోదాను తీసుకురాలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగనన్న ఏకంగా బీజేపీకి తొత్తుగా మారిపోయారు. రాష్ట్రానికి రాజధాని లేదు. పోలవరం లేదు. దివంగత నేత వైఎస్ చేపట్టిన జలయజ్ఞం పనులు తప్ప గత పదేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులు లేవు" అని అన్నారు. "నిరుద్యోగ సమస్య రాష్ట్రాన్ని వెంటాడుతోంది. ప్రత్యేక హోదా ఉంటే రాయతీలు అమలై పరిశ్రమలు వచ్చేవి. కానీ హోదాలేదు. పరిశ్రమలు స్థాపించే ప్రయత్నం చేయలేదు. ఎన్నికలు మరో రెండు నెలలు ఉన్న సమయంలో జగనన్నకు జాబ్ క్యాలెండర్ గుర్తుకు వచ్చిందా? గ్రూప్-1 ఉద్యోగాలు చేసే అర్హత మన రాష్ట్ర నిరుద్యోగ యువతకు లేదా?" అని షర్మిల ప్రశ్నించారు.



ఇచ్ఛాపురంలోని ప్రజాప్రస్థానం పైలాన్ వద్ద వైఎస్ షర్మిల అభివాదం

ఓటు ఎలా అడుగుతారు?

"నేను శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సులో ప్రయాణం చేశా. ఒక మహిళ తన ఆవేదనను వెల్లడించింది. మద్యం ధరలు పెంచితే తాగుడు తగ్గుతుందని ఆమె చెప్పింది. పింఛను డబ్బులు అయ్యాక ఇంట్లో డబ్బులు ఖర్చు చేసి ఇల్లు గుల్ల చేస్తున్నారని మరో మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. మద్య నిషేధం లేదు. రోడ్లు లేవు, రాజధాని లేదు. మెట్రో లేదు. పోలవరం లేదు. మరి ఓటు అడిగే హక్కు ఎక్కడిది?" అంటూ షర్మిల నిప్పులు చెరిగారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి సంతకం హోదాపైనే ఉంటుందని షర్మిల చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ చీఫ్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మేం మీతోనే..

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పీసీసీ చీఫ్ షర్మిల పర్యటనలో అధికార పార్టీ వైసీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో వైసీపీ ఎంపీటీసీ స్వయంగా పాల్గొన్నారు. ఆమర మాట్లాడుతూ.. "నాతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని బిల్లుల బకాయిల వల్ల ఆలోచనలో ఉన్నారు. సభకు జనాన్ని వారే పంపించారు" అని వివరించారు.

వైఎస్‌ను కాంగ్రెస్ అవమానించలేదు!

ఇచ్ఛాపురం పర్యటనలో భాగంగా కంచిలి మండలం ఆంపురం గ్రామంలో షర్మిల ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణికులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. "మొట్టమొదట నేను జగన్‌రెడ్డిగారు అని అనడం వైవీ సుబ్బారెడ్డిగారికి నచ్చలేదు. సరే ఇకపై జగనన్న గారూ అనే అంటా. నాకేమీ అభ్యంతరం లేదు" అన్నారు. కాగా, వైఎస్ఆర్‌ను అవమానించిన పార్టీ అంటూ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని, దీనిలో నిజంలేదని షర్మిల అన్నారు. ఇప్పటికీ వైఎస్ అంటే కాంగ్రెస్‌కు అభిమానం ఉందని, సోనియా గాంధీనే స్వయంగా చెప్పారని తెలిపారు.

- జగనన్న ఏకంగా బీజేపీకి తొత్తుగా మారిపోయారు. మోదీకి వైసీపీ ఎంపీలు ఊడిగం చేస్తున్నారు. ఏ ఫైల్‌పై సంతకం పెట్టమన్నా, ఏ చట్టం చేయాలన్నా, ఏ బిల్లు నెగ్గాలన్నా వైసీపీ ఎంపీలు బీజేపీకి ఊడిగం చేసి బిల్లులు నెగ్గేలా చేస్తున్నారు. ఇంత బానిసత్వానికి కారణం స్వలాభమే.
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఒక్క సారైనా నిలదీశారా? ప్రతిపక్ష నేతగా జగనన్న ఉన్నప్పుడు ప్రత్యేక హోదా సాధన కోసం టీడీపీ ఎంపీలను రాజీనామా చేసేందుకు ముందుకు రావాలని పిలుపిచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చాక అదే హోదా కోసం జగనన్న కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదో రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పాలి.
- తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్య నిషేధం అమలు చేస్తామని గత ఎన్నికల సమయంలో జగనన్న ప్రకటించారు. ప్రస్తుతం మద్యం అమ్మకాల ఆదాయంతోనే పాలన సాగిస్తున్నారు. ఎంతటి దౌర్భాగ్యం? మద్యనిషేధం అమలు చేయకపోతే మళ్లీ ఓటు అడగనని చెప్పిన జగనన్నకు ఓటు అడిగే అర్హత ఉందా?
- జగనన్న యువతను మోసం చేశారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్ లేదు. ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు.
- రాజశేఖరరెడ్డి బిడ్డే ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నా రాజశేఖరరెడ్డి పాలన మాత్రం కొనసాగించడం లేదు. రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గపు పాలన గురించి ప్రజలే ప్రతిఒక్కరికీ చెప్పాలి.

\- వైఎస్ షర్మిల

మాజీ మంత్రి కొణతాలతో షర్మిల భేటీ

వైఎస్ షర్మిల మంగళవారం రాత్రి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతో భేటీ అయ్యారు. సుమారు 20 నిమిషాలపాటు ఇరువురు చర్చించుకున్నారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిచయంతోనే వచ్చి కలిసినట్టు వెల్లడించారు.

దేశం రామ మయం..
రాష్ట్రం దొంగల మయం

» నకిలీ ఓట్లపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలి: బీజేపీ

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశమంతా రామ మయమైతే రాష్ట్రం మాత్రం దొంగల మయమైందని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ విమర్శించారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 'దొంగ ఓట్లు, కరెన్సీ నోట్లతో ఎన్నికల్లో గెలవాలని వైసీపీ పన్నాగాలు పన్నుతోంది. 175 స్థానాలు గెలుస్తామంటోన్న జగన్ మాటల్లో అర్థం అదే. అందుకే ఫేక్ ఎపిక్ కార్డ్(ఓటరు కార్డు)లపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలి' అని డిమాండ్ చేశారు. తిరుపతిలో 34వేల నకిలీ ఓట్లపై బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయడం సంతోషకరమని, అయితే ఈ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఐపీఎస్ అధికారులు సైతం నకిలీ ఓట్ల నమోదులో బాధ్యులైన జగన్ పార్టీ నేతలను తప్పించే ప్రయత్నం చేస్తుండటం దారుణమన్నారు.

నేతాజీ చిరస్మరణీయ యోధుడు: పవన్

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామాన భారత యువతలో పోరాట స్ఫూర్తిని నింపిన చిరస్మరణీయ యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా అంజలి ఘటించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా సైన్యాన్ని సిద్ధం చేసిన విధానం ఆయనలోని దేశభక్తిని, స్వాతంత్ర్య కాంక్షను, రణతంత్రాన్ని తేటతెల్లం చేస్తుందని చెప్పారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తిని, పోరాట పటిమను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా, ముఖ్యంగా యువతపైన ఉందని గుర్తుచేశారు.

కర్నూలు.. వలస బాట!

మిర్చి కోతలకు గుంటూరుకు తరలివచ్చిన 10 వేల కుటుంబాలు మే వరకు ఇక్కడే మకాం

» పొలాల్లో టెంట్లే ఆవాసం.. పాములతో సహవాసం

» మిర్చి ఘాటుకు తోడు.. పెరుగుతున్న ఎండలు

» నీళ్ల కోసం సుదూర ప్రాంతాలకు

» బడికెళ్లాల్సిన చిన్న పిల్లలూ పనిలోకే

» రాయలసీమకు ఉపాధిపై జగన్ హామీ నీటిమూటే!

కరువు సీమలో ఉపాధి కరువై వలసలు పెరిగిపోతున్నాయి. కర్నూలు జిల్లా నుంచి పెద్దఎత్తున కుటుంబాలకు కుటుంబాలే గుంటూరు జిల్లాకు వలస వచ్చాయి. మిర్చి కోతల పనులు ఇక్కడ ఉండడంతో కనీసం నాలుగు నెలలు పనిచేసినా ఏడాదంతా ఎలాగోలా నెట్టుకురావచ్చన్న ఉద్దేశంతో తరలివచ్చారు.



పల్నాడు జిల్లా తాళ్లచెరువులోని పొలంలో కర్నూలు కూలీలు వేసుకున్న టెంట్లు

గుంటూరు సిటీ, జనవరి 23: 'నేనూ సీమ బిడ్డనే.. కరవు సీమ రాత.. గీత మార్చి కూలీలకు శాశ్వత ఉపాధి చూపిస్తా' అని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నీటి మీద రాతే అయింది. కర్నూలు ఈ ఏడాది కూడా కడుపు చేత పట్టుకుని గుంటూరుకు వలస వచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి కోత సీజన్ ఆరంభం కావడంతో కర్నూలు నుంచి సుమారు 10 వేల కుటుంబాలు పనుల నిమిత్తం వచ్చాయి. మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో భారీ సంఖ్యలో కూలీలు వలస రావడం ఇక్కడి రైతులకు కాస్త ఉపశమనం కలిగింది. సాధారణంగా ఏటా రైతులే ఆ జిల్లాకు వెళ్లి ఎంతో కొంత నగదు ముందస్తుగా చెల్లించి కూలీలను తీసుకొచ్చేవారు. ఈ ఏడాది వాళ్లు కదలాల్సిన పనిలేకుండా అక్కడి నుంచి అధిక సంఖ్యలో కుటుంబాలతో వచ్చేశారు. ఐదేసి కుటుంబాలు కలిసి రూ.10 వేల కిరాయికి ఒక మినీ లారీ మాట్లాడుకుని వంట సామగ్రిని కూడా తీసుకొచ్చుకున్నారు. కర్నూలు జిల్లా కోస్గి, కౌతాలం, కోడుమూరు, కృష్ణగిరి, కల్లూరు మండలాల నుంచి వీరంతా వచ్చారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్లచెరువు, నీలేశ్వరపాలెం, పులిచింతల కాలనీలు, చింతపల్లి, కొత్తపల్లి, చెరుకుంపాలెం, పెదపాలెం, రెంటచింతల మండలంలోని గ్రామాలు వీరితో నిండిపోయాయి. ఒక్కొక్కరికి రోజుకు రూ.500 చొప్పున కూలీ పడుతుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో రైతులు వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి కోతలు అప్పగిస్తున్నారు. కర్నూలు నుంచి వచ్చిన వాళ్లు మే మొదటి వారం వరకు ఇక్కడే ఉంటారు.

బాల్యారిష్టాలు..

వలస వచ్చిన వారి పిల్లల పరిస్థితి దయనీయం గా ఉంది. తల్లిదండ్రులు తమతో పాటే వారినీ పనులకు తీసుకెళ్తున్నారు. బడికి వెళ్లి పాఠాలు వల్లె వేయాల్సిన దశలో ఎండలో మగ్గుతున్నారు. ఊరొదిలి వచ్చిన తమకు.. పిల్లలు కూడా పనికి వస్తేనే గిట్టుబాటు అవుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

అంతా పొలాల్లోనే..

పల్నాడు, గుంటూరు జిల్లాలకు వలస వచ్చిన కర్నూలు కూలీల కష్టాలు వర్ణనాతీతం. మిర్చి పొలాలకు దగ్గర్లో చిన్న చిన్న టెంట్లు వేసుకుని జీవిస్తున్నారు. అక్కడ విష సర్పాల బెడద ఎక్కువగా ఉందని పలువురు చెబుతున్నారు. ఓవైపు మిర్చి ఘాటు ఉందని.. ఫిబ్రవరి నుంచి ఎండ కూడా బాగా పెరిగిపోయి వేడి మరింత ఎక్కువగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. నీళ్ల కోసం కూడా చాలా దూరం వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. ఈ నాలుగు నెలలూ ఇక్కట్లు పడక తప్పదని.. ఇంటికెళ్లాక ఎటుతిరిగీ పనులు ఉండవని.. ఇక్కడ సంపాదించిందంతా అక్కడ ఖర్చయిపోతుందని వాపోతున్నారు. గత్యంతరం లేకనే అన్నిటికీ ఓర్చుకుంటున్నామని చెబుతున్నారు. జగన్ సీఎం అయ్యాక ఉపాధి కల్పన లేనేలేదని.. తమ ప్రాంతాల నుంచి మరింత మంది వలస బాట పట్టారని కన్నీరు పెట్టుకుంటున్నారు.



అంగళ్లులో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

అంగళ్లులో టెన్షన్.. టెన్షన్

» లోకేశ్ జన్మదిన వేడుకలకు పోలీసు ఆంక్షలు

» అంగళ్లులో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు

కురబలకోట, జనవరి 23: అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లులో మంగళవారం ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు, జయహో బీసీ కార్యక్రమాన్ని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున చేపట్టడానికి టీడీపీ శ్రేణులు సన్నద్ధమయ్యారు. అయితే అనుమతులు లేవని, వేడుకలను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్‌తో పాటు పలువురు టీడీపీ నేతలను పోలీసులు హెచ్చరించారు. టీడీపీ శ్రేణులు వెనక్కితగ్గకపోవడంతో పోలీసులు అంగళ్లులో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. డీఎస్పీ కేశప్ప, సీఐ శివాంజనేయులు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌ను ఈ కార్యక్రమానికి రానివ్వకుండా అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించగా ఆయన బైకుపై అంగళ్లు కూడలికి చేరుకుని శ్రేణుల మధ్య లోకేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

'డర్టీ' కార్గో పోర్టుగా కృష్ణపట్నం!



» బొగ్గు, బూడిద రవాణాకే పరిమితం?

» యాజమాన్యం మారడంతో మారిన దశ-దిశ

» పథకం ప్రకారం వ్యాపారులను తరిమేసే యత్నం

» పొమ్మనలేక పొగ.. రవాణా చార్జీలు రెండింతలు

» తనదే అయిన ఎన్నూరు పోర్టులో చార్జీలు తగ్గించి అటువైపు ఆకర్షించే యత్నంలో అదానీ

» వ్యాపారం తగ్గిందనే సాకుతో ఎత్తివేతకు సన్నాహాలు

» వృథా కానున్న భూములు.. రైతుల త్యాగం

» పోర్టు ఆధారిత పరిశ్రమల రాక అనుమానమే

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, తమ బతుకులు బాగుపడతాయని కృష్ణపట్నం పోర్టు కోసం నెల్లూరు జిల్లా రైతులు వేలాది ఎకరాలను త్యాగం చేశారు. ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేసి కట్టుబట్టలతో బయటకు వచ్చారు. అయితే, పోర్టు యాజమాన్యం చేస్తున్న నిర్వాకంతో ఈ త్యాగాలన్నీ వృథా కాబోతున్నాయి. పోర్టు యాజమాన్యం మారడంతో రాష్ట్ర ప్రజల ఆశలు మసిబారనున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు, పరిశ్రమలకు అవసరమైన పరికరాల దిగుమతులతో కళకళలాడిన పోర్టు ఇకపై కేవలం బొగ్గు, బూడిద, ఐరన్‌వోర్‌ల దిగుమతులు, ఎగుమతులకే పరిమితం కానుంది. దీనివల్ల రాష్ట్ర రైతులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలు దెబ్బతినడంతో పాటు వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయి వీధిన పడనున్నారు. కొత్త పరిశ్రమలు సైతం ఇకపై వచ్చే అవకాశాలు లేవు. పోర్టు అనుబంధ పరిశ్రమల కోసం సేకరించిన వేలాది ఎకరాల భూములు బీడుగా మిగిలిపోనున్నాయి.

నాడు ఉజ్వలం

సరిగ్గా ఐదేళ్ల కిందటి వరకు కృష్ణపట్నం పోర్టు రాష్ట్ర ప్రయోజనాల దిశగా దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక అవసరాలను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి కంటైనర్ కార్గోను విస్తృతం చేసింది. 2009 నుంచి కంటైనర్ కార్గో ఎగుమతులు, దిగుమతుల్లో దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ కారణంగా నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లో భారీగా పరిశ్రమలు స్థాపించారు. శ్రీసిటీ లాంటి సెజ్‌లు ప్రపంచ దేశాల పరిశ్రమలకు ఆతిథ్యమిచ్చాయి. రొయ్యల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకునే వీలు దొరకడంతో ఆక్వా పరిశ్రమ అభివృద్ధి చెందింది. వ్యవసాయ ఉత్పత్తులు మామిడి, మిర్చి, పొగాకు, బియ్యం వంటి వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌ను చేరుకోగలగడంతో ఆ రంగాల్లో ఉత్పత్తులు మరింత విస్తారంగా పెరిగాయి. రాయసీమలోని కొండలు, గుట్టల నుంచి గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం దగ్గరవడంతో బంగారు కొండలుగా మారిపోయాయి. కంటైనర్ కార్గో కార్యకలాపాలు ఊపందుకోవడంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. మిడిల్ ఈస్ట్ దేశాలు కొలంబియా, యూఎస్ఏ, షహనాయ్, సింగపూర్ దేశాలకు మన రాష్ట్రం నుంచి ఎగుమతులు పెరిగాయి. అలాగే చైనా, మలేషియా, యూఏఈ, దుబాయ్, థాయిలాండ్ దేశాల నుంచి మన రాష్ట్రానికి దిగుమతులు పెరిగాయి. ఇసుజి, సుహనాయ్, ఫోర్స్ మోటార్స్ లాంటి భారీ పరిశ్రమలు ఎన్నో రాష్ట్రానికి వచ్చాయి.

మూసివేసే ఎత్తుగడ

కృష్ణపట్నం కంటైనర్ కార్గో యాజమాన్యం మారడంతో మెల్లమెల్లగా పోర్టు పతనావస్థకు చేరుతూ వచ్చింది. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి.. పథకం ప్రకారం అదానీ సంస్థల వ్యాపార సంస్థల ప్రయోజనాలకు మాత్రమే పరిమితం చేశారనే వాదనలు బలంగా ఉన్నాయి. కంటైనర్‌హబ్‌ను మూసివేసి, దీన్ని డర్టీ కార్గో హబ్‌గా చేయాలనే లక్ష్యంతో ప్రస్తుత యాజమాన్యం పథకం ప్రకారం వ్యవహరించిందని కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. చెన్నై, కాకినాడ, విశాఖ పోర్టుల్లో బొగ్గు, ఐరన్‌వోర్ లాంటి డర్టీ ప్రాడక్ట్స్‌ను అనుమతించరు. దీంతో కృష్ణపట్నం పోర్టును పూర్తిగా డర్టీ కార్గో హబ్‌గా తయారు చేయడం తన సొంత వ్యాపారానికి లాభసాటిగా ఉంటుందని భావించిన యాజమాన్యం ఆ దిశగా అడుగులు వేసిందని అంటున్నారు. రెండేళ్ల కిందట బియ్యం ఎగుమతులను నిలిపివేశారు. దీంతో కాకినాడ పోర్టును ఆశ్రయించారు. దీనివల్ల రవాణా చార్జీలు పెరిగాయి. ఆ భారాన్ని రైతుల నెత్తిన వేశారు. ప్రతి పుట్టిపై రైతులు రూ.2 వేలు నష్టపోయారు. మరుసటి ఏడాది రైతులు ఉద్యమించడంతో అప్పటి కలెక్టర్ జోక్యం చేసుకుని బియ్యం ఎగుమతులకు అవకాశం కల్పించారు. దీంతో యాజమాన్యం రూటు మార్చింది. కంటైనర్ కార్గో రేట్లను భారీగా పెంచేసింది. ఉదాహరణకు వంద డాలర్లుగా ఉన్న చార్జీలను 230 డాలర్లకు పెంచింది. అదే సమయంలో ఇదే యాజమాన్యానికి చెందిన ఎన్నూరు(తమిళనాడు) పోర్టులో చార్జీలను నామమాత్రంగా పెంచింది. ఈ పోర్టుకు, ఆ పోర్టుకు మధ్య రవాణా చార్జీలు భారీ తేడా చూపించి ఎమగుమతి దిగుమతి దారులను అటు వైపు మళ్లించింది. 2014-19లో ఏటా రూ.9 లక్షల కోట్ల టర్నోవర్‌తో ఉన్న కంటైనర్ కార్గో ప్రస్తుతం రూ.5 లక్షల కోట్లకు పడిపోయిందని, 2014-2019లో సంవత్సరానికి కంటైనర్ కార్గో ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా 800 నుంచి 1000 కోట్ల వరకు వస్తే, ఇప్పుడు 500 కోట్లకు తగ్గిపోయిందని అంచనా. యాజమాన్యం ఈ ఆర్థిక కారణాలు చూపించి కంటైనర్ల వ్యాపారం తగ్గిందన్న సాగుతో ఇప్పుడు పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని కంటైనర్ కార్గోలో పనిచేస్తున్న కార్మిక వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గో హబ్‌గా తయారు చేసుకొని, తనకు చెందిన ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గో హబ్‌గా తయారు చేసుకోవాలనే ఎత్తుగడతో పావులు కదుపుతోందని అంటున్నారు. మార్చి 1వ తేదీ నుంచి కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గో హబ్‌గా చేయాలనే లక్ష్యంతో యార్డులను లీజుకు తీసుకున్న సంస్థలు స్వతహాగా ఖాళీ చేసుకొని వెళ్లేలా కంటైనర్ల సంఖ్యను తగ్గిస్తున్నారని అంటున్నారు. కంటైనర్ల సంఖ్య తగ్గించడంతో సరుకు రావడం ఆలస్యమవుతోంది. తద్వారా రవాణా చార్జీలు, డెమరేజస్, యార్డుల అద్దె వంటివి పెరిగేలా చేసి లీజుదారులను పొమ్మనకుండా పొగబెట్టే రీతిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కంటైనర్ కార్గో పూర్తిగా ఎత్తివేసిన పక్షంలో కృష్ణపట్నం స్థాపన వెనుక ఉన్న లక్ష్యం పూర్తిగా నీరుగారిపోయినట్లే అవుతుందని పోర్టుల రంగం నిపుణులు చెబుతున్నారు. కంటైనర్ కార్గో ఎత్తివేసిన పక్షంలో ప్రధానంగా నెల్లూరు, రాయలసీమ జిల్లా ప్రజలు వ్యవసాయ ఉత్పత్తుల పరంగా, పారిశ్రామికంగా నష్టపోవడం ఖాయమని తెలుస్తోంది. పోర్టు స్థాపన కోసం పరిసర గ్రామాలకు చెందిన రైతులు 2,600 ఎకరాల భూములు వదులుకున్నారు. ఏడు గ్రామాల ప్రజలు ఊళ్లు ఖాళీ చేశారు. వీరి త్యాగాలు వృథా కానున్నాయి. కంటైనర్ కార్గో ఉండని పక్షంలో పోర్టుకు అనుబంధంగా కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశాలు తక్కువ. దీంతో రైతుల నుంచి సేకరించిన 6వేల ఎకరాలు నిరుపయోగంగా మారిపోతాయి. ప్రస్తుతం కంటైనర్ కార్గో ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా 10వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరూ ఉపాధి కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.

కృష్ణా బోర్డును విశాఖకు తరలించలేం

- ప్రత్యామ్నాయంగా విజయవాడను పరిశీలించాలి
- కేంద్రానికి కృష్ణానదీ యాజమాన్య బోర్డు నివేదన
- జగన్ సర్కారుకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డును విశాఖపట్నానికి తరలించాలనే జగన్ ప్రభుత్వ ప్రతిపాదనపై కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) విముఖత వ్యక్తం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ కోసమే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014తో కృష్ణాబోర్డును కేంద్రం ఏర్పాటు చేసింది. గోదావరి బోర్డు హైదరాబాద్‌లో ఉంటే.. కృష్ణా బోర్డు ఏపీలో ఉండాలి. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన చేయడమే కాకుండా కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నాన్ని ప్రతిపాదించింది. కృష్ణాబోర్డును కూడా విశాఖకు తరలించాలని బోర్డుపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచింది. అయితే తాజాగా కేంద్ర జలశక్తి శాఖ వద్ద జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడతాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ విశాఖకు బోర్డును తరలించలేమని స్పష్టం చేశారు. సాగర్ నుంచి విశాఖ 550, శ్రీశైలం నుంచి 650 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున బోర్డు తరలింపు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని నివేదించారు. విజయవాడకు తరలించే ప్రతిపాదనలు పరిశీలించాలని కేంద్రాన్ని కోరారు. ఇక కృష్ణాబోర్డులో చైర్మన్, సభ్యులు మినహా మిగిలిన ఉద్యోగులంతా తెలుగు రాష్ట్రాల నుంచి చెరి సగం చొప్పున ఉంటారు. విశాఖకు తరలింపు ప్రతిపాదనతో వీరిలో సగానికి పైగా ఉద్యోగులు బోర్డును వీడే ఆలోచనలో ఉన్నారు. అదే జరిగితే భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయనే ఆందోళన కూడా బోర్డుకు ఉంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ కృష్ణాబోర్డు తాత్కాలిక నిర్వహణలో ఉండగా.. ఈ నెల 8న బోర్డు అధికారులే గేట్లను ఎత్తి ఏపీకి నీటిని వదిలారు. ఈ క్రమంలో బోర్డును విశాఖకు తరలిస్తే రవాణా ఖర్చులతో పాటు ఉద్యోగుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఉంటాయన్న అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ కృష్ణా బేసిన్‌లోనే ఉండటంతో ప్రాజెక్టులపై పర్యవేక్షణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించింది. ఆ కారణంగానే విజయవాడకు కార్యాలయ తరలింపుపై కేంద్రానికి నివేదించింది. ఈ పరిణామాలు జగన్ ప్రభుత్వానికి మింగుడు పడేలా లేవు.

సెమ్ కార్ప్ నుంచి నేరుగా విద్యుత్ సరఫరా

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సెమ్ కార్ప్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్న ఏపీఎస్పీడీసీఎల్‌కు ఇకపై నేరుగా ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ ప్రసారం జరగనుంది. ఈ విద్యుదుత్పత్తి సంస్థతో ఒప్పందం చేసుకున్నాక పవర్ గ్రిడ్ ద్వారా డిస్కమ్‌లకు విద్యుత్ వచ్చేది. దీనికోసం యూనిట్‌కు 72 పైసలు చొప్పున పవర్ గ్రిడ్‌కు డిస్కమ్‌లు చెల్లించేవి. ఇలా రోజుకు కోటి రూపాయలు చొప్పున ఏటా 365 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇటీవల.. సెమ్‌కార్ప్ నుంచి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేస్తూ ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లు వేసింది. దీంతో.. ఇప్పుడు నేరుగా సెమ్‌కార్ప్ నుంచి డిస్కమ్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ చర్య కారణంగా డిస్కమ్‌పై రూ.365 కోట్ల భారం తగ్గిందని వివరించారు. ఇది వినియోగదారులకూ ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొన్నారు.

బాబుకు 'స్టార్ క్యాంపెయినర్'

షర్మిలపై తొలిసారి జగన్ పరోక్ష విమర్శలు

- పవన్, పురందేశ్వరిపైనా అవే వ్యాఖ్యలు
- తనకు మీడియా లేదంటూ మళ్లీ అబద్ధాలు
- అనంత జిల్లాలో 'ఆసరా' నిధుల విడుదల సభ
- కర్ణాటక నుంచీ జనం తరలింపు
- ఏరులైపారిన కర్ణాటక మద్యం

అనంతపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు, సోదరి వైఎస్ షర్మిలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తొలిసారిగా స్పందించారు. ఆమె విపక్ష నేత చంద్రబాబుకు 'స్టార్ క్యాంపెయినర్‌'గా మారారని విమర్శించారు. తన తప్పులను ఎత్తిచూపుతున్న వారంతా చంద్రబాబుకు 'స్టార్ క్యాంపెయినర్లే' అన్నట్లుగా ఒక్కొక్కరిని ఉద్దేశించి వరుస వ్యాఖ్యలు చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం జగన్ నాలుగో విడత వైఎస్సార్ 'ఆసరా' కింద బటన్ నొక్కి, రూ.6394.83 కోట్ల నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎప్పట్లాగానే విపక్షాల మీద, గిట్టని మీడియా మీద జగన్ విమర్శలు గుప్పించారు. ఈసారి కొత్తగా చెల్లెలు షర్మిలపైనా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్రాన్ని విభజించిన పార్టీలోకి ప్రవేశించి చంద్రబాబుకు మరో స్టార్ క్యాంపెయినర్‌గా మారారు' అంటూ షర్మిల పేరెత్తకుండానే విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో నివాసముంటున్న స్టార్ క్యాంపెయినర్లు చంద్రబాబును జాకీలు పెట్టి లేపుతున్నారంటూ జనసేన అధిపతి పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిని విమర్శించారు. 'చంద్రబాబును భుజాన ఎత్తుకుని మోసే ముఠా' అని అన్నారు. 'పసుపు కమలాలు' అంటూ బీజేపీ నేతలను ఎద్దేవా చేశారు. ఇక ఎప్పట్లాగానే... తనకు మీడియా లేదంటూ జనం 'సాక్షి'గా అబద్ధాలు చెప్పారు. తన తరఫున మాట్లాడే 'మేధావులు' కూడా లేరని వాపోయారు. తమ పాలనలో రాష్ట్రవ్యాప్తం గా 79 లక్షల మంది మహిళలకు వైఎస్ఆర్ ఆసరా కింద రూ.25,5 71 కోట్ల రుణాలను తిరిగి చెల్లించామన్నారు.



సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న జనం

ఏరులైపారిన కర్ణాటక మద్యం

జగన్ బహిరంగ సభలో కర్ణాటక మద్యం ఏరులైపారింది. కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున టెట్రా ప్యాకెట్లను తెప్పించి సభా ప్రాంగణం సమీపంలోనే పంపిణీ చేశారు. కార్యకర్తలు అక్కడే మద్యాన్ని సేవించి చిందులేశారు. కొందరు కార్యకర్తలు మద్యం మత్తులో ఎక్కడికక్కడ పడిపోయారు. సీఎం సభకు కర్ణాటక నుంచి జనాన్ని తరలించడం గమనార్హం. ఇక.. జిల్లాలో డ్వాక్రా మహిళలను బలవంతంగా సభకు తీసుకొచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు అనధికార సెలవు ప్రకటించి, స్కూలు బస్సుల్లో జనాన్ని తరలించారు. బలవంతంగా జనాన్ని తరలించగలిగారుకానీ... వారిని సభా ప్రాంగణంలో చివరిదాకా కూర్చోబెట్టలేకపోయారు. జగన్ ప్రసంగం ప్రారంభం కాగానే జనం బయటికి వెళ్లిపోయారు. పోలీసులు, వైసీపీ నాయకులు ఆపినా... ఆగలేదు. మొత్తంగా సీఎం సభ చప్పగా సాగింది. 45 నిమిషాల ప్రసంగంలో విపక్షాలు, మీడియాపై విమర్శలకే అధిక సమయం కేటాయించారు.



సీఎం జగన్ సభకు వచ్చి.. కర్ణాటక మద్యం తాగుతున్న వైసీపీ కార్యకర్తలు

దివ్యాంగులను అడ్డుకున్న పోలీసులు...

ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం జగన్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకోనేందుకు దివ్యాంగులు గంటలకొద్దీ ఎదురుచూశారు. సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో దివ్యాంగుల కుటుంబీకులు ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపైకి వెళ్లారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకుని కాన్వాయ్ వెళ్లిన తరువాత వదిలిపెట్టారు.

చైర్‌పర్సన్ పదవి ఇస్తానని మోసం

మంత్రి రోజా సోదరుడు రూ.40లక్షలు తీసుకున్నాడు

- జగనన్నా.. దళిత మహిళకు నీవే న్యాయం చేయాలి
- పుత్తూరు 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి ఆవేదన



మంత్రి రోజా పీఏకి డబ్బులిస్తున్న వీడియో చూపుతున్న భువనేశ్వరి

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 23: మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని మంత్రి రోజా అన్న కుమారస్వామి రూ.40లక్షలు తీసుకుని మోసం చేశారని తిరుపతి జిల్లా పుత్తూరు మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించారు. దళిత మహిళ అయిన తనకు జగనన్నే న్యాయం చేయాలని కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. '17వ వార్డు కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నన్ను మున్సిపల్ చైర్‌పర్సన్ చేస్తానని రోజా ప్రకటించారు. ఈ విషయమై పుత్తూరు వైసీపీ ఇన్‌చార్జి, తన అన్న కుమారస్వామిని కలవాలని రోజా చెప్పడంతో కలిశాను. చైర్‌పర్సన్ పదవికి రూ.70లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.40లక్షలు 3 కంతుల్లో ఇచ్చా. ఆ తర్వాత వేరే వ్యక్తికి చైర్మన్ పదవి ఇచ్చారు. అదేమని అడిగితే ఐదేళ్లకుగాను చెరో రెండున్నరేళ్ల పదవిలో ఉంటారని చెప్పడంతో అయిష్టంగానే ఒప్పుకున్నా. రెండున్నరేళ్ల తర్వాత కూడా పదవి ఇవ్వలేదు. కుమారస్వామిని కలిసి తమ డబ్బయినా వెనక్కిమ్మని అడగ్గా.. రూ.40 లక్షలు ఇవ్వలేనని, రూ.29లక్షలే ఇస్తాననీ.. అది కూడా రెండు నెలల తర్వాత ఇస్తానని చెప్పారు. ఇప్పుడేమో రేపు, ఎల్లుండి అని తిప్పించుకుంటున్నారు. ఒత్తిడి పెంచితే బెదిరిస్తున్నారు' అని వాపోయారు. ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

జగనన్న ముద్దు.. రోజా వద్దు

- ఆమె మీద తీవ్రమైన అసంతృప్తి ఉంది
- సొంతపార్టీ వారిపై కక్ష సాధిస్తున్నారు
- వేరేవాళ్లకు టికెట్ ఇస్తే మంచి మెజార్టీతో గెలిపిస్తాం
- ఇద్దరు వైసీపీ జడ్పీటీసీల స్పష్టీకరణ



మురళీధర్‌రెడ్డి

చిత్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గంలో మంత్రి రోజా మీద తీవ్ర అసంతృప్తి ఉంది. అందరూ జగనన్న ముద్దు.. రోజా వద్దు అంటున్నారు. వేరేవాళ్లకు టికెట్ ఇస్తే మంచి మెజార్టీతో గెలిపిస్తాం' అని నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, నిండ్ర జడ్పీటీసీలు మురళీధర్‌రెడ్డి, మల్లీశ్వరి చెప్పారు. చిత్తూరులో మంగళవారం జరిగిన జడ్పీ సమావేశానికి హాజరైన వీరు.. అనంతరం మీడియాతో మాట్లాడారు. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'జడ్పీ నిధుల నుంచి ఒక్కో జడ్పీటీసీకి రూ.20 లక్షలు కేటాయించారు. నిధుల్ని ఖర్చు చేసేందుకు ప్రొసీడింగ్స్‌పై సంతకాలు పెట్టకుండా ఏఈ, డీఈలను మంత్రి ఇబ్బంది పెడుతున్నారు. మేమంతా జగన్, రోజా గెలుపు కోసం కష్టపడ్డాం. ఆమె మాపై కక్ష సాధిస్తున్నారు. ఐదుగురు జడ్పీటీసీలకు మండల పరిషత్‌ల్లో చాంబర్లు కేటాయించలేదు' అని చెప్పారు. నిండ్ర దళిత జడ్పీటీసీ మల్లీశ్వరి మాట్లాడుతూ 'దయచేసి రోజా మేడంకు సీటు ఇవ్వొద్దని జగనన్నను కోరుతున్నా. సొంత పార్టీ నాయకులకే పనులు కాకుండా ఆమె ఇబ్బంది పెడుతున్నారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, చిత్తూరు జిల్లాలో వ్యతిరేకత ఉందంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహా ముగ్గురు ఎమ్మెల్యేలకు వైసీపీ టికెట్ ఇవ్వలేదు. తాజాగా మంత్రి రోజా మీద ఈ స్థాయిలో వ్యతిరేకత రావడంతో ఆమెకు టికెట్ ఇస్తారా? అని సొంత పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.



బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జస్టిస్ చీమలపాటి రవి దంపతులు

బ్రహ్మలింగేశ్వరస్వామి సేవలో జస్టిస్ రవి

నర్సీపట్నం, జనవరి 23: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి దంపతులు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం బలిఘట్టంలో గల బ్రహ్మలింగేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అంతకుముందు మునిసిపాలిటీ పరిధిలోని కృష్ణాపురంలో ఉన్న ఆంజనేయస్వామి గుడికి వెళ్లి పూజలు చేశారు.

మృతదేహానికి అంబులెన్స్ కూడా ఇవ్వరా?

- అడవి బిడ్డల మరణ ఘోషపై సమీక్ష చేయండి
- ఎక్స్ వేదికగా సీఎస్‌కు చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా చిట్టంపాడులో ఏడాదిన్నర వయస్సున్న బాలుడు మరణంపై టీడీపీ అధినేత చంద్రబాబు చలించిపోయారు. మంగళవారం 'ఎక్స్' వేదికగా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. 'అదే వ్యథ.. అదే దారుణం.. విజయనగరం జిల్లా శృంగవరపు కోట మండలం చిట్టంపాడులో గంగమ్మ, ఆమె 6 నెలల కొడుకు మరణించి, 15రోజులు కాక ముందే అదే గ్రామంలో ఏడాదిన్నర వయస్సున్న మరో చిన్నారి ప్రవీణ్ చనిపోయాడన్న వార్త మనసును కలిచివేసింది. ఆసుపత్రికి తీసుకెళ్లడానికి 7 కిలో మీటర్ల దూరంమోసుకెళ్లారు. బిడ్డ చనిపోయాక మృతదేహాన్ని తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఇవ్వకపోతే, రూ.3వేలు అప్పు చేసి, ప్రైవేట్ వాహనంలో రైల్వేస్టేషన్‌కు తెచ్చారు. పేదలు చనిపోతే వారి మృతదేహాలు తరలించడానికి అంబులెన్స్ కూడా ఇవ్వరా? ఏమిటీ అమానవీయ పరిస్థితి?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ పెత్తందారు ముఖ్యమంత్రికి ఎలాగూ పేదల గోడు పట్టదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరుతున్నా.. కనీసం మీరైనా దయచేసి ఆ అడవి బిడ్డల మరణ ఘోషపై ఒక్కసారి సమీక్ష చేయండి. తగుచర్యలు తీసుకోండి' అని సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

జగన్ బాధితులే టీడీపీ స్టార్ క్యాంపెయినర్లు

- మాకు వాళ్లు చాలు: మాజీ మంత్రి ఆనందబాబు

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అరాచకానికి, అఘాయిత్యాలకు బలైన బాధితులే వచ్చే ఎన్నికల్లో టీడీపీ స్టార్ క్యాంపెయినర్లని ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. 'టీడీపీ తరఫున స్టార్ క్యాంపెయినర్లని సీఎం జగన్ రెడ్డి ఎవరెవరి పేర్లో చదువుతున్నారు. వారెవరూ కాదు. వైసీపీ దుర్మార్గ పాలనలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ సుధాకర్, రైలు పట్టాలపై తాళ్లతో కట్టేసుకొని ఆత్మహత్య చేసుకొన్న అబ్దుల్ సలాం కుటుంబం, పోలీస్ స్టేషన్లో శిరో ముండనానికి గురైన వరప్రసాద్, వైసీపీ ఎమ్మెల్సీ చేతిలో హత్యకు గురై ఇంటికి డోర్ డెలివరీ అయిన సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ వర్కర్లు, నిరుద్యోగులు, వంచనకు గురైన రైతులు, ఉద్యోగాలు రాని నిరుద్యోగులు, దగాపడ్డ దళితులు, బడుగు బలహీన వర్గాలవారు.. వీళ్లే మా స్టార్ క్యాంపెయినర్లు. వైసీపీ అరాచక పాలనకు సమాధి కట్టడానికి మాకు వీళ్లు చాలు' అని ఆయన అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చేది ప్రజలే: సోమిరెడ్డి

అమరావతి, జనవరి23 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికలకు ప్రజలే తమకు స్టార్ క్యాంపెయినర్లని సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'ఈ రోజు జగన్ చెప్పింది 100శాతం నిజం. 2024 ఎన్నికలకు జనమే స్టార్ క్యాంపెయినర్లు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే ఎన్నికల యుద్ధంలో సామాన్య ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు. జగన్‌ను నమ్మి మోసపోయిన ప్రతి నిరుద్యోగీ ఒక స్టార్ క్యాంపెయినరే. దగా పడ్డ ప్రతి అన్నదాతా ఒక స్టార్ క్యాంపెయినరే. ప్రభుత్వ బాదుడుతో బలైన ప్రతి పేదవాడూ ఒక స్టార్ క్యాంపెయినరే. అణచివేతకు గురైన ప్రతి బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సోదరుడు కూడా వైసీపీని కూల్చే స్టార్ క్యాంపెయినర్లే! అని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు.

25 నుంచి టీడీపీ ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్

ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు క్లస్టర్ స్థాయిలో ఈనెల 25నుంచి 31 వరకు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు క్లస్టర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. ప్రతి క్లస్టర్‌లో ఈ ట్రైనింగ్‌ను విధిగా నిర్వహించి, ప్రతి బూత్ నుంచి ఒక మహిళ తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆయుష్మాన్ కార్డులో ప్రధాని ఫొటో ఎక్కడ ?

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర సహాయ మంత్రి సీరియస్



ప్రధాని మోదీ ఫొటో లేని ఆయుష్మాన్ కార్డు, కార్డులు పంపిణీ చేస్తున్న భారతీ ప్రవీణ్ పవార్

గుంటూరు సిటీ, జనవరి 23: 'పథకం కేంద్రానిది. నిధులు కేంద్రానివి. అటువంటప్పుడు ఆయుష్మాన్ కార్డులపై ప్రధాని ఫొటో ముద్రించకుండా.. మీ ఫోటోలు..మీ ప్రచారం ఏమిటి?' అంటూ... కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ రాష్ట్ర ప్రభుత్వంపై సీరియస్ అయ్యారు. గుంటూరు నగరం అమరావతి రోడ్డులో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ప్రధాని నూతనంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు అందజేయాలని అధికారులు కోరారు. కార్డులను పరిశీలించిన మంత్రి వాటిపై ముఖ్యమంత్రి జగన్, ఆయన తండ్రి రాజశేఖర్ రెడ్డి ఫొటోలు మాత్రమే ఉండటాన్ని గమనించి అధికారులను నిలదీశారు.

ఐపీఎస్ కృపానంద్ త్రిపాఠికి హైకోర్టులో ఊరట

- హోంగార్డుల నియామకాల్లో అక్రమాల కేసులో ముందస్తు బెయిల్

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి కృపానంద్ త్రిపాఠి ఉజేలాకు హైకోర్టులో ఊరట లభించింది. హోంగార్డుల నియామకాలలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ గుంటూరు జిల్లా, మంగళగిరి పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం తీర్పు ఇచ్చారు. హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామంటూ తన నుంచి రూ.4లక్షలు తీసుకొని మోసం చేశారని పేర్కొంటూ వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన తలారి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి పోలీసులు గత ఏడాది జూలై 15న నరేశ్, అరవింద్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ కేసుతో తనకు సంబంధం లేకపోయినా దర్యాప్తు పేరుతో పోలీసులు తన నివాసానికి వస్తున్నారని ఐపీఎస్ అధికారి కృపానంద్ త్రిపాఠి ఉజేలా దాఖలు చేసిన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి మంగళవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

నేడు రూ.300 దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను టీటీడీ బుధవారం విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు 'టీటీదేవస్థానమ్స్ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో ఈ కోటాను విడుదల చేయనున్నారు.

23 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష?

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 23: విశాఖపట్నం కేంద్ర కారాగారంలోని 23 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష లభించనున్నట్టు సమాచారం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న వారిని విడుదల చేయనున్నట్టు జైలు వర్గాల ద్వారా తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీరి విడుదలకు సిద్ధమవుతున్నా, ఇంతవరకు ఉత్తర్వులు విడుదల కాలేదని చెబుతున్నారు.

గ్రూప్-1 దరఖాస్తులకు గడువు పొడిగింపు

గ్రూప్-1 పోస్టుల భర్తీకి జారీచేసిన నోటిఫికేషన్‌కు దరఖాస్తుల గడువును ఏపీపీఎస్సీ పొడిగించింది. ఈ నెల 21తో గడువు ముగిసినా, పొడిగించాలని పలువురు అభ్యర్థులు కోరడంతో ఈ నెల 28 వరకు పొడిగించినట్లు తెలిపింది.

జూనియర్ కాలేజీలకు నైట్ వాచ్‌మెన్లు

రాష్ట్రంలోని 459 జూనియర్ కాలేజీల్లో నైట్ వాచ్‌మెన్ల నియామకానికి అనుమతిస్తూ ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. వారికి నెలకు రూ.6 వేలు పారితోషికం ఇవ్వనున్నట్టు పేర్కొంది.

బార్ వద్దు బాబోయ్..!

- వ్యాపారం తక్కువ.. వేధింపులు ఎక్కువ
- లైసెన్సులకు ముందుకురాని వ్యాపారులు
- గతంలో బార్లకు విపరీతమైన డిమాండ్
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక పాలసీ మార్పులు
- అసలు వద్దనే పరిస్థితి ఇదే మొదటిసారి
- రాష్ట్రంలో 11 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ
- ఇప్పటికే నాలుగు సార్లు రీ నోటిఫికేషన్

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారం అంటే ఒకప్పుడు సిండికేట్లకు కామధేనువులా కనిపించేది. ఎక్కడ బార్ లైసెన్సు దొరుకుతుందా అని వ్యాపారులు వేయి కళ్లతో ఎదురుచూసేవారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. బార్ తీసుకోండి అంటూ ఎక్సైజ్ శాఖ పదేపదే నోటిఫికేషన్లు జారీచేస్తున్నా వ్యాపారులు ముందుకురాని పరిస్థితి నెలకొంది. ఏడాదిన్నర కాలంలో నాలుగుసార్లు రీ నోటిఫికేషన్లు జారీచేసినా ఇప్పటికీ 11 బార్లు మిగిలిపోయాయంటే వ్యాపారులు ఏ స్థాయిలో భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. అటు వ్యాపారం లాభసాటిగా లేకపోగా, ఇటు రాజకీయ వేధింపులు పెరిగిపోవడంతో బార్ వ్యాపారం అంటే నష్టం అనే అంచనాకు వచ్చారు. మిగిలిపోయిన 11 బార్ల లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. భారీగా వ్యాపారం జరిగే విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో బార్లు కూడా మిగిలిపోయాయి.

పాలసీ మార్చడంతోనే..

రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. గతంలో ఒక్కటి కూడా ఖాళీ లేకుండా వ్యాపారం జరిగేది. సుదీర్ఘకాలం నుంచి ఈ బార్ వ్యాపారం శాశ్వత ప్రాతిపదికన సాగుతోంది. అంటే లైసెన్సులు రెన్యువల్ చేయడం తప్ప షాపుల తరహాలో కొత్తగా జారీచేయడం ఉండేది కాదు. ఎందుకంటే బార్‌ల కోసం ఎక్కువ పెట్టుబడి పెట్టాలి. బార్‌తో పాటు రెస్టారెంట్ ఉండాలి. అందులో సదుపాయాలు, సిబ్బంది అన్నీ లెక్కలు వేసుకుని వ్యాపారం చేసేవాళ్లు. ప్రతి రెండుమూడేళ్లకు లైసెన్సు పొందితేనే అనే నిబంధన పెడితే బార్ వ్యాపారానికి ఎవరూ ముందుకురారని భావించి.. గత ప్రభుత్వాలు ఈ పంథాను అవలంబించాయి. కానీ మొత్తం వ్యాపారాన్ని తమ గుప్పిట్లోకి తీసుకోవాలనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం మొత్తం పాలసీని కొత్తగా ప్రకటించింది. పాత పాలసీ ముగియగానే అందరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. అలా 2022 జూలైలో కొత్త పాలసీ అమల్లోకి వచ్చింది. కానీ 16 బార్లు మిగిలిపోయాయి. వాటికి ఇప్పటివరకూ నాలుగుసార్లు రీ నోటిఫికేషన్ జారీ చేశారు. వాటిలో కొన్నింటిని వ్యాపారులు తీసుకుంటే ఏడాది కాలం తర్వాత ఈ బార్ మాకొద్దంటూ కొందరు రెన్యువల్ చేసుకోకపోవడంతో మళ్లీ కొత్తగా మిగిలిపోవడం ప్రారంభమైంది. అలా ప్రస్తుతం 11 బార్లు ఖాళీగా ఉండటంతో ఎక్సైజ్ శాఖ పదే పదే నోటిఫికేషన్లు జారీచేస్తూ వస్తోంది. కానీ వ్యాపారులు ముందుకురావడం లేదు.

29 వరకు దరఖాస్తులు.. 31న వేలం

విశాఖపట్నంలో ఒకటి, విజయవాడను ఆనుకుని ఉండే తాడిగడప మున్సిపాలిటీలో ఒకటి, పెడనలో ఒకటి, తెనాలిలో నాలుగు, పొన్నూరులో రెండు, చీరాలలో ఒకటి, సూళ్లూరుపేటలో ఒక బార్‌కు తాజా నోటిఫికేషన్ జారీఅయ్యింది. ఈనెల 29 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, 30న దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది. 31న ఈ-వేలం నిర్వహించి కేటాయించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఉన్న బార్ లైసెన్సు ఫీజులో కనీసం 90 శాతం పాడితేనే లైసెన్సు దక్కుతుందని స్పష్టం చేసింది.

అంతంతమాత్రంగానే వ్యాపారం

కొత్త పాలసీ తెచ్చి లైసెన్సు ఫీజుల రూపంలో భారీగా ఆదాయాన్ని పిండుకున్న వైసీపీ ప్రభుత్వం వ్యాపారంపై అనేక వేధింపులు మొదలుపెట్టింది. కొత్త పాలసీ కావడంతో తొలుత బార్ల కోసం పోటీపడిన వ్యాపారులు రెండు మూడు రెట్లు అదనంగా వేలం పాడి లైసెన్సులు దక్కించుకున్నారు. కానీ మంచి బ్రాండ్లు అందుబాటులో లేకపోవడం, మద్యం షాపుల పనివేళల మార్పులతో బార్ల వ్యాపారం దెబ్బతింది. అలాగే మద్యం వ్యాపారాన్ని తగ్గిస్తామని మొదట్లో మద్యం షాపుల పనివేళలు కుదించిన ప్రభుత్వం క్రమంగా మళ్లీ పెంచేసింది. తొలుత రాత్రి 8 గంటల వరకే వ్యాపారం కాగా, ఆదాయం కోసం రెండు దఫాలుగా రాత్రి 10 గంటల వరకూ తీసుకొచ్చింది. షాపుల్లోనే రాత్రి వరకు మద్యం దొరుకుతున్నందున బార్లకు వచ్చేవారు తగ్గిపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు ముడుపులు సమర్పించుకోవడం తప్పడంలేదు. అటు వ్యాపారం లేక, ఇటు వేధింపులు పెరిగి బారే వద్దనే పరిస్థితి కనిపిస్తోంది. బార్‌లు వేరే ప్రాంతాలకు తరలించుకుంటాం అని అనేక జిల్లాల్లో వ్యాపారులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

తదుపరి విచారణలోగా.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి

- ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- లేనిపక్షంలో కోర్టుకు హాజరుకావాలని స్పష్టీకరణ
- కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంపై అసహనం
- విచారణ 9కి వాయిదా

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రహదారులు భవనాలశాఖ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. బిల్లులు చెల్లించాలని గతేడాది మే 11న ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇంకా అమలుచేయకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయబోతున్నారనే సాకుతో బిల్లులు చెల్లించకుంటే సహించేది లేదని స్పష్టం చేసింది. నోటిఫికేషన్‌కు ముందే బిల్లులు చెల్లించాలని తేల్చిచెప్పింది. తదుపరి విచారణలోగా బి ల్లులు చెల్లించాలని, విఫలమైతే వ్యక్తిగతంగా తమ ముందు హాజరుకావాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రహదారులు, భవన నిర్మాణాలశాఖకు చెందిన పనులు చేపట్టిన తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు కాంట్రాక్టర్లు గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. ఆ వ్యాజ్యాలను విచారించిన హైకోర్టు మూడు నెలల్లో పిటిషనర్లకు బిల్లులు చెల్లించాలని గతేడాది మేలో ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు కోర్టుధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వీవీ లక్ష్మీనారాయణ, కొప్పినీడి రాంబాబు, కల్వ సురేశ్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. కోర్టు ఉత్తర్వులను అధికారులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని, బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, త్వరలో ఎన్నికల కోడ్ వస్తోందని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపునకు నాలుగువారాల సమయం కోరారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే పిటిషనర్లకు బిల్లులు చెల్లించాలని తేల్చిచెప్పారు. తదుపరి విచారణలోగా పిటిషనర్లకు బిల్లులు చెల్లించాలని, విఫలమైతే కోర్టు ముందు హాజరుకావాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించారు.

సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం: ధూళిపాళ్ల

జగన్ సర్కారుకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిపోయిందని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. జగన్‌రెడ్డి నిన్నటి వరకు గొప్పలు చెప్పి, ఇప్పుడు నానా తిప్పలు పడుతున్నారని వైసీపీలో రాజకీయ బదిలీలను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. 'వై నాట్ 175' నుంచి 'వీ ఆర్ గోయింగ్ టూ అవుట్' అనే పరిస్థితికి వైసీపీ వచ్చేసిందని మంగళవారం 'ఎక్స్'వేదికగా విమర్శించారు.

కులగణన ఎన్నికల లబ్ధికే: కాల్వ

జగన్‌రెడ్డి చేపట్టిన కులగణన ఎన్నికల్లో లబ్ధి, రాజకీయ కుట్రలో భాగమేనని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'జగన్‌రెడ్డిని నమ్మి, రాజకీయ కుట్రలో పావులుగా మారొద్దని వెనుకబడిన వర్గాల వారిని కోరుతున్నాం. బీసీలకు మంచి చేయాలని, ఉద్ధరించాలని జగన్‌కు ఉంటే, ఇన్నేళ్లుగా కుల గణనపై కేంద్రాన్ని ఎందుకు ఒత్తిడి చేయలేదు? 76 మంది బీసీ నేతల్ని దారుణంగా చంపించి, వేల మందిని తప్పుడు కేసులతో జైళ్లకు పంపిన జగన్‌రెడ్డి బీసీలకు న్యాయం చేస్తాడా?' అని ప్రశ్నించారు.

ఆసరా కాదు.. మహిళలకు టోకరా: పరిటాల సునీత

మహిళల మాంగల్యాలను తెంచిన జగన్‌రెడ్డి.. ఇచ్చేది గోరంత, దోచేది కొండంత అని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డిది ఆసరా కాదు.. టోకరా అని విమర్శించారు. మంగళవారం ఆమె ఓ ప్రకటన చేస్తూ, 'రాష్ట్రంలో కోటి14లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే, 79లక్షల మందికే లబ్ధి కుదించారు. 35లక్షల మంది డ్వాక్రా మహిళలకు మొండిచేయి చూపారు. జగన్ పాలనలో ఆడబిడ్డలకు ఎంత అన్యాయం జరిగిందో జాతీయ నేర నివేదికలే స్పష్టం చేస్తున్నాయి' అని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి మూడో స్థానమే: చింతా

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 130 అసెంబ్లీ, 20 ఎంపీ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని, అధికార వైసీపీ మూడో స్థానానికి పరిమితమవుతుందని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ జోస్యం చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ షర్మిలపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని.. అంతే స్థాయిలో విమర్శలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వైసీపీని హెచ్చరించారు. విశాఖపట్నం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ సొంత చెల్లితో ఉన్న గొడవలను సర్దుబాటు చేసుకోలేకపోయారన్నారు. షర్మిల శాస్త్రి అంటూ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటాన్ని ఆయన తప్పుబట్టారు. బీసీలు రాజ్యాధికారం కావాలని కోరుకుంటున్నారని, చిరంజీవి మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలకం కావాలని సూచించారు.

అమెరికాలో ఉద్యోగాల ఊచకోత



న్యూయార్క్, జనవరి 23: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగ మార్కెట్‌ను అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం దారుణంగా దెబ్బతీస్తున్నాయి! ఈ రెండింటి దెబ్బకూ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి!! గణాంకాల్లో చెప్పాలంటే.. 2022తో పోలిస్తే 2023లో అమెరికాలో ఉద్యోగాల కోత 98% పెరిగింది. ద్రవ్యోల్బణం, ఫెడరల్ వడ్డీ రేట్ల పెంపు పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు లేని నేపథ్యంలో.. ఈ ఏడాది కూడా ఉద్యోగాల ఊచకోత కొనసాగే ప్రమాదం ఉందని అమెరికాకు చెందిన ప్రముఖ స్టాఫింగ్ సంస్థ చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ ఒక నివేదికలో హెచ్చరించింది. దానిప్రకారం.. 2022లో అమెరికా కంపెనీలు 3,63,832మంది ఉద్యోగులను తొలగించగా.. 2023లో ఆ సంఖ్య ఏకంగా 7,21,677కు చేరింది. గతేడాది ఉద్యోగాలు కోల్పోయినవారిలో 1,68,032 మంది అమెజాన్, మెటా, గూగుల్ వంటి దిగ్గజ సంస్థల ఉద్యోగులే కావడం గమనార్హం. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 73శాతం అధికం కావడం ఆందోళనకరం. 2023లో అమెజాన్ 16వేల మందికిపైగా.. అల్ఫాబెట్(గూగుల్ మాతృసంస్థ) 12వేల మందిని.. మైక్రోసాఫ్ట్ 11వేల మందికి పైగా.. మెటా 10వేలమందిని తొలగించాయి. అలాగే అమెరికా రిటైల్ రంగంలో గతేడాది 78,840 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే.. ఇది 274శాతం అధికం. ఆరోగ్య సంరక్షణ రంగంలో 2023లో 58,560 మంది కొలువులు కోల్పోయారు. 2022తో పోలిస్తే హెల్త్‌కేర్ రంగంలో కోతలు 91శాతం అధికం. ఈ ఏడాది జనవరి 1 నుంచి 19 నడుమ అమెరికాలో టెక్ కంపెనీలు 2,215 మందిని తొలగించినట్టు సమాచారం.

ఇక్కడికొస్తే మరీ ఘోరం..

అమెరికాలో కొలువు కోల్పోయి, భారత్‌కు తిరిగి వస్తున్నవారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. దీపక్ అనే వ్యక్తి ఇక్కడే ఆరేళ్లపాటు అమెజాన్‌లో ఉద్యోగం చేసి 2022 జూన్‌లో అంతర్గత బదిలీల్లో అమెరికాకు వెళ్లాడు. కంపెనీ అతడికి ఏడాదికి 1.6 లక్షల డాలర్ల వార్షిక వేతనం (మన కరెన్సీల్లో దాదాపు రూ.1.3 కోట్లు), షేర్లు ఇచ్చేది. కానీ, 2023 జనవరిలో అమెజాన్ చేపట్టిన భారీ కోతలో 18 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. వారిలో దీపక్ కూడా ఒకరు. చేసేది లేక భారత్‌కు తిరిగి వచ్చేసిన అతడు.. రెండు నెలలపాటు ఖాళీగా ఉండాల్సి వచ్చింది. పాత ఉద్యోగంలో కోటికి పైగా వేతనం ఉండడంతో పలు కంపెనీలు దీపక్‌ను ఇంటర్వ్యూలకు కూడా పిలిచేవి కావు. ఎట్టకేలకు రూ.30 లక్షల వార్షిక వేతనంతో ఓ కంపెనీలో చేరాడు. కానీ, ఇక్కడే ఉన్న తన స్నేహితుల్లో చాలామంది రూ.40 లక్షలకు పైగా వార్షిక వేతనానికి పనిచేస్తున్నారని వాపోయాడు. దీపక్‌లాంటి చాలామందిపై అమెరికా మాంద్యం దెబ్బ పడింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. 2022 నవంబరు, 2023 జనవరి నడుమ అమెరికాలో 2 లక్షల మంది ఉద్యోగులపై వేటు పడింది. అందులో 40 శాతం.. అంటే 80 వేల మంది భారతీయ ఐటీ ఉద్యోగులే. హెచ్1బీ, ఎల్1 వీసాలపై పనిచేసే వారంతా ఒక్క దెబ్బకు నిరుద్యోగులుగా మారారు. వారంతా ఇక్కడికి వద్దామంటే భారత్‌లో పరిస్థితీ అంత బాగోలేదు. భారతదేశంలోని టెక్ కంపెనీలు 2022లో 30 వేల మంది, 2023లో 28 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. 2021లో మనదేశంలోని టెక్ కంపెనీలు తొలగించిన ఉద్యోగుల సంఖ్య కేవలం 4,080 కావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లోనే వారు తాము గతంలో తీసుకున్న ప్యాకేజీల కన్నా 40-50 శాతం తక్కువకే పని చేయడానికి సిద్ధమవుతున్నారు.

లోకం తీరు



‘సీట్ లీవింగ్ బాండ్’ను వదిలేయండి

» రాష్ట్రాలకు ఎన్ఎంసీ సూచన

న్యూఢిల్లీ, జనవరి 23: పీజీ సీట్లను వదలేసుకుంటున్న మెడికోల వ్యవహారంపై పునరాలోచించాలని, ‘సీట్ లీవింగ్ బాండ్’ పాలసీని వదిలి వేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) సూచించింది. అదేవిధంగా వైద్య విద్యా కళాశాలల్లో విద్యార్థులకు స్నేహ, సహాయపూరిత వాతావరణాన్ని కల్పించాలని కోరింది. సీట్ లివింగ్ బాండ్‌తో విద్యార్థులు.. కోర్సును మధ్యలో వదిలేయలేక, ఒత్తిడితో కొనసాగలేక మానసికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. రెండుమూడేళ్లుగా వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ మేరకు ఎన్ఎంసీకి చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇటీవల పలు సూచనలతో కూడిన లేఖను అన్ని రాష్ట్రాలకు పంపించింది. “విద్యార్థులకు అమలు చేస్తున్న ‘సీట్ లీవింగ్ బాండ్’ పాలసీని వదిలేయండి. దీని స్థానంలో మీమీ రాష్ట్రాల్లోని వైద్య విద్యా కళాశాలల్లో సదరు విద్యార్థులను ఏడాది పాటు చేర్చుకోకుండా డీబార్ చేయండి” అని సూచించింది.

ఏప్రిల్ 16న లోక్‌సభ ఎన్నికలు?

న్యూఢిల్లీ, జనవరి 23: లోక్‌సభ ఎన్నికలపై ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) జారీ చేసిన ఓ సర్క్యులర్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16న జరగొచ్చని, ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఆయన ఓ సర్క్యులర్ ద్వారా అధికారులను ఆదేశించారు. దీంతో, సార్వత్రిక ఎన్నికలు ఆరోజే జరుగుతాయని తీవ్ర చర్చ జరిగింది. దీనిపై ఢిల్లీ సీఈవో ట్విటర్‌లో స్పందించారు. ఎన్నికల సంఘం ప్రణాళిక ప్రకారం పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యేందుకు ఈ తేదీని రిఫరెన్స్‌గా మాత్రమే పేర్కొన్నట్టు ఆయన వివరించారు.

దేశానికి స్వాతంత్య్రం గాంధీ వల్ల రాలేదు

సుభాస్‌చంద్రబోసే జాతిపిత: తమిళనాడు గవర్నర్



చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్య్రం గాంధీజీ ఉద్యమం వల్ల రాలేదని, నేతాజీ సుభాస్‌చంద్రబోస్ పోరాటం కారణంగానే స్వాతంత్య్రాన్ని సముపార్జించుకున్నామని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్థానిక అడయార్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన నేతాజీ జయంతి వేడుకల సభలో ఆయన చాన్సలర్ హోదాలో ప్రసంగిస్తూ... ‘నేతాజీ ఇండియన్ నేషనల్ ఫోర్స్’ పేరుతో సైనికదళం తెల్లదొరలకు సింహస్వప్నంగా ఉండేదని, సుభాస్ చంద్రబోసే మన జాతిపిత అని పేర్కొన్నారు. ఆంగ్లేయులు జాతీయ కాంగ్రెస్ ఉద్యమం వల్ల భారతదేశాన్ని విడిచివెళ్లలేదని బ్రిటన్ ప్రధాని అట్లీ గతంలో పేర్కొన్నారని గవర్నర్ రవి గుర్తు చేశారు.

మాల్దీవులకు చైనా నిఘా నౌక!

మాలె, జనవరి 23: భారత్‌తో దౌత్య వివాదం నడుస్తున్న వేళ మాల్దీవుల ప్రభుత్వం తాజాగా మరోసారి రెచ్చగొట్టే చర్యకు పూనుకొంది. హిందూ మహా సముద్రంలోని తమ తీర జలాల్లో చైనా నిఘా నౌకను నిలిపేందుకు అనుమతిచ్చింది. సిబ్బంది రొటేషన్, ఇతర అవసరాలకోసమే ఈ నౌకకు ఆశ్రయం ఇస్తున్నామని.. మిత్ర దేశాలకు చెందిన వాహనాలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని వ్యాఖ్యానించింది. చైనా నుంచి బయల్దేరిన ఈ నౌక ఫిబ్రవరి 8న మాల్దీవులకు చేరుకోనుంది. ఇటీవల భారత ప్రధాని మోదీపై మాల్దీవులకు చెందిన ముగ్గురు మంత్రులు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అంతకుముందు ఆ దేశాధ్యక్షుడు ముయిజ్జు మాల్దీవుల నుంచి భారత సైన్యాన్ని వెళ్లిపోవాల్సిందిగా కోరారు. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇప్పుడు ఏకంగా చైనాకు చెందిన నిఘా నౌక షియాన్ యాంగ్ హాంగ్-3ను మాల్దీవులు అనుమతించింది.

కెనడా వీసా కట్.. నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ, జనవరి 23: కొత్తగా వచ్చే విదేశీ విద్యార్థుల వీసాలపై రెండేళ్ల పరిమితి విధిస్తున్నట్టు కెనడా ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో పెరుగుతున్న ఇళ్ల సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, సంస్థాగతంగా వక్రమార్గాలు అనుసరించేవారికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంగళవారం వెల్లడించింది. ఉన్నత విద్యకోసం కెనడా వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించుకున్న భారతీయ విద్యార్థులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడాలో ఇంటి అద్దెలు, ఆహార పదార్థాల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో జస్టిన్ ట్రూడో ప్రభుత్వం వీసా నిబంధనలను మార్చింది. ప్రస్తుతం 2.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడాలో వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారు. తాజా నిర్ణయంతో 2024 సంవత్సరంలో జారీ చేసే విద్యా వీసాల సంఖ్య 35% తగ్గనున్నట్టు కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ చెప్పారు.

చెత్త వేయొద్దన్నందుకు దళిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ దంపతులపై దాడి

» నడిరోడ్డుపై జుట్టుపట్టుకుని కొట్టిన నిందితుడు

» మనస్తాపంతో మహిళా ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో రజనీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23: చెత్త వేయొద్దు అన్నందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లయిన దళిత దంపతులపై నడిరోడ్డుపై అమానుషంగా దాడిచేసిన సంఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది. నగరపాలక సంస్థ పరిధి పబ్లిక్ హెల్త్ విభాగంలో కప్పల రజనీదేవి, ధనరాజు దంపతులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నారు. ఈ నెల 21న విధి నిర్వహణలో ఉండగా మోరంపూడి సమీపంలో పెదిరెడ్డి వెంకన్నబాబు తన ఇంటిలోని చెత్తను రోడ్డు డివైడర్‌లో ఉన్న మొక్కల్లో వేయడాన్ని గమనించి నిలదీశారు. చెత్త అక్కడ వేయకూడదని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంత చెప్పినా వెంకన్న వినకపోవడంతో ధనరాజు డివైడర్ మధ్యలో పోసిన చెత్తను ఫొటో తీశారు. దీంతో వెంకన్న అతని చేతిలో ఉన్న ఇనుప గమేళాతో ధనరాజు తలపై కొట్టడంతో గాయమై రక్తం కారింది. రజనీదేవి.. వెంకన్నను వారించగా ఆమెను కూడా జుట్టుపట్టుకుని కొట్టాడు. దీంతో ఆ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులైనా వెంకన్నపై పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కాగా, రజనీదేవిని వెంకన్న జుట్టుపట్టుకుని కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వెంటనే ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితుడిని ఇంకా అరెస్టు చేయకపోవడంపై ఎస్సీ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

30 నుంచి మలి దశ ఉద్యమం: సర్పంచులు

విజయవాడ (గవర్నర్‌పేట), జనవరి 23: గ్రామ స్వరాజ్యం కోరుకున్న మహాత్మగాంధీ వర్ధంతి రోజైన ఈ నెల 30 నుంచి మలి దశ ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామని సర్పంచుల సంఘం తీర్మానించింది. విజయవాడలో మంగళవారం ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏపీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావుల అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 16 డిమాండ్ల సాధన కోసం పలు తీర్మానాలు ఆమోదించారు. ఆందోళనా కార్యక్రమాలను ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు జరిగేప్పుడు ‘చలో అసెంబ్లీ’ కార్యక్రమాన్ని చేపట్టాలని, జిల్లా కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు చేయాలని తీర్మానించారు.

ఎట్టకేలకు వెలిగొండ రెండో సొరంగం పూర్తి

» పనులు మొదలైన 16 ఏళ్లకు రెండు సొరంగాలు పూర్తి


పెద్ద దోర్నాల, జనవరి 23: ప్రకాశం జిల్లా ప్రజల ఆశాజ్యోతి.. ‘పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు’లోని రెండో సొరంగం తవ్వకం పనులు పూర్తయినట్టు ఆ శాఖాధికారులు మంగళవారం వెల్లడించారు. మొదటి సొరంగం తవ్వకం పనులు 2021 జనవరిలో పూర్తయ్యాయి. దీంతో ప్రాజెక్టులోని కీలకమైన సొరంగాల తవ్వకం పనులను 16 ఏళ్ల తర్వాత పూర్తి చేసినట్టయింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో మొదటి సొరంగం, 2009లో రెండో సొరంగం పనులు ప్రారంభించింది. తొలిదశలో నిర్మాణాలు చురుగ్గానే సాగాయి. అనంతరం సాంకేతిక లోపంతోపాటు ప్రభుత్వాల అలసత్వం కారణంగా పనుల్లో అంతులేని జాప్యం చోటుచేసుకుంది. అనంతరం గత టీడీపీ హయాంలో మొదటి సొరంగం 5 కిలోమీటర్లు, రెండో సొరంగం 3.49 కి.మీ. మేర తవ్వారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు పూర్తిచేస్తామని చెప్పిన వైసీపీ.. అధికారంలోకి వచ్చాక మాత్రం నిధులు పూర్తిస్థాయిలో కేటాయించలేదు. దీంతో ఐదేళ్ల కాలంలో మొదటి సొరంగం 3 కి.మీ. రెండో సొరంగం 6 కి.మీ పూర్తి చేయగలిగారు.

పెండింగులో నిర్మాణ పనులు

రెండు సొరంగాల తవ్వకాల పనులైతే పూర్తి చేశారు.. కానీ, ఆ సొరంగాల పటిష్టతకు చర్యలు చేపట్టలేదు. ఈ ప్రభుత్వంలో టీబీఎంలతో పనులు నిలిపివేసి మాన్యువల్‌గా బాంబింగ్ చేస్తూ, తవ్వకం పనులు చేశారు. కానీ లైనింగ్ చేయలేదు. మొదటి సొరంగలో సుమారు 2 కి.మీ, రెండో సొరంగంలో 6 కి.మీ పొడవునా సెగ్మెంట్లు ఏర్పాటు చేసి సిమెంటు కాంక్రీట్ చేయాల్సి ఉంది. రెండు సొరంగాలను కలుపుతూ ఏర్పాటు చేసిన గండ్లు పూడ్చాలి. ప్రధానంగా ఫీడర్ కెనాల్‌లో చిల్లకంప తొలగించాలి. మెతక ఉన్నచోట కరకట్టలు పటిష్టం చేయాలి. సిమెంటు లైనింగ్ చేయాల్సి ఉంది. కాలువపై బ్రిడ్జీల నిర్మాణం చేయాలి. నిర్వాసితులకు పరిహారం అందించాల్సి ఉంది.

సమతా క్రాంతిదర్శికి భారతరత్న

సామాజిక సమానత్వానికి జీవితాంతం కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం



న్యూఢిల్లీ, పాట్నా, జనవరి 23: దేశంలో సామాజిక సమానత్వ రాజకీయాలకు మూలస్తంభంగా నిలిచిన సోషలిస్టు నాయకుడు, లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్, నితీశ్ కుమార్‌ల గురువు, బిహార్ తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ప్రకటించింది. రాష్ట్రపతి భవన్ మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. “కర్పూరీ ఠాకూర్‌కు(మరణానంతరం) భారతరత్న పురస్కారం ప్రదానం చేయటానికి రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేస్తున్నారు” అని ఆ ప్రకటన పేర్కొంది. ఇది కర్పూరీ ఠాకూర్ శత జయంతి సంవత్సరం కావటం విశేషం. ఆయనకు భారతరత్నను ప్రకటించటంపై ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ.. “నిమ్న వర్గాల అభ్యున్నతి పట్ల కర్పూరీ ఠాకూర్ చూపిన రాజీలేని అంకితభావం, ఆయన దార్శనిక నాయకత్వం భారత సామాజిక-రాజకీయ ముఖచిత్రంపై చెరిగిపోని ముద్ర వేసింది” అని పేర్కొన్నారు. నిరాడంబరతకు, నిస్వార్థానికి, అత్యున్నత విలువలకు నిలువెత్తు ప్రతిబింబం వంటి కర్పూరీ ఠాకూర్(1924-88) తాను జన్మించిన బిహార్‌లోనే కాదు.. యావత్ ఉత్తరాది ప్రజానీకంపై ప్రభావం చూపిన నేత. అందుకే ఆయనను ప్రజలు ప్రేమతో జన్‌నాయక్ అని పిలిచేవారు.

సాధారణ నేపథ్యం.. అత్యున్నత స్థాయికి..

1924 జనవరి 24వ తేదీన బిహార్‌లో సమస్తిపూర్ జిల్లాలోని పితోంఝియా గ్రామంలో నాయీసమాజ్ (నాయీబ్రాహ్మణ) సామాజిక వర్గంలో కర్పూరీ ఠాకూర్ జన్మించారు. ఆ రోజుల్లో ఉధృతంగా సాగుతున్న స్వాతంత్య్రోద్యమం ఆయనను ఆకర్షించింది. ఏఐఎస్ఎఫ్ విద్యార్థిసంఘంలో చేరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1942-45 మధ్య జైలు జీవితం గడిపారు. స్వాతంత్య్రానంతరం తన గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రజాజీవితంలో ఉన్న ఆయన 1952లో సోషలిస్టు పార్టీ తరఫున బిహార్ అసెంబ్లీకి పోటీ చేసి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ రోజుల్లో బిహార్ నుంచి ఆస్ట్రియాకు వెళ్లిన ఓ ప్రతినిధి బృందంలో కర్పూరీ కూడా ఉన్నారు. ఆయనకు కోటు లేకపోవటంతో ఒక స్నేహితుడి వద్ద అడిగి తీసుకున్నారు. అయితే, అది కూడా చిరిగిపోయి ఉంది. దాన్ని చూసిన యుగోస్లేవియా అధినేత మార్షల్ టిటో కర్పూరీ ఠాకూర్‌కు ఒక కొత్త కోటు అందించారు. రెండుసార్లు బిహార్ సీఎంగా పని చేసిన ఆయనకు సొంత ఇల్లు, కారు వంటి సౌకర్యాలు అటుంచి.. సరైన దుస్తులు కూడా ఉండేవి కావు.

సీఎంగా తొలి దఫాలోనే మద్య నిషేధం

రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగిన కర్పూరీ ఠాకూర్ బిహార్ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పని చేశారు. 1970 డిసెంబరులో తొలిసారిగా కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పదవిలో 7 నెలలు మాత్రమే కొనసాగారు. అనంతరం 1977లో మరోసారి ఆ పదవిని అధిష్ఠించారు. ఆ సమయంలో రెండేళ్లపాటు పదవిలో ఉన్నారు. సీఎంగా తొలిసారి పదవిని చేపట్టినప్పుడే రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేశారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ కల్పించే ముంగేరీలాల్ కమిషన్ సిఫార్సులను అమలు చేశారు. ఈ కమిషన్ మండల్ కమిషన్ కన్నా చాలా ముందే బీసీలకు వాటా కోసం సిఫార్సు చేసింది. సమాజంలో ఉన్న కులవివక్షకు వ్యతిరేకంగా కర్పూరీ ఠాకూర్ జీవితాంతం పోరాడారు. సామాజిక సమానత్వం కోసం ఆయన అమలు చేసిన విధానాలు, సంస్కరణల ఫలితంగా.. విద్య, ఉపాధి, సాగు రంగాల్లో లక్షల మంది ప్రజలు లబ్ధి పొందారు.

ఎంతో మందికి స్ఫూర్తిదాత

స్వాతంత్య్రానంతరం సోషలిస్టు ఉద్యమానికి నేతృత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా ప్రభావం కర్పూరీ ఠాకూర్‌పై గణనీయంగా ఉంది. నాటి దిగ్గజ నేత జయప్రకాశ్ నారాయణ్‌తోనూ సన్నిహితంగా మెలిగారు. లాలూ, ములాయం, నితీశ్ తదితర నేతలకు కర్పూరీ ఠాకూర్ స్ఫూర్తిదాతగా నిలిచారు. 1988 ఫిబ్రవరి 17వ తేదీన కర్పూరీ ఠాకూర్ మరణించారు. 1952లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కర్పూరీ ఠాకూర్.. మరణించే వరకూ వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. బిహార్‌లో అనేక ప్రభుత్వ విద్యాసంస్థలకు ఆయన పేరు పెట్టారు. ఆయన స్వగ్రామాన్ని కర్పూరీగ్రామ్‌గా పిలుస్తున్నారు.

ఆ వర్గాల్లో భావోద్వేగాలు: నితీశ్

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రకటించటంపై బిహార్ సీఎం నితీశ్‌కుమార్ స్పందిస్తూ.. సామాజికంగా అణిచివేతకు, నిర్లక్ష్యానికి గురైన వర్గాలు, దళితులలో ఇది సానుకూల భావోద్వేగాలను తీసుకొస్తుందని చెప్పారు. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని తమ పార్టీ ఎంతోకాలంగా డిమాండ్ చేస్తోందని, ఆయన శతజయంతి సంవత్సరంలో ఈ పురస్కారాన్ని ప్రకటించటం తనకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ఆర్జేడీ మాత్రం భిన్నంగా స్పందించింది. కర్పూరీ ఠాకూర్ జీవించి ఉన్న రోజుల్లో ఆయనను అవమానించిన వర్గాలే ఇప్పుడు ఆయనకు పురస్కారం ఇచ్చాయని ఆర్జేడీ ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ విమర్శించారు.

ఎన్నికలకు ముందస్తు షెడ్యూలు?

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ఈసారి ముందుగానే వస్తాయన్న ఊహాగానాలు నిజమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఎన్నికల షెడ్యూలును కూడా ముందుగానే విడుదల చేసే ప్రయత్నాల్లో ఎన్నికల కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. పలు రాష్ట్రాల్లో తుది ఓటర్ల జాబితాను జనవరి 22న కాకుండా 23న విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత షెడ్యూలు ప్రకటించేందుకు శరవేగంతో కసరత్తు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఈ మేరకు అశోకా రోడ్‌లోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. మరోవైపు ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఈ నెల 11న వివిధ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చలు పూర్తి చేసింది. ఈవీఎంలు, ఓటర్ల జాబితా ప్రకటన, ఎన్నికల ఖర్చు పర్యవేక్షణపై వారితో సుదీర్ఘంగా చర్చించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూలు ఎప్పుడు ప్రకటిస్తారన్న దానిపై రాజకీయ పార్టీలు, అధికార వర్గాల మధ్య ఢిల్లీలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. క్రితంసారి ఎన్నికలు 2019 ఏప్రిల్ 19న ప్రారంభమై.. మే 19 వరకు ఏడు దశల్లో జరిగాయి. ఆ ఎన్నికలకు షెడ్యూలును 2019 మార్చి 10న ప్రకటించారు. ఈసారి ఇంకా ముందే ఎన్నికలు జరుగుతాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

27 నుంచి పూర్తి స్థాయిలో మోదీ దృష్టి..

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం తరువాత 27 నుంచి ప్రధాని మోదీ రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తారని భావిస్తున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో మహిళలకు కిసాన్ సమ్మాన్ నిధి రెట్టింపు చేయడం వంటి అనేక కీలక ప్రకటనలు మోదీ ప్రభుత్వం చేయనుంది. బడ్జెట్ సమావేశాలు పూర్తయిన వెంటనే ఏ క్షణంలోనైనా మోదీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు వెళ్లవచ్చునని అంటున్నారు. ప్రజల్లో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఊపు తగ్గకముందే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో కూడా.. ఇటీవల జరిగిన ఒక అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర పూర్తి కాకముందే, ఇండియా కూటమి సీట్లపై పొత్తులు పూర్తి కాకముందే ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తే ఎలా అన్న అంశంపై విస్తృతంగా చర్చలు జరిగాయి.

సీబీఎస్ఈ పరీక్షలు ముగిశాకే..!

దేశంలో 10వ తరగతి, 12వ తరగతి పరీక్షలు పూర్తికాకముందే ఎన్నికల షెడ్యూలు ప్రకటించే అవకాశాలు లేవని కూడా అంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర పరీక్షలు ఫిబ్రవరిలోనే పూర్తి కానున్నాయి. దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13 వరకు, సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. ఈ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే 2019లో జరిగినట్లు కాకుండా ముందుగానే ఎన్నికల షెడ్యూలు ప్రకటించే అవకాశాలున్నాయని, ఏప్రిల్‌లోనే ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తయ్యేలా సన్నాహాలు జరుగుతున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే.. ఫిబ్రవరి చివర్లోగానీ, మార్చి మొదటి వారంలోగానీ ఎన్నికల షెడ్యూలు విడుదల కావచ్చని ఒక వర్గం భావిస్తోంది.

తొలిరోజే 5లక్షల మందికి దర్శనం!

రాముడి దర్శనానికి పోటెత్తిన భక్తకోటి





అయోధ్య, జనవరి 23: అయోధ్య భక్తజన సంద్రంగా మారింది. బాలరాముడి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే రామయ్యను దాదాపు 5లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ అనంతరం వీఐపీలు మాత్రమే స్వామివారిని దర్శించుకోగా, మంగళవారం ఉదయం నుంచి సామాన్య భక్తులకు దర్శనానికి ట్రస్ట్ అధికారులు గేట్లు తెరిచారు. సోమవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలోకి లక్షలాది మంది ప్రవేశించారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరుగుతూ పోయి, మధ్యాహ్నానికి మందిర ప్రధాన ద్వారం వద్ద రద్దీ పతాక స్థాయికి చేరుకుంది. ఆలయానికి చేరుకొనే ప్రధాన మార్గమైన 13 కిలోమీటర్ల రామ్ పథ్‌లో భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం 2గంటల వరకూ 2.5లక్షల నుంచి 3లక్షల మంది స్వామివారిని దర్శించి ఉంటారని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాళ్ ప్రకటించారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి దాదాపు 5లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొంటారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు భారీగా తరలి రావడంతో వారిని అదుపుచేసేందుకు భద్రతా సిబ్బంది నానా తంటాలు పడ్డారు. 8వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, పరిస్థితి అదుపులోనే ఉందని యూపీ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ శిశిర్ పేర్కొన్నారు.

త్రేతాయుగంలో అయోధ్యలా ఉంది

బాల రాముడిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంపై ట్రస్టు ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ నగరం త్రేతాయుగం నాటి అయోధ్యలా కనిపిస్తోందని చెప్పారు. వనవాసం అనంతరం రాముడు తిరిగి వచ్చినప్పటి దృశ్యాలు మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నాయన్నారు. ఎక్కడ చూసినా ‘జై శ్రీరాం’ నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయని, మనమంతా త్రేతాయుగం నాటి అయోధ్యలో ఉన్నట్లుగా అనిపిస్తోందని పేర్కొన్నారు.

బాల రాముడు ఇకపై ‘బాలక్ రామ్’: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించిన నూతన రామ్ లల్లా విగ్రహానికి ‘బాలక్ రామ్’గా నామకరణం చేశారు. ఈ విగ్రహంలో రాముడు ఐదేళ్ల బాలుడిని పోలి ఉండటమే దీనికి కారణమని ఆలయ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. జనవరి 18న మొదటిసారి తాను విగ్రహాన్ని దర్శించుకున్నట్లు తెలిపారు. కాగా, రాముడి విగ్రహాన్ని పసుపు ధోవతి, ఎర్రటి అంగవస్త్రం ఉండేలా అలంకరిస్తారు. స్వచ్ఛమైన బంగారు జరీ, దారాలతో రూపొందించిన అంగవస్త్రంలో పవిత్ర వైష్ణవ చిహ్నాలైన శంఖం, పద్మం, చక్రం, గద ఉంటాయి. స్వామివారి దుస్తులను ఢిల్లీకి చెందిన టెక్స్‌టైల్ డిజైనర్ మనీష్ త్రిపాఠీ డిజైన్ చేశారు.

అయోధ్య రామయ్యకు కంచి కామకోటి పీఠం ఆభరణాలు

హైదరాబాద్, జనవరి 23: అయోధ్యలో కొలువుదీరిన శ్రీరాముడికి కంచి కామకోటీ పీఠం నుంచి ప్రత్యేక ఆభరణాలు అందాయి. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఈ ఆభరణాలను స్వయంగా స్వామివారికి సమర్పించారు. విజయేంద్ర సరస్వతికి ఆదివారం రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించిన విజయేంద్ర సరస్వతి ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రతిపక్షాలకు ‘బాలరాముడి’ భయం!

న్యూఢిల్లీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఊహించిన దానికంటే ఎక్కువగా ప్రజల్లో సానుకూల స్పందన లభించడంతో ప్రతిపక్షాలు తమ భవిష్యత్తు కార్యాచరణపై తీవ్ర ఆలోచనలో పడ్డట్లు కనిపిస్తోంది. తాము అనుకున్న దానికంటే ఎక్కువ ప్రతిస్పందన ప్రజల్లో కనిపిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అంగీకరించారు. అసోంలో రాహుల్‌గాంధీ ఆలయ సందర్శనకు ప్రయత్నించడం, ఇండియా కూటమికి చెందిన పలు పార్టీల నేతలు కూడా పూజల్లో పాల్గొనడం జనంలో ఒక అయోమయాన్ని సృష్టించిందని, ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విమర్శిస్తే తాము ప్రజల్లో మరింత వ్యతిరేతను ఎదుర్కొంటామన్న భయంలో చాలా మంది ప్రతిపక్ష నేతలు ఉన్నారని ఆయన అన్నారు. అయితే ఈ విషయంపై ప్రతిపక్ష పార్టీల మధ్య అంతర్గత చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ఇండియా కూటమి నేతలు సమావేశం కావాల్సిన ఆవశ్యకతను అందరూ గుర్తించారని చెప్పారు. మరో వారం రోజుల్లో పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతాయని, ఈలోపే ఇండియా కూటమి నేతలంతా ఒకసారి సమావేశమవుతారని ఆయన చెప్పారు. రామమందిరాన్ని మోదీ ఎన్నికల ఎజెండాగా మారిస్తే.. దానిని ఎదుర్కోవడం కోసం ప్రతిపక్షాలు మరింత సంఘటితమవుతాయన్నారు.

రాహుల్‌పై కేసు

అసోం సీఎం ఆదేశాలతో నమోదు చేసిన పోలీసులు



గువాహటి, జనవరి 23: కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీపై అసోం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరిట రాహుల్ నిర్వహిస్తున్న పాదయాత్రను మంగళవారం ఉదయం వారు అడ్డుకున్నారు. రాజధాని గువాహటి నగరంలోకి ఆయన పాదయాత్ర ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు అడ్డం పెట్టగా.. కాంగ్రెస్ శ్రేణులు వాటిని ఛేదించుకుని నగరంలోని ప్రధాన రహదారిపైకి అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలంటూ ప్రజలను రెచ్చగొట్టిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం సీఎం హిమంత విశ్వశర్మ ఆ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు రాహుల్ గాంధీపైన, ఆయనతో పాటు ఉన్న కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, కన్హయ్యకుమార్‌పైన.. హింసకు ప్రేరేపించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సహా పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. బారికేడ్లను ఛేదించే క్రమంలో పోలీసు సిబ్బందితో జరిగిన ఘర్షణలో అసోం రాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ భూపేంద్ర బోరాకు, అసోం అసెంబ్లీలో విపక్ష నేత దేవవ్రత సైకియాకు గాయాలయ్యాయి. అలాగే పలువురు పోలీసులకు గాయాలైనట్టు డీజీపీ డీజీ సింగ్ తెలిపారు. ఈ ఘర్షణకు ముందు.. మేఘాలయ నుంచి అసోంలోకి అడుగుపెట్టిన రాహుల్‌గాంధీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అదే మార్గంలో ప్రయాణించడానికి అనుమతించిన హిమంత సర్కారు ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుమతి ఇవ్వడం లేదని మండిపడ్డారు. బారికేడ్లను విరగ్గొట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన సింహాలుగా అభివర్ణించారు. అయితే.. ఇలాంటి హింసాత్మక ప్రవర్తన అసోం సంస్కృతి కాదని.. తమది శాంతియుత రాష్ట్రమని హిమంత వ్యాఖ్యానించారు.



పుట్టపర్తి విమానాశ్రయంలో అసమ్మతి నేత ఇంద్రజిత్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలతో మాట్లాడుతున్న సీఎం జగన్

జగన్ ఎదుటే అసమ్మతి గళం

- పుట్టపర్తి ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వొద్దు!
- వైసీపీ అసమ్మతి నేతల డిమాండ్.. ఇస్తే సహకరించేది లేదని స్పష్టీకరణ
- శ్రీధర్ రెడ్డిని ఓడిస్తామని హెచ్చరిక.. ఎయిర్‌పోర్టులోనే పంచాయితీ

పుట్టపర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌కు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయంలో సొంత పార్టీ నేతలే అసమ్మతి గళం వినిపించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి మళ్లీ అవకాశం ఇవ్వొద్దని తేల్చిచెప్పారు. ఇస్తే సహకరించేదిలేదని, ఓడిస్తామని అసమ్మతి నేతలు సోమశేఖర్‌రెడ్డి, పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో వైఎస్సార్ ఆసరా బటన్ నొక్కుడు కార్యక్రమానికి వెళ్లేందుకు జగన్ మంగళవారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు సీఎంకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలోనే అసమ్మతి నేతల పంచాయితీ నడిచింది. ఈసారి పుట్టపర్తి నుంచి తనకు అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ మాజీ సమన్వయకర్త సోమశేఖర్‌రెడ్డి కోరారు. సిటింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని పార్టీ నేతలు, క్యాడర్ వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. శ్రీధర్‌రెడ్డిని బరిలోకి దింపితే ఓడిస్తామని సీఎం ఎదుటే తెగేసి చెప్పారు. దీంతో అందరినీ కూర్చోబెట్టి పుట్టపర్తి పంచాయితీ తెంచాలని పక్కనే ఉన్న మంత్రి పెద్దిరెడ్డికి సీఎం సూచించారు. తర్వాత హెలికాప్టర్‌లో సీఎం ఉరవకొండకు వెళ్లారు. కాగా, పుట్టపర్తి ఎమ్మెల్యేపై కొన్నాళ్లుగా సొంతపార్టీ నేతలే తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. తాజాగా సీఎం వద్దే పంచాయితీ పెట్టడంతో ఎంపీ మిథున్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే ఇంట్లోనే కూర్చుని మాట్లాడుకుందాం రావాలని కోరినా.. వచ్చే ప్రసక్తే లేదని అసమ్మతి నేతలు తెగేసి చెప్పినట్లు తెలిసింది.

బిల్లులు రాక ఆస్తులమ్ముకుంటున్నారు

- వైసీపీ నేతల దుస్థితి ఇది: ఎమ్మెల్యే వసంత సంచలన వ్యాఖ్యలు

జి.కొండూరు, జనవరి 23: అభివృద్ధి పనులకు బిల్లులు అవ్వక వైసీపీ నాయకులు ఆస్తులు అమ్ముకుంటున్నారని కృష్ణా జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగళవారం జి.కొండూరు మండలంలోని వెలగలేరు పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'మైలవరంలో ఒక నాయకుడు సుమారు రూ.7 కోట్ల అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాకపోవడంతో మామిడి తోటను అమ్ముకోవాల్సి వచ్చింది. నాలుగున్నరేళ్లలో అభివృద్ధి పనులకు శాయశక్తుల నిధులు రప్పించి ఎంతో కొంత అభివృద్ధి చేశాను. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోయినా కాంట్రాక్టర్ల కాళ్లు పట్టుకొని పని చేయించాను. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు నా చుట్టూ తిరుగుతుంటే.. నేను వారిని ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కాంట్రాక్టర్ల బాధలు ఆర్చలేక, తీర్చలేక పోతున్నాను. ప్రజా ప్రతినిధిగా అభివృద్ధికి నిధులు తేలేక ఇబ్బంది పడుతున్నా. సంక్షేమంలో సంతృప్తి పరిచినా.. అభివృద్ధి విషయంలో వెనుకబడ్డాం. సంక్షేమం-అభివృద్ధి అనేవి రెండు కళ్లుగా ఉండాలి. ఒకే పని చేస్తే రెండో వైపు ఇబ్బంది అవుతుంది. గ్రామాల్లోకి వెళితే డ్రెయినేజీ నిర్మించలేదని, సీసీ రోడ్డు వేయలేదని ప్రజలు తగవులాడుతున్నారు. పై నుంచి డబ్బు రాకుంటే ఎందాక చేసేది' అని వసంత ఆవేదన వ్యక్తం చేశారు. నిస్వార్థంగా పని చేస్తున్నా విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. తన భవిష్యత్‌ను కాలమే నిర్ణయిస్తుందని అన్నారు.

చౌకబారు ఎత్తులు!

రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ బలం తగ్గించడానికి వైసీపీ కుయుక్తులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో విజయానికి అధికార వైసీపీ చౌకబారు ఎత్తుగడలకు దిగజారుతోంది. టీడీపీ సంఖ్యాబలం తగ్గించడానికి నానాపాట్లు పడుతోంది. తన చర్యలను రాజకీయ వర్గాలు తీవ్రంగా నిరసిస్తున్నా బరితెగిస్తోంది. మూడు రాజ్యసభ స్థానాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ మూడింటినీ గెలుచుకునేంత సంఖ్యా బలం అసెంబ్లీలో వైసీపీకి ఉంది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలే ఓటర్లు. కానీ చాలా మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు జగన్ సీట్లు నిరాకరించారు. వారంతా తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతుండడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. వైసీపీలో అంతర్గత సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని ఇందులో ఒక సీటుకు పోటీ పెట్టాలని టీడీపీ భావిస్తోంది. దీంతో సీట్లు గల్లంతైన ఎమ్మెల్యేలు టీడీపీ అభ్యర్థికి ఓటేస్తారేమోనని అధికార పక్షం ఆందోళన చెందుతోంది. టికెట్లు దక్కని 50 మంది వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేల్లో సగంమంది టీడీపీకి వేసినా ఆ పార్టీ ఒక రాజ్యసభ సీటును ఖాయంగా గెలుచుకుంటుంది. దీనివల్లే ఆ పార్టీ బలం తగ్గించడానికి వైసీపీ దిగజారుడు యత్నాలు మొదలుపెట్టింది.

మూడేళ్ల కిందట గంటా రాజీనామా..

వైసీపీ పెద్దల కుయుక్తుల్లో భాగంగా.. మూడేళ్ల కిందట శాసనసభ్యత్వానికి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేసిన రాజీనామాను స్పీకర్‌తో మంగళవారం ఆకస్మికంగా ఆమోదింపజేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజా సంఘాలు చేపట్టిన ఉద్యమానికి సంఘీభావంగా ఆయన అప్పట్లో రాజీనామా చేశారు. ఆ తర్వాత పలు అసెంబ్లీ సమావేశాలకూ హాజరయ్యారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కూడా వేశారు. అప్పుడేమీ మాట్లాడని స్పీకర్ కార్యాలయం ఇప్పుడు హఠాత్తుగా ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రకటించింది. ఇదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామాపై మాత్రం నిర్ణయం తీసుకోకపోవడం విశేషం.

ఆ నలుగురిపై దూరాలోచన..

శాసనసభలో టీడీపీకి పడే ఓట్లు తగ్గించడానికి వైసీపీ మరో ప్రయత్నం చేస్తోంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించడానికి పావులు కదుపుతోంది. ఆనం రామనారాయణరెడ్డి(వెంకటగిరి), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి (ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి(తాడికొండ-ఎస్సీ).. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయలేదని ఆరోపిస్తూ వారిని నిరుడు మార్చిలో సస్పెండ్ చేశారు. ఆ సమయంలో వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరలేదు. కొద్ది రోజుల క్రితం వారిపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. తర్వాత ఈ నలుగురికీ స్పీకర్ కార్యాలయం నోటీసులు పంపింది. సమాధానం పంపడానికి 15రోజుల అదనపు సమయం కావాలని వారు కోరినా వారమే గడువిస్తూ మంగళవారం స్పీకర్ కార్యాలయం వారికి మళ్లీ లేఖలు పంపింది. వాస్తవానికి టీడీపీ నుంచి కూడా నలుగురు ఎమ్మెల్యేలు వైసీపీలోకి వెళ్లారు. వీరిలో కరణం బలరాం(చీరాల), వల్లభనేని వంశీ (గన్నవరం), మద్దాలి గిరి(గుంటూరు పశ్చిమ), వాసుపల్లి గణేశ్ (విశాఖ దక్షిణ) ఉన్నారు. జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వైసీపీలో చేరారు. తమ పార్టీ నుంచి వైసీపీలోకి వెళ్లిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ శాసనసభాపక్షం కూడా స్పీకర్‌కు విజ్ఞప్తి చేసింది. వారికీ నోటీసులు వెళ్లాయి. వారు కూడా సమాధానం ఇవ్వడానికి అదనపు సమయం కోరారు. వారి విషయంలో స్పీకర్ నిర్ణయం తెలియరానప్పటికీ.. అదనపు సమయం ఇచ్చే ఉంటారని వినవస్తోంది.

'రీసర్వే' లీకులు..

మరోవైపు.. తాము సీట్లు నిరాకరించిన ఎమ్మెల్యేలను కనీసం రాజ్యసభ ఎన్నికల వరకైనా నిలుపుకోవడానికి వైసీపీ నాయకత్వం తెగ హైరానా పడుతోంది. వారు పార్టీకి వ్యతిరేకంగా ఓటేయకుండా అడ్డుకోవడానికి కొత్త ఎత్తు వేసింది. సిటింగ్ ఎమ్మెల్యేలను పక్కన పెట్టి కొత్తవారికి సీట్లు ఇచ్చిన చోట పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి రీసర్వే జరిపిస్తున్నట్లు అనుకూల మీడియాకు లీకులిచ్చింది. దీనిని వైసీపీ కూలి చానళ్లలో వండి వార్చారు. రీసర్వేలో తమకు అనుకూలంగా వస్తే మళ్లీ సీటు తమకే ఇస్తారేమోనన్న ఆశతో ఈ ఎమ్మెల్యేలు ప్రతిపక్షానికి ఓటు వేయకుండా తమతోనే ఉండిపోతారని, అందుకే రాజ్యసభ ఎన్నికలయ్యే వరకూ రీసర్వే పేరుతో వారిని కట్టిపడేయాలని జగన్ అండ్ కో భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఆలోచన తమదేనని వైసీపీకి ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న ఐ-ప్యాక్ బృందం డబ్బా కొట్టుకుంటోంది. అయితే ఇవన్నీ చౌకబారు ఎత్తుగడలని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. '50 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరిస్తే వారిలో 25-30 మంది మాకు అనుకూలంగా మారరా? ప్రజావ్యతిరేకత ఉందంటూ వారిని ఘోరంగా అవమానించి ఇప్పుడు రాజ్యసభ ఎన్నికల భయంతో దిక్కుమాలిన ఎత్తుగడలు వేస్తున్నారు. ఎమ్మెల్యేలు దిగిరారని గ్రహించాక.. చివరి క్షణంలో ఆ పార్టీ కేవలం రెండు సీట్లకే పోటీ పెట్టి ఒక సీటు మాకు వదిలిపెట్టినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభవం ఆ పార్టీని కుంగదీసింది. మరోసారి అటువంటి పరాభవానికి ఆ పార్టీ సిద్ధంగా లేదు. అందుకే కుయుక్తులకు తెరతీసింది' అని టీడీపీ ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించారు.

జగన్‌పై రఘురామ పిటిషన్.. విచారణార్హతపై 12న వాదనలు

- ఈలోపు కౌంటర్లు వేయండి
- ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నరసాపురం వైసీపీ ఎంపీ కె.రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణను హైకోర్టు ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది. పిల్ విచారణార్హతపై ఆ రోజు పిటిషనర్ వాదనలు వింటామని పేర్కొంది. ఈ వ్యవహారంలో ప్రతివాదులు ఇంకా ఎవరైనా కౌంటర్లు దాఖలు చేయాలనుకుంటే వేయవచ్చని ఆదేశించింది. అనంతరం వాటికి రిప్లయ్ కౌంటర్ దాఖలు చేయాలని రఘురామ తరఫు సీనియర్ న్యాయవాదికి సూచించింది. ఈ మేరకు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది. సీఎం జగన్, ఆయన బంధుగణంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించేలా సీబీఐని ఆదేశించాలని రఘురామ తన పిటిషన్‌లో కోరిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. దాని విచారణార్హతపై ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీంతో పిల్ విచారణార్హతను తేలుస్తామని ధర్మాసనం పేర్కొంది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా... పిల్ విచారణార్హతపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇప్పటివరకు ఎంతమంది కౌంటర్లు వేశారు.. ఇంకా ఎంతమంది దాఖలు చేయాల్సి ఉందని ధర్మాసనం ఆరా తీసింది. రఘురామ తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు బదులిస్తూ.. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న సీఎం జగన్ కౌంటర్ దాఖలు చేశారని, ఈ రోజు ఉదయమే తమకు అందజేశారని వివరించారు. దీనికి రిప్లయ్ దాఖలుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రతివాదుల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. తాము కౌంటర్ వేస్తున్నామని.. సమయం ఇవ్వాలని కోరారు. మరికొందరు ప్రభుత్వం వేసిన కౌంటర్‌ను అన్వయించుకుంటున్నట్లు తెలిపారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

మీపై వేటెందుకు వేయకూడదు?

- ఆ నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసు

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విప్‌ను ధిక్కరించి ప్రత్యర్థులకు ఓటేశారంటూ వైసీపీ నుంచి సస్పెండ్ చేసిన నలుగురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలకు నోటీసులుపంపించారు. "మీపై అనర్హత వేటు ఎందుకు వేయకూడదో సమాధానం చెప్పండి" అని నోటీసులలో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ విప్‌ను ధిక్కరించిన ఈ నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్ కార్యాలయానికి వైసీపీ గతంలో ఫిర్యాదు చేసింది. తాజా నోటీసులకు స్పందించకపోతే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే వీలుందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. గత మార్చిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కోలా గురువులు ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికలను కీలకంగా భావించిన అధికార పార్టీ క్రాస్ ఓటింగ్ కారణంగానే పాలకపక్ష అభ్యర్థి ఓడిపోయారని భావించింది. దీనికి ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి కారణమని ఆరోపించింది. ఈ నలుగురిని వైసీపీ అధిష్ఠానం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. వీరు ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ 8న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదుచేశారు. అదేవిధంగా ఇటీవల వైసీపీ నుంచి బయటకు వచ్చి జనసేనలో చేరిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ, టీడీపీలో చేరిన ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను కూడా అనర్హులుగా ప్రకటించాలని కోరారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన స్పీకర్ తమ్మినేని ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులిచ్చారు.

మూడేళ్లకు గంటా రాజీనామా ఆమోదం!



విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మూడేళ్ల క్రితం శాసన సభ్యత్వానికి రాజీనామా చేయగా స్పీకర్ తమ్మినేని సీతారాం ఇప్పుడు దానికి ఆమోదముద్ర వేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కార్మికుల ఆందోళనకు మద్దతుగా గంటా 2021 ఫిబ్రవరి 12న స్పీకర్ ఫార్మాట్‌లోనే ఏకవాక్యంలో తన రాజీనామాను పంపించారు. అప్పుడు కూడా తమ్మినేనే స్పీకర్‌గా ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో గంటా ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకోవడానికే ఆయన రాజీనామాను ఆమోదించారని టీడీపీ వర్గాలు ధ్వజమెత్తుతున్నాయి. దీనిపై గంటా స్పందిస్తూ.. ఈ ఘటనతో సీఎం జగన్ ఎంత పిరికివాడో అర్థమైందన్నారు. రాజీనామా ఆమోదం ముందు సంప్రదించాలనే కనీస సంప్రదాయం కూడా పాటించలేదని ఆక్షేపించారు. ఆయనకు జగన్‌కి రోషం, ఆత్మగౌరవం ఉంటే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధి కోసం తన రాజీనామాను ఆమోదింపజేసి, స్టీల్‌ప్లాంటు కార్మికుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. అరాచకాలకు పాల్పడుతున్న జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజ్యసభ ఎన్నికల్లో తాను ఓటేయాలని అనుకుంటున్నానని, అందుకు ఉన్న మార్గాలేమిటో న్యాయ సలహా తీసుకుంటానని అన్నారు.




అభివాదం చేస్తున్న అంగన్వాడీ నేతలు

సమ్మె విజయవంతమయ్యింది

- అధిక శాతం డిమాండ్లు సాధించుకున్నాం
- సహకరించిన అందరికీ ధన్యావాదాలు.. అంగన్వాడీ సంఘాల నేతలు

అమరావతి, విజయవాడ (గవర్నర్‌పేట), జనవరి 23: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెలో పాల్గొని విజయం సాధించామని అంగన్వాడీ యూనియన్ల నేతలు తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియూ) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకురాలు వీఆర్ జ్యోతి మంగళవారం విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె జయప్రదం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమ్మె విరమించి మంగళవారం నుంచే అంగన్వాడీలు విధుల్లో చేరారని చెప్పారు. అంగన్వాడీలతో ప్రభుత్వ చర్చలు సఫలమయ్యాయని సోమవారం రాత్రి 12 గంటల వరకు మంత్రులు, అధికారులు యూనియన్ల ప్రతినిధులతో చర్చలు జరిపారని, ఎక్కువ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మె విరమించాలని నిర్ణయించామని చెప్పారు. కాగా, ప్రభుత్వం సోమవారం రాత్రి అంగన్వాడీ సంఘాలతో జరిపిన చర్చలు సఫలం కావడంతో అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విధుల్లో చేరారు. విధుల్లోకి వచ్చిన అంగన్వాడీల నుంచి జాయినింగ్ రిపోర్టు తీసుకుని టెర్మినేషన్ ఆర్డర్లు రద్దు చేయాలని కలెక్టర్లు మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్లకు, సీడీపీవోలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే భవిష్యత్తులోనూ అంగన్వాడీలు ఉద్యమబాట పట్టకుండా ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. ఈమేరకు ఐసీడీఎస్ అధికారులు ఒక ఫార్మెట్‌ను రూపొందించి సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు వెళ్లిన అంగన్వాడీలతో ప్రమాణం చేయించుకోవాలనుకున్నారు. దీన్ని అంగన్వాడీలు తీవ్రంగా వ్యతిరేకించి, సొంతంగా ఒక ఫార్మెట్‌ను తయారు చేసి.. జాయినింగ్ రిపోర్టులు ఇచ్చారు.

గుండెపోటుతో అంగన్వాడీ వర్కర్ మృతి



మండపేట, జనవరి 23: సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి.. ఓ అంగన్‌వాడీ వర్కర్ ప్రాణాలు తీసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరానికి చెందిన చంద్రమళ్ల శేషారత్నం (50) సోమవారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. సోమవారం 'చలో విజయవాడ'కు బయల్దేరిన ఆమెతోపాటు పలువురు అంగన్వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకుని, సాయంత్రం విడిచిపెట్టారు. విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం, పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని బెదిరించడంతోనే శేషారత్నం ఒత్తిడికి గురై, చనిపోయిందని సహచర అంగన్వాడీలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులూ ఉద్యమబాట

- 25 నుంచి వచ్చే నెల 5 వరకు ఉద్యమ కార్యాచరణ

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు జగన్ సర్కార్‌పై పోరాటానికి సిద్ధమయ్యారు. ఈమేరకు సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి, గుంటూరు సంఘం ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించాయి. ఈ నెల 25న తాలూకా కేంద్రాల్లో, 29న జిల్లా కేంద్రాల్లో, ఫిబ్రవరి 5న విజయవాడలో ధర్నా చేపడతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాస్ తెలిపారు. కాగా, పెన్షనర్ల ఆందోళన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని ఏపీజేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజు పిలుపునిచ్చారు. 11వ పీఆర్సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని, డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

పర్చూరులో పాత కథే!

- తిరస్కరించిన 8వేల ఫాం-7లు మళ్లీ దాఖలు
- ముసాయిదా, తుది జాబితా మధ్య వ్యవధిలో నియోజకవర్గంలో దాదాపు 7వేల ఓట్ల తొలగింపు

బాపట్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాలు.. ఈఆర్‌వో ఫిర్యాదులతో కేసుల నమోదు... ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా త్రిసభ్య కమిటీ విచారణ... అధికారుల హెచ్చరికలు... ఇవేవీ కూడా బాపట్ల జిల్లా పర్చూరులో వైసీపీ ఫాం-7 దొంగలను అడ్డుకోలేకపోయాయి. పైగా తిరస్కరించిన ఫాం-7ల స్థానంలో మళ్లీ దరఖాస్తు చేసి ఎన్నికల కమిషన్‌కే సవాల్ విసిరారు. ముసాయిదా జాబితా విడుదలయ్యే నాటికే పర్చూరులో 11మందిపై కేసులు నమోదు కాగా, నలుగురు పోలీస్ అధికారులపై వేటు పడింది. ఇక్కడ ఫాం-7 ద్వారా తొలగించిన మొత్తం ఓట్లు 12,600. వీటిలో ముసాయిదా విడుదలకు, తుది జాబితా ప్రచురణకు మధ్య తొలగించినవే దాదాపు 7,000 వరకు ఉన్నాయి. దీంతో పాత కథే పునరావృతమైందనే విమర్శలున్నాయి.

టీడీపీ సానుభూతిపరులే టార్గెట్

తనకు ఏడాది క్రితం వివాహమైందని, భర్త ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉండటంతో తాను తల్లిదండ్రుల వద్దే ఉంటున్నానని అయినా నివాస ప్రాతిపదిన తన ఓటును ఫాం7 ద్వారా తొలగించారని పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన ఓ మహిళ వాపోయారు. కరెంటు బిల్లు, ఇంటి పన్ను అన్నీ ఇక్కడే చెల్లిస్తూ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నానని, అక్కడ తనకు ఓటు లేదని, సతీమణికి ఇక్కడే ఓటు ఉందని అయినా ఫాం-7 ద్వారా ఉద్దేశపూర్వకంగా తన ఓటు తొలగించారని పోతుకట్ల వాసి ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరూ టీడీపీ సానుభూతిపరులే కావడం గమనార్హం. ఇక యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని 5 పోలింగ్ బూత్‌ల పరిధిలో దాదాపు 60 మంది ఓట్లు తొలగించారు. వీరందరూ టీడీపీ సానుభూతిపరులు కావడంతో పాటు ఫాం-7లకు సంబంధించి త్రిసభ్య కమిటీ విచారణను ఎదుర్కొన్నవారే. గతేడాది అక్టోబరు 27న ముసాయిదా జాబితా విడుదల నాటికి పర్చూరులో వచ్చిన ఫాం-7లు 14,184 కాగా అందులో 5,600 ఓట్లను తొలగించారు. తుది జాబితా విడుదలైన 24గంటల వ్యవధిలోనే అర్హత ఉన్నా తమ ఓట్లు తొలగించారని పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు వాపోతున్నారు. స్థానికంగా నివాసం ఉండడాన్నే కొలమానంగా తీసుకుని దొడ్డిదారిన తమ ఓట్లు తొలగించారని చెబుతున్నారు.

వచ్చే ఎన్నికల్లో ఈఎస్ఎంఎస్ యాప్!

- పట్టుకున్న నగదు, నగలు, ఇతరత్రా సమాచారమంతా ఇందులో నిక్షిప్తం
- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయవంతంగా అమలు
- ఆంధ్ర సహా ఇతర చోట్ల ఏర్పాటుకు ఈసీ శిక్షణ కార్యక్రమం

అమరావతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) యాప్ అమలుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) చర్యలు చేపట్టింది. భద్రత, నిఘా, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల నడుమ నిరంతరాయంగా సమన్వయం, భాగస్వామ్యం దీని ప్రధాన లక్ష్యం. తనిఖీల్లో పట్టుబడిన నగదు, నగలు, బంగారం, చీరలు, మద్యం, డ్రగ్స్ వగైరా వివరాల డేటాను ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేసి అప్‌డేట్ చేస్తారు. వీటి ఆధారంగా తదుపరి చర్యలకు ఆస్కారం ఉంటుంది. గత నవంబరు, డిసెంబరు నెలల్లో జరిగిన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఈ వ్యవస్థను విజయవంతంగా వినియోగించారు. ఆ అనుభవంతో త్వరలో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో దీనిని అమలు చేసే దిశగా ఈసీ నడుం బిగించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారు(సీఈవో)లకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు మంగళవారం ఈసీ అధికారుల బృందం బెంగళూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఇందులో అమరావతి సచివాలయం నుంచి ఏపీ సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు ఆయా రాష్ట్రాల నుంచి సీఈవోలు, భద్రత, నిఘా సంస్థల నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు కూడా పాల్గొన్నారు. ఈఎస్ఎంఎస్ యాప్ వినియోగాన్ని ఈసీ బృందం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించింది. అధికారుల సందేహాలను కేంద్ర ఎన్నికల సంఘం డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ్ నివృతి చేశారు.

మరో వైసీపీ ఎంపీ గుడ్‌బై!

(మొదటి పేజీ తరువాయి)

తెరదించేందుకే వైసీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నా..' అని ప్రకటించారు. పల్నాడు నుంచి భారీ సంఖ్యలో ఆయన వద్దకు వచ్చిన వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా అక్కడే రాజీనామాలను ప్రకటించడం గమనార్హం. లావు త్వరలో టీడీపీలో చేరతారని.. నరసరావుపేట నుంచే లోక్‌సభకు పోటీ చేస్తారని పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది.

సీటు మారాలని ఒత్తిడి..

నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఎంపీగా ఎంతో పేరుతెచ్చుకున్న శ్రీకృష్ణదేవరాయలుకు తిరిగి టికెట్ ఇచ్చే విషయంలో సీఎం జగన్ పేచీ పెట్టటం మూలంగానే ఆయన పార్టీ వీడాల్సి వచ్చింది. వ్యూహాత్మకంగానే ఆయనకు పొగపెట్టారు. లావును కొద్దిరోజుల క్రితం జగన్ తాడేపల్లి పిలిపించారు. ఈ దఫా గుంటూరు లోక్‌సభకు పోటీచేయాలని ఒత్తిడి తెచ్చారు. అయితే ఇందుకు ఇష్టపడని లావు.. నరసరావుపేట నుంచే పోటీ చేస్తానని సీఎంకు తేల్చిచెప్పేశారు. 2019 ఎన్నికల ముందు లావు గుంటూరు ఎంపీ టికెట్ అడిగితే జగన్ నరసరావుపేట వెళ్లమన్నారు. ఇప్పుడు నరసరావుపేట నుంచి గుంటూరు పొమ్మన్నారు. ఏం తప్పు చేశానని సీటు మారాలని నేరుగా ఆయన జగన్‌నే ప్రశ్నించారు. 'పైగా రాజధాని ఇక్కడే ఉంటుందని ఎన్నికల ముందు మనం హామీ ఇచ్చి విస్మరించి వారికి ద్రోహం చేశాం. గుంటూరు నుంచి పోటీ చేస్తే ఇప్పుడు వారి వద్దకు వెళ్లి ఏ ముఖం పెట్టుకుని ఓట్లడగాలి' అంటూ కోపంగా సీఎంవో నుంచి నాడు బయటకు వచ్చేశారు. ఇదే సమయంలో ఆయన తండ్రి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యను ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు సంప్రదించారు. రాయలుకు నరసరావుపేట నుంచే పోటీ చేసే అవకాశమిస్తామని హామీ కూడా ఇచ్చారు. గత ఎన్నికల్లో అక్కడ నుంచి పోటీ చేసి ఓడిన రాయపాటి సాంబశివరావుకు వయసు మీద పడడంతో ఆ సీటుకు ఎవరినీ ఇప్పటి వరకు టీడీపీ ఎంపిక చేయలేదు. 2014లో రత్తయ్య నరసరావుపేట నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే అప్పటికే రాయపాటికి చంద్రబాబు హామీ ఇవ్వడంతో అవకాశం చేజారింది. ఆ కోపంతో ఆయన వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో తన కుమారుడికి వైసీపీ టికెట్ తెచ్చుకుని గెలిపించుకున్నారు. నాటినుంచి నిత్యం జనం మధ్యే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించారు. ఈ పార్లమెంటరీ పరిధిలో.. జనం నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఉన్నారు. జగన్ వారి జోలికి వెళ్లకుండా లావును మార్చాలనుకోవడం వైసీపీ వర్గాలకే విస్మయం కలిగిస్తోంది.

రజనితో విభేదాలు..

సీఎం జగన్‌తో కూడా శ్రీకృష్ణదేవరాయలుకు మొదటి నుంచీ సన్నిహిత సంబంధాలు ఉండేవి. అయితే లోక్‌సభ స్థానం పరిధిలోని చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజని మూలంగా క్రమక్రమంగా జగన్‌కు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని అంటారు. గత ఎన్నికల్లో లావుకు సీటిచ్చే సమయంలో రజనికి ఎన్నికల నిధులివ్వాల్సిన అవసరం లేదని సీఎం చెప్పారు. ఎన్నికల సమయంలో మిగతా అభ్యర్థులకు ఇచ్చినట్లు తనకు కూడా డబ్బులివ్వాలని రజని కోరారు. ఇందుకు లావు అంగీకరించకపోవడంతో జగన్ జోక్యం చేసుకుని కొంత మొత్తం ఇప్పించినట్లు తెలిసింది. అయితే తాను కోరినంత ఇవ్వలేదనే కోపంతో ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి రజని ఆయన పట్ల ఘర్షణ వైఖరి అవలంబించారు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ ఎంపీకి దగ్గరవడంతో లావుపై రజని మరింత అక్కసు పెంచుకున్నారు. సీఎంకు ఆయనపై పదే పదే ఫిర్యాదులు చేయడం.. ఆమెకే జగన్ మద్దతివ్వడం.. చివరకు మంత్రి పదవి కూడా కట్టబెట్టడంతో ఆతర్వాత లావు సీఎంకు దూరమయ్యారు.

రాజధాని రైతులకు అనునయింపు..

రాజధాని విషయంలో వైసీపీ ప్రతినిధిగా రైతుల శిబిరం వద్దకు వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది నచ్చని జగన్ ఆయనపై కోపం పెంచుకున్నారు. దీనికితోడు లావు టీడీపీపైన, ఆ పార్టీ అధినేత చంద్రబాబుపైనా తిట్లదాడి చేయకపోవడం ఆయనకు నచ్చలేదు.

నరసరావుపేటకు రియల్టర్?

వైసీపీ టికెట్ల ఖరారుకు తెరతీశాక.. ఇతర పార్టీల నుంచి బలమైన నేతలు.. వ్యాపార, వర్తక, వాణిజ్య, పారిశ్రామికవేత్తలెవరూ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ కోరడం లేదు. దీంతో.. సిటింగ్‌ల స్థానాలను అటూ ఇటూ చేస్తోంది. అయినా పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో.. వ్యాపార దిగ్గజాలకు టికెట్ ఆఫర్ చేస్తున్నారు. తాజాగా నరసరావుపేట లోక్‌సభ స్థానంలో పోటీ చేయాలని గుంటూరు జిల్లాకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి సీఎంవో నుంచి కబురు వెళ్లింది. ఓ రూ.20 కోట్లు ఖర్చుచేస్తే చాలని ప్రతిపాదించారు. దీంతో ఆ రియల్టర్ ఆలోచనలో పడ్డారు. వాస్తవానికి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక.. గుంటూరు జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం అటకెక్కింది. ఆ రియల్టర్ గుంటూరు నుంచి హైదరాబాద్‌కు తరలిపోయారు. అక్కడ బాగా సంపాదించారని తెలిశాక.. నరసరావుపేటలో పోటీ చేయాలని వైసీపీ పెద్దలు ఆహ్వానిస్తున్నారు.

ప్రకాశంలో.. వైసీపీకి షాకులపై షాకులు

- నేడో రేపో మాగుంట రాజీనామా!
- దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి పక్కచూపులు
- మాజీ ఎమ్మెల్యే గరటయ్య, చైతన్య కూడా

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అధికార వైసీపీకి భారీ షాకులు తగులుతున్నాయి. అధికార పార్టీ అభ్యర్థుల జాబితాలు ప్రకటించే కొద్దీ తిరుగుబాట్లు, వలసల పరంపర అధికమవుతోంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో కింది స్థాయిలో వైసీపీ శ్రేణులు, నాయకులు వలసల బాట పట్టగా.. తాజాగా మరికొందరు ముఖ్య నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి నేడో రేపో ఆ పార్టీకి రాజీనామా చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆయన కుమారుడు రాఘవరెడ్డి పార్టీలకతీతంగా లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటనలకు శ్రీకారం చుట్టారు. దర్శి వైసీపీ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు.

అనుచరులకు సంకేతాలు..?

వైసీపీకి గుడ్‌బై చెబుతున్నట్లు మాగుంట తన అనుచరులకు సంకేతాలు ఇచ్చేశారు. అయితే వైసీపీ ఒంగోలుకు కొత్త ఇన్‌చార్జిని ప్రకటించాక తన రాజీనామా పంపాలనే ఆలోచనలో ఉన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగే వైసీపీ సమావేశాలకు ఆయన వర్గీయులు దూరంగా ఉంటున్నారు. కొండపి ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి ఆదిమూలపు సురేశ్ మంగళవారం జరుగుమల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశాన్ని వారు బహిష్కరించారు. కనిగిరి, గిద్దలూరులోను ఇదేరకమైన పరిస్థితి. ఒంగోలులో మంగళవారం ఎమ్మెల్యే బాలినేని నిర్వహించిన ర్యాలీలోనూ మాగుంట ముఖ్య అనుచరులు పాల్గొనలేదు.

ప్రత్యామ్నాయం దిశగా మద్దిశెట్టి

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను కాదని జగన్ మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి టికెట్ కేటాయించారు. మద్దిశెట్టి ఒంగోలు ఎంపీ టికెట్ ఆశించగా.. కుదరదని చెప్పారు. దీంతో ఆయన టీడీపీ, జనసేన వైపు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అద్దంకిలో బాచిన కృష్ణచైతన్యను తప్పించి గుంటూరు జిల్లాకు చెందిన హనిమిరెడ్డిని తెరపైకి తెచ్చారు. దీంతో సంతమాగులూరు మండలంలోని రెడ్డి నాయకులు టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. చైతన్య కూడా టీడీపీ-జనసేన వైపు దృష్టిసారించినట్లు తెలిసింది. చీరాలలో ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేశ్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమంచి కృష్ణమోహన్ వర్గీయులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

వజ్రాలు పొదిగిన బంగారు వాచ్!

(మొదటి పేజీ తరువాయి)

పేరంటానికి వచ్చిన వీళ్లను చూసి ఆ న్యాయమూర్తి ఆశ్చర్యపోయారు. వివాహం తర్వాత ఆయన సమీపంలోని ఒక అతిథి గృహంలోకి వెళ్తుండగా... ఆయనతోపాటే వీరూ ప్రవేశించారు. టీటీడీ అదనపు ఈవోగా ధర్మారెడ్డితో పరిచయం ఉండటం, ఆయనతో పాటు వచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు కావడంతో సదరు న్యాయమూర్తి వారిని లోపలికి ఆహ్వానించారు. అసలు వీళ్లెందుకు వచ్చారు అనుకుంటుండగానే... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒక గిఫ్ట్ బాక్స్‌లో నుంచి ధగధగలాడే వస్తువు ఒకటి బయటికి తీశారు. అది... వజ్రాలు పొదిగిన బంగారు రిస్ట్ వాచ్! ఆ బ్రాండెడ్ వాచ్ విలువ సుమారు రూ2 కోట్లు! 'తీసుకోండి సర్...' అంటూ దానిని జడ్జి ముందుంచారు. అదిచూడగానే... ఆ న్యాయమూర్తి షాక్‌కు గురయ్యారు. అంతకుముందు తనకు ఎప్పుడూ ఎదురుకాని ఈ అనుభవంతో కొన్ని క్షణాలపాటు ఆయన మైండ్ బ్లాంక్ అయింది. వెంటనే తేరుకుని... కన్నెర్ర చేశారు. ఆ కానుకను వాళ్లవైపునకే విసురుగా తోసేశారు. 'ఏమిటీ నాన్సెన్స్. అసలేం జరుగుతోంది. ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అని పరుష పదజాలంతో కేకలు వేశారు. దీంతో... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ధర్మారెడ్డి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

ఇలా బయటికి వచ్చింది...

ఆ న్యాయమూర్తికి జగన్ వ్యవహార శైలి, ఆయన వెంటాడే తీరు బాగా తెలుసు! దీంతోపాటు, తన బాధ్యతగా మొత్తం విషయాన్ని లేఖ రూపంలో అప్పుడే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం... ఈ వ్యవహారంపై నిఘా వర్గాలతో విచారణ జరిపించాల్సి ఉంటుంది. అయితే... ఆ విషయం అంతటితో ముగిసేలా జగన్ మేనేజ్ చేసినట్లు సమాచారం. ఆ న్యాయమూర్తి సుప్రీంకోర్టుకు రాసిన లేఖ గురించి ఇప్పుడు చర్చ మొదలవడంతో ఈ మొత్తం అంశం వెలుగులోకి వచ్చింది.

తొలినుంచీ న్యాయవ్యవస్థపై కన్ను...

తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్రమాలు, అవినీతికి పాల్పడి... పీకల్లోతు కేసుల్లో ఇరుక్కుని, విచారణ ఎదుర్కొంటున్న జగన్ మొదటి నుంచీ న్యాయవ్యవస్థపై కన్నేశారు. అంతకుముందు కూడా ఒక జడ్జిని ఇలాగే ప్రలోభాలకు గురిచేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. కేసుల విచారణలో తనకు ఉపయోగపడిన, పడుతున్న వారిని ఎప్పటికప్పుడు ఏదోఒక రూపంలో సంతృప్తి పరుస్తూనే ఉన్నారు. దీని కోసం ఆయన కొందరు వ్యక్తులను వాడుకుంటారు. ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని, ఎలా 'ఫీల్డ్'లో దించాలో జగన్‌కు బాగా తెలుసునంటారు. అలాంటి వాళ్లను ఏదో ఒక పదవిలో కూర్చోబెడతారు. అవసరమైనప్పుడు వారిని తన అవసరాలకోసం రంగంలోకి దించుతారు. ధర్మారెడ్డి 'పాత్ర' అలాంటిదే! తిరుమల వెంకన్నపై సామాన్యుల నుంచి వీవీవీవీఐపీల దాకా అందరికీ అచంచలమైన భక్తి! తన పదవిపరంగా ఎంత పవర్‌ఫుల్ వ్యక్తి అయినా... తిరుమలకు వస్తే ధర్మారెడ్డిని అనివార్యంగానైనా కలవాల్సిందే. ఆ విధంగా ఆయన అందరికీ పరిచయం! కానీ... ఆయనది ఖరీదైన గిఫ్టులు ఇచ్చే స్థాయి కాదు. అందుకు... వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలాంటి వారిని ఉపయోగిస్తారు. పరిచయంతో మాట కలిపేందుకు ధర్మారెడ్డి, ప్రలోభాల కానుకలు అందించేందుకు మరొకరు! ఇదీ... జగన్ స్కీమింగ్! నిబద్ధత కలిగిన ఆ న్యాయమూర్తిని 'మంచి' చేసుకునేందుకు కూడా ధర్మారెడ్డినే ప్రయోగించారు.

చివరగా: మూడేళ్లకుపైబడి సర్వీసు ఉన్న హైకోర్టు న్యాయమూర్తులపై జగన్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం! వీరు భవిష్యత్తులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులయ్యే అవకాశం ఉంటుంది. వీరిని 'మంచి' చేసుకునేందుకు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నట్లు న్యాయవాద వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ తన కేసుల కోసమేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

అవినీతి షి..కారు! అక్రమాలు మోర్

- 800 కోట్ల టీడీఆర్ బాండ్ల గోల్‌మాల్
- మంత్రి సేఫ్.. కొనుగోలు దారులు ఫట్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కీలక నియోజకవర్గం నుంచి విజయం సాధించిన ఆయన ప్రస్తుతం మంత్రిగా కూడా చక్రం తిప్పుతున్నారు. ఎమ్మెల్యే అయిన నాటి నుంచి ప్రజాసేవ కంటే.. పైసలు వెనుకోసుకోవడంపైనే ఆయన దృష్టి పెట్టారన్న వాదన వినిపిస్తోంది. పైకి సౌమ్యుడిగా కనిపించే ఆయన.. తెరచాటున సంపాదన విషయంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. డంపింగ్ యార్డు, గ్రీన్‌ఫీల్డ్ కోసం సుమారు రూ.30 కోట్ల విలువైన 25 ఎకరాల భూమిని జిల్లాలోని ఓ మున్సిపాలిటీ సేకరించింది. ఈ భూమికోసం ఏకంగా రూ.800 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌లు జారీ చేశారు. వాటి జారీలో సదరు అమాత్యుడు చక్రం తిప్పారు. తన సన్నిహితులతో ముందుగానే సంబంధిత వ్యక్తుల నుంచి భూములు కొనుగోలు చేయించారు. అయితే, రిజిస్ట్రేషన్లు మాత్రం చేయించుకోకుండా కేవలం అగ్రిమెంట్లు మాత్రమే చేసుకున్నారు. అగ్రిమెంట్ స్థాయిలో ఉండగానే కొనుగోలు దారుల (సన్నిహితులు) పేరుతో బాండ్‌లు ఇప్పించారు. వాస్తవానికి భూమి పట్టాలు ఎవరి పేరున ఉంటే వారికే బాండ్‌లు జారీచేయాలి. ఇక్కడే మంత్రి చక్రం తిప్పి మున్సిపల్ అధికారులను కూడా తనవైపు తిప్పుకొన్నారు. అధికారుల మెడపై కత్తి పెట్టి మరీ బాండ్‌లను రాయించుకున్నారు. ఇలా చేసినందుకు.. మంత్రి సదరు సన్నిహితుల నుంచి భారీగానే ముడుపులు దక్కించుకున్నారు. ఇది కాస్తా వివాదానికి దారితీసింది. నిబంధనలకు విరుద్ధంగా బాండ్‌లు మంజూరు చేసిన మున్సిపల్ సిబ్బంది రోడ్డున పడ్డారు. ప్రజాప్రతినిధి కోట్ల రూపాయలు పోగేసుకున్నారు. తీరా ఇప్పుడు బాండ్‌లు న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నాయి. బాండ్‌లు బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్లడంతో కొనుగోలు దారులు ప్రజా ప్రతినిధి చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధి అవినీతి షి.కారు రియల్ ఎస్టేట్ వరకు పాకింది. నియోజకవర్గంలో అనధికార లే అవుట్ వేస్తే ఎకరానికి రూ.10 లక్షలు, అధికారిక లే అవుట్ అయితే రూ.5 లక్షలు ముట్ట చెప్పాల్సిందే. నిర్మాణాలైతే అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ ఉచితంగా కేటాయించాలి. మరో ఫ్లాట్ ప్రజా ప్రతినిధి బంధువుల పేరుతో తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ చేయాలి. ఇలా నిర్మాణ రంగాన్నీ ఆయన విడిచి పెట్టలేదు. ప్రజా ప్రతినిధికి అత్యంత సన్నిహితుడు ఒకరు రూ.1.50 కోట్ల విలువ చేసే విల్లాలను నిర్మించాలని అనుకున్నారు. విషయం తెలుసుకుని తనకు ఒక విల్లా ఇవ్వాలంటూ ఈ నేత ఆదేశించారు. దీంతో రియల్టర్‌కు దిమ్మ తిరిగింది. ఏకంగా విల్లాల నిర్మాణాన్ని విరమించుకున్నారు.



అన్నింటికీ 5 శాతం కమీషన్

మున్సిపాలిటీలో భవన నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేయాలంటే 5 శాతం కమీషన్‌గా చెల్లించాల్సిన పరిస్థితి. ప్రాజెక్ట్ ధరలో 5 శాతం మంత్రికి ఇవ్వాల్సిందే. ముందుగా మంత్రితో సంప్రదించిన తర్వాత మున్సిపాలిటీ అధికారులు ప్లాన్‌కు ఒకే చెపుతున్నారు. అభ్యంతరాలు లేవంటూ గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇలా ప్రతి ప్లాన్‌కు 5% కమీషన్ కుమ్మేస్తున్నారు. భవన నిర్మాణదారులు కమీషన్ ఇచ్చాకే నిర్మాణాలు ప్రారంభించాలి. లేదంటే అధికారులు మళ్లీ కొలతలు వేస్తుంటారు. ప్రజాప్రతినిధి అవినీతి ప్రభావంతో సదరు నియోజకవర్గం పరిధిలో రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయింది. ప్రతినెలా 50 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం కష్టతరమవుతోందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రతి నెలా రూ.3 కోట్ల ఆదాయం సమకూరాలి. ఇప్పుడు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.1.50 కోట్లు రాబట్టేందుకు తంటాలు పడుతున్నారు.

పార్టీ ఖర్చుకు అవినీతి సొమ్ము

అవినీతి సొమ్మును సదరు ప్రజాప్రతినిధి తన అండగా ఉంటున్న, నమ్మకస్తుడైన పార్టీ నాయకుడి వద్ద ఉంచారు. పార్టీ కార్యకలాపాలకు అదే సొమ్ము వెచ్చిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమమైనా సరే ఖర్చుల కోసం ఆయనకే చెపుతూ వచ్చారు. ఒక దశలో అవినీతి ప్రజా ప్రతినిధి రూ.4 కోట్లు తేవాలంటూ కబురు పంపారు. కానీ, తన దగ్గర అంత సొమ్ము లేదని, పార్టీ కార్యాక్రమాల్లో ఖర్చులు పోనూ రూ.2.50 కోట్లే మిగిలిందని ఆయన పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ప్రజా ప్రతినిధికి ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో అప్పటి వరకు తనకు అండగా ఉన్నారన్న విజ్ఞతను విస్మరించి సన్నిహితునిపైనే రంకెలు వేశారు. ఫలితంగా పార్టీ కోసం కష్టపడ్డ ఆ నాయకుడు ప్రజాప్రతినిధికి దూరమై.. ప్రతిపక్షంలో చేరిపోయారు. అవినీతి దందాను తట్టుకోలేక ఎంతో మంది వైసీపీని వీడారు.

బినామీ ఆస్తి కోసం సులభ్ కాంప్లెక్స్ కూల్చివేత

అవినీతి నేత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని మున్సిపాలిటీలో సులభ్ కాంప్లెక్స్ ఉంది. దానికి ఆనుకుని ప్రైవేటు భూమి ఉంది. తక్కువ ధరకు ఆ భూమిని ప్రజాప్రతినిధి తన బినామీల పేరుతో కొనుగోలు చేశారు. ఆ తర్వాత సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేశారు. కేవలం తన బినామీ ఆస్తుల కోసం సులభ్ కాంప్లెక్స్‌ను ధ్వంసం చేయించారనే ప్రచారం ఉంది. దీంతో తానుకొన్న భూమి ధర రెట్టింపైంది. ఇలా రూ.5 కోట్ల మేర లబ్ధిపొందారు.

జగనన్న లే అవుట్ లోనూ కోట్లు

ప్రభుత్వం జగనన్న లేఅవుట్ పూడిక కోసం రూ.6 కోట్లు మంజూరు చేసింది. అంతా ఒక్కరికే అప్పగించాలంటే టెండర్‌లు పిలవాలి. దాంతో రూ.30 లక్షలు వంతున పనులను విభజించి జగనన్న లేఅవుట్‌ను పూడ్చారు. తనకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అందులోనూ మంత్రి కమీషన్‌లు దోచుకున్నారు. సదరు నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల కోసం 100 ఎకరాలు సేకరించారు. మార్కెట్ ధరకంటే ఎక్కువగా రైతులకు సొమ్ములు ఇప్పించారు. తిరిగి రైతుల నుంచి కొంత మొత్తంలో సొమ్ములు లాగేసుకున్నారు. ఇలా ప్రజాప్రతినిధికి రూ.10 కోట్లు ఆదాయం లభించిందని టాక్.

ముగ్గురు కలిసి ముడుపులు!

రాష్ట్ర స్థాయిలో కీలకంగా ఉండే ఆ ప్రజా ప్రతినిధికి కమీషన్ల కక్కుర్తి కూడా ఉంది. స్థానిక వ్యాపారుల నుంచి ఆయన కమీషన్లు తీసుకోవడం తన హక్కుగా భావిస్తారు. ప్రభుత్వం నుంచి ఇటీవల వ్యాపారులకు రూ.300 కోట్లు బిల్లులు మంజూరయ్యాయి. అందులో 15% కమీషన్ తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే.. ఈ మొత్తాన్ని ఈయన మాత్రమే కాకుండా.. రాష్ట్ర స్థాయిలో షాడో ముఖ్యమంత్రిగా పేరు పొందిన మరో నేత, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకుడు కలిసి పంచేసుకున్నారని సమాచారం. కమీషన్ రూపంలో వీరికి ఒక్కొక్కరికీ దాదాపు రూ.45 కోట్లు ముట్టిందని టాక్. అందులో మూడో వంతు పశ్చిమ ప్రజా ప్రతినిధి ఖాతాకు చేరిందట.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 24 జనవరి 2024

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఈడీ

హైదరాబాద్‌లోని డా.బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్‌ఏఓయూ)- బీఈడీ(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిని తెలుగు మాధ్యమంలో చదవాలి. అభ్యర్థులు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ పెడగాగీలలో ఒకదాన్ని ఎంచుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో పది సెంటర్లు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఒక్కో సెంటర్లో 50 సీట్లు చొప్పున మొత్తం 500 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు యూజీసీ, ఎన్‌సీటీఈ గుర్తింపులు ఉన్నాయి.



ప్రోగ్రామ్ సెంటర్లు

- ఆంధ్ర మహిళ సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, హన్మకొండ, వరంగల్
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్, కర్నూలు
- ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, బ్రాడీపేట్, గుంటూరు
- గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, మునసబ్‌పేట్, శ్రీకాకుళం
- బ్రౌన్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మం
- ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అండ్ ఎగ్జిబిషన్ సొసైటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, పరిగి, వికారాబాద్
- అన్నమాచార్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాజంపేట, కడప
- వాణీ నికేతన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ముకరంపుర, కరీంనగర్

అర్హత


- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏ/బీఏస్సీ-హోం సైన్స్/బీబీఎం/బీబీఏ/బీఈ/ బీటెక్/ఎంఏ/ఎంకాం/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్‌లోని పెడగాగీని అనుసరించి ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/ఫిజికల్ సైన్సెస్ అలైడ్ మెటీరియల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్ చదివి ఉండాలి. అభ్యర్థులు 2023 జూలై నాటికి డిగ్రీ/పీజీ పూర్తిచేసి ఉండాలి.
- ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఇన్ సర్వీస్ టీచర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ లేదా ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఫేస్ టు ఫేస్ మోడ్‌లో పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.
- ఎంబీబీఎస్/బీడీఎస్/బీపీటీ/బీఏఎంఎస్/బీఎల్/ఎల్ఎల్‌బీ/బీఫార్మసీ/బీహెచ్‌ఎంటీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/బీఏ లాంగ్వేజెస్/బీఓఎల్/ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు; డిప్లొమా(ఈసీఈ/పీఎస్ఈ) ఉత్తీర్ణులు; ప్రీ ప్రైమరీ టీచర్ ట్రెయినింగ్ సర్టిఫికెట్/డిప్లొమా(పీపీటీటీసీ) పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ నుంచి 25, రెండో పార్ట్‌లో ప్రొఫిషియెన్సీ ఇన్ తెలుగు నుంచి 25, మూడో పార్ట్‌లో జనరల్ మెంటల్ ఎబిలిటీ నుంచి 50 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం పూర్తిగా తెలుగు మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 35 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.40,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 1 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలు
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 5
- **ప్రిలిమినరీ కీ విడుదల:** మార్చి 7
- **ర్యాంక్ కార్డ్ డౌన్‌లోడింగ్:** మార్చి 15 నుంచి
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** మార్చి చివరి వారంలో
- **వెబ్‌సైట్:** www.braouonline.in

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఏ, ఎంటెక్



వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ)- ఎంసీఏ, ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వెల్లూరు, చెన్నై, భోపాల్ క్యాంపస్‌లలో ఈ రెండు ప్రోగ్రామ్‌లు; ఏపీ క్యాంపస్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉన్నాయి. సంస్థ నిర్వహించే మాస్టర్స్ ఎంట్రెన్స్ టెస్ట్(వీఐటీఎంఈఈ) 2024, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ అర్హత ఉన్నవారికి ఏఐసీటీఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: బయోటెక్నాలజీ, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సీఎస్ఈ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్/బిగ్ డేటా అనలిటిక్స్/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్), ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఐఓటీ అండ్ సెన్సార్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, క్యాడ్/క్యామ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, స్మార్ట్ మొబిలిటీ

అర్హత వివరాలు: ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఎస్సీ(సీఎస్)/బీసీఏ/బీఎస్సీ(ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఎంబీబీఎస్/ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ఎంవీఎస్సీ/ఎంసీఏ/ఎంఎస్ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వీఐటీఎంఈఈ 2024: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో టెక్నికల్ సబ్జెక్ట్ నుంచి 80, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఎంసీఏలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్, కంప్యూటర్ సంబంధిత అంశాలనుంచి 80; ఇంగ్లీష్ కమ్యూనికేషన్ అంశాల నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఎంటెక్ టెక్నికల్ సబ్జెక్టులు:** బయో మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయోటెక్నాలజీ, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మసీ, ఫిజిక్స్

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 28
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, విశాఖపట్నం, అనంతపురం, నెల్లూరు, తిరుపతి, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్
- **వీఐటీ ఎంఈఈ 2024 తేదీ:** మే 5
- **ఫలితాలు విడుదల: ఎంటెక్‌నకు మే 15న;** ఎంసీఏకు మే 17
- **ఆన్‌లైన్ కౌన్సెలింగ్:** ఎంటెక్‌నకు మే 15 నుంచి 17 వరకు; ఎంసీఏకు మే 17, 18
- **సీట్ల కేటాయింపు:** ఎంటెక్‌నకు మే 27న; ఎంసీఏకు మే 29న
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఎంసీఏకు జూన్ 10; ఎంటెక్‌నకు జూన్ 21
- **వెబ్‌సైట్:** www.vit.ac.in


జాబ్ కార్నర్

టీఎస్ఆర్టీసీలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ టీఎస్ఆర్టీసీ రీజియన్లు(డిపో/యూనిట్)లో నాన్ ఇంజనీరింగ్ విభాగంలో అప్రెంటిస్ శిక్షణకు ప్రకటన విడుదల చేసింది.

మొత్తం ఖాళీలు: 150

రీజియన్, ఖాళీల వివరాలు



1. హైదరాబాద్ రీజియన్: 26
2. సికింద్రాబాద్ రీజియన్: 18
3. మహబూబ్‌నగర్ రీజియన్: 14
4. మెదక్ రీజియన్: 12
5. నల్లగొండ రీజియన్: 12
6. రంగారెడ్డి రీజియన్: 12
7. ఆదిలాబాద్: 9
8. కరీంనగర్: 15
9. ఖమ్మం: 9
10. నిజామాబాద్: 9
11. వరంగల్: 14

అర్హత: బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ కోర్సు 2018, 2019, 2020, 2021, 2022, 2023 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

శిక్షణ వ్యవధి: మూడేళ్లు **స్టయిపెండ్:** మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు వరుసగా నెలకు రూ.15,000, రూ.16,000, రూ.17,000 చెల్లిస్తారు.

ఎంపిక విధానం: విద్యార్హతలు, ధ్రువపత్రాల పరిశీలన, స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: దరఖాస్తు సమర్పణకు ముందు http://www.nats.education.gov.in/ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు వివరాలను నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 16

వెబ్‌సైట్: https://www.tsrtc.telangana.gov.in/

ఎన్ఎండీసీలో మేనేజర్లు

హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 16

1. హెడ్-ఎన్ఎండీసీ సీఎస్ఆర్ ఫౌండేషన్: 1 పోస్టు
2. ప్రాజెక్ట్ మేనేజర్: 1 పోస్టు
3. మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీసర్: 1 పోస్టు
4. ఆఫీస్ మేనేజర్: 1 పోస్టు
5. డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు: 7 పోస్టులు
6. బ్లాక్ కో ఆర్డినేటర్లు: 5 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31 **వెబ్‌సైట్:** www.nmdc.co.in/

SCHOLARSHIP ALERT

Technip Energies India Scholarship Program

Description: Technip Energies India invites applications from female students coming from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra who are currently enrolled in the first-year of B.E./B.Tech. courses.

Eligibility: Open for female students from Delhi NCR (Ghaziabad, Noida, Gurugram, Faridabad), Bihar, Assam, Rajasthan, Tamil Nadu, Gujarat and Maharashtra.

- Applicants must be currently enrolled in the first-year of B.E./B.Tech. (Chemical, Electrical, Civil, and Mechanical Engineering) courses.
- Must have scored 70% or more marks in Class 12.
- Annual family income of the applicant must not be more than INR 4,00,000 from all sources.

Prizes & Rewards: INR 30,000

Last Date: 31-01-2024 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/TSPSS4

Disha Scholarship Program

Description: An initiative of Birlasoft to offer financial assistance and support to individuals, facilitating their educational pursuits and ensuring the successful completion of their academic journey.

Eligibility: Only Female students

- Students domiciled in Delhi NCR or Pune enrolled in the first year of General/Professional Undergraduate courses at premier NIRF institutions or accredited universities and colleges across India.
- Candidates must have 75% in aggregate or an equivalent CGPA in the Grade 12 board examination in the previous academic year from Delhi NCR and Pune, Maharashtra.
- The annual family income of the applicants from all sources must not exceed INR 5 lakh.
- Applicants must fall within the age bracket of 17 to 29 years.


Prizes & Rewards: Up to INR 25,000 annually

Last Date to Apply: 05-02-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SSPSP1

Colgate Keep India Smiling Scholarship Programme



Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in any year of the BDS (Bachelor of Dental Surgery) course in a recognised government or private institute in Maharashtra, Goa, Gujarat, Himachal Pradesh, and Andhra Pradesh. Applicants must have scored at least 60% marks in Class 12. The annual family income of the applicants from all sources must not exceed 8 lakh.

Prizes & Rewards: Financial assistance of 75,000 *Last Date to Apply:* 31-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSI3

buddy4study.com

హాయ్ బుజ్జీ




మీకు తెలుసా?

- రెక్కలు ఆలివ్ రంగులో ఉండి ఎమరాల్డ్ గ్రీన్ ఉండే ఈ పక్షి పేరు 'కియ'. ఇది చిలుక జాతికి చెందినది. ఈ జాతి న్యూజిలాండ్‌లో ఉంటుంది.
- మగ పక్షుల ముక్కు 4.5 సెం.మీ. ఉంటుంది. ఆడ పక్షుల ముక్కు చిన్నగా ఉంటుంది. ఇవి ఇతర పక్షుల గొంతును కూడా అనుకరిస్తాయి. కియ పక్షి ప్రపంచంలోనే స్మార్టెస్ట్.
- 48 సెం.మీ. పొడవు ఉంటే ఈ కియా పక్షి వింగ్ స్పాన్ 52 సెం.మీ. వీటి సంఖ్య 7 వేల వరకూ ఉంటాయి.
- ఇవి అడవులతో పాటు పార్కుల్లో, ఇళ్లలో నివసిస్తాయి.
- ఇవి మనుషులతో క్లోజ్‌గా ఉంటాయి. పైగా కారు తాళం చెవులు, కళ్లజోళ్లు, కెమెరా లెన్సులను అద్భుతంగా అర్థం చేసుకుంటాయి. వాటిని కనుక్కుంటాయి.
- గింజలు, పండ్లు, పురుగులను ఆహారంగా తీసుకుంటాయి.
- ఈ పక్షుల జీవనకాలం ఇరవయ్యేళ్లు. కొన్ని ముప్పయ్యేళ్లు కూడా జీవిస్తాయి.



- వీటి గుంపులో కనీసం 13 పక్షులు ఉంటాయి. ఇవి తెలివైనవి కాబట్టి ఇళ్లలో వస్తువులను పాడుచేస్తాయి.
- రెండు నుంచి ఐదు గుడ్లను మాత్రమే పెడతాయి. పొదిగే కాలం 14 రోజులు.

దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



5 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 211

	3				7		5	1
	8		6		9		3	2
						6		
			5			4	6	8
2	6	8			1			
		5						
8	1		9		3		4	
7	4		8				9	

సుడోకు - 210 సమాధానం

4	2	1	9	8	5	6	3	7
6	8	5	1	7	3	9	4	2
7	3	9	2	4	6	5	8	1
1	5	4	8	6	9	2	7	3
3	7	6	5	2	4	1	9	8
8	9	2	7	3	1	4	5	6
9	1	8	3	5	2	7	6	4
2	6	7	4	9	8	3	1	5
5	4	3	6	1	7	8	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.